సోమవారం
22-04-2024
విజయవాడ ప్రచురణ
సంపుటి : 72, సంచిక : 300
పేజీలు : 8+టాబ్లాయిడ్, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
# విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం


విప్లవ సారధి వి.ఐ లెనిన్ జయంతి నేడు

ఇన్సులిన్‌తో తీహార్ జైలు వద్ద

## ఆప్ ఆందోళన

**కేజ్రీవాల్‌ను చంపడానికి కుట్ర: అతిశి**

**న్యూఢిల్లీ:** ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) కార్యకర్తలు ఆదివారం ఇన్సులిన్‌లతో తీహార్ జైలు వద్ద నిరసన తెలిపారు. మధుమేహంతో బాధపడుతున్న కేజ్రీవాల్‌కు ఇన్సులిన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. 'కేజ్రీవాల్ కో ఇన్సులిన్ దో' అనే ప్లకార్డులు ప్రదర్శించారు. 'రఘుపతి రాఘవ రాజారాం' అంటూ పాట పాడారు. వందలాదిమంది ఆప్ కార్యకర్తలు జైలు వద్ద నినాదాలు చేశారు. ముఖ్యమంత్రి కేజ్రీవాల్ బ్లడ్ షుగర్ లెవల్స్ 300 మార్క్ దాటిందని ఆప్ నేతలు చెప్పారు. 'మేము ఆప్ కార్యకర్తలం... ఢిల్లీ వాసులం. బీజేపీ నుంచి ఉత్తర్వులు అందాక తీహార్ జైలు పాలకవర్గం ఇన్సులిన్ విషయంలో కాస్త తగ్గింది. కేజ్రీవాల్‌కు 54 యూనిట్ల ఇన్సులిన్ అవసరం. గత 10 రోజులుగా ఆయన బ్లడ్ షుగర్ స్థాయి 300 వద్దే ఉంటోంది. ఇంత పెరిగిన స్థాయిలో ఇన్సులిన్ అవసరం ఉంటుంది' అని మంత్రి అతిశి అన్నారు.

తాము నిరసన తెలపడానికి రాలేదని, షుగర్‌తో బాధపడుతున్న తమ సీఎంకు ఇన్సులిన్ ఇవ్వడానికి వచ్చామని ఆమె చెప్పారు. కేజ్రీవాల్‌ను చంపడానికి కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. తమ వద్ద స్పెషలిస్టు వైద్యులు ఉన్నారని తీహారు జైలు అధికారులు చెబుతున్నారని, అలాంటప్పుడు ప్రత్యేక వైద్యుని కోసం నిన్న ఎయిమ్స్‌కు ఎందుకు లేఖ రాశారని ఆమె ప్రశ్నించారు. ఇందులో కుట్ర దాగి ఉందన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ, బీజేపీ...కేజ్రీవాల్ మీద పగ పెంచుకుని అతడి ప్రాణాలకు ముప్పు తెస్తున్నారని విమర్శించారు. ఆయన ప్రాణాలు హరించేలా బ్లడ్ షుగర్ లెవల్స్ పెరిగిపోతున్నాయని ఆమె వివరించారు.

# ఏం చేసినా భయపడం

- రాంచీలో ఇండియా కూటమి నేతల గర్జన
- ఎన్ని కుట్రలు చేసినా కూటమి విడిపోదు: ఖర్గే
- నా భర్తను అంతమొందించేందుకు కుట్ర: సునీత
- ప్రతిపక్షాల అణచివేతకే దర్యాప్తు సంస్థల దుర్వినియోగం: కల్పన
- రాజ్యాంగం మారిస్తే బీజేపీ అంతం ఖాయం: తేజస్వి

**రాంచీ:** కేంద్రంలోని మతోన్మాద, నియంతృత్వ మోదీ సర్కారుకు వ్యతిరేకంగా తమ కూటమి పోరాడుతోందని ఇండియా కూటమి నేతలు పేర్కొన్నారు. జార్ఖండ్‌లోని రాంచీలో నిర్వహించిన మెగా ర్యాలీలో పాల్గొన్న కూటమి నేతలు... నియంతృత్వానికి, మతోన్మాదానికి, విద్వేష రాజకీయాలకు వ్యతిరేకంగా పోరాడి రానున్న సార్వత్రిక ఎన్నికల్లో విజయభేరి మోగిస్తామని ధీమా వ్యక్తం చేశారు. అక్రమంగా తమ నేతలను అరెస్టు చేశారని... కూటమిని భయపెట్టాలని ఎవరు ఎంత ప్రయత్నించినా తాము భయపడబోమని స్పష్టం చేశారు. తమ కూటమి శక్తి బలంగా ఉందని, ప్రధాని నరేంద్ర మోదీ అయినా, బీజేపీకి చెందిన ఎవరైనా తమ కూటమిని విచ్ఛిన్నం చేయలేరన్నారు. ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్, జార్ఖండ్ మాజీ సీఎం హేమంత్ సోరెన్ అరెస్ట్‌కు నిరసనగా ఆదివారం రాంచీలో ఇండియా కూటమి మెగా ర్యాలీ నిర్వహించింది. ఉలుగులన్ న్యాయ్ మహార్యాలీ పేరుతో జార్ఖండ్ ముక్తి మోర్చా (జేఎంఎం) అధ్వర్యంలో దీన్ని నిర్వహించారు. జార్ఖండ్ మాజీ సీఎం హేమంత్ సోరెన్ భార్య కల్పన, ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ భార్య సునీతతో పాటు జేఎంఎం అధినేత శిబు సోరెన్, నేషనల్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా, ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్, పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సహా ఇండియా కూటమికి చెందిన 28 పార్టీల నేతలు ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన భారీ బహిరంగసభకు మండుటెండను సైతం లెక్క చేయకుండా కూటమి భాగస్వామ్య పార్టీల కార్యకర్తలు వేలాదిగా హాజరయ్యారు.

మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ తమ నేతలను అక్రమంగా అరెస్టు చేశారని విమర్శించారు. జార్ఖండ్‌లో ఇండియా కూటమి నుంచి బయటకు వచ్చేందుకు అంగీకరించనందుకే హేమంత్ సోరెన్‌ను అరెస్టు చేశారని మండిపడ్డారు. తమ కూటమిని ఎవరూ ఎంత ప్రయత్నించినా విడగొట్టలేరన్నారు. 'సార్వత్రిక ఎన్నికల్లో 500, 400 సీట్లు గెలుస్తామని బీజేపీ నేతలు చెబుతూనే ఉన్నారు. కానీ ఈసారి కూటమి 'శక్తి' ఎంత బలంగా ఉందంటే అది ప్రధాని మోదీ అయినా, బీజేపీకి చెందిన ఎవరైనా విపక్ష కూటమి శక్తిని

- మిగతా 2 లో

### ఇండియా కూటమి వినూత్న నిరసన

ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్, జార్ఖండ్ మాజీ సీఎం హేమంత్ సోరెన్ అరెస్టును నిరసిస్తూ ఇండియా కూటమి వినూత్నంగా నిరసన తెలిపింది. బీజేపీకి వ్యతిరేకంగా జార్ఖండ్‌లో మెగా ర్యాలీ జరిగింది. ర్యాలీలో కేజ్రీవాల్, సోరెన్‌లకు ప్రత్యేకంగా కుర్చీలు వేసి వినూత్నంగా నిరసన తెలిపారు.

2లో

## ఏ2 ఎవరు?

- పోలీసుల దర్యాప్తు ముమ్మరం
- అనుమానితుడు దుర్గారావు విడుదల
- సీఎంపై దాడి కేసులో ట్విస్ట్

**విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:** సీఎం జగన్‌పై దాడి కేసులో కీలక పరిణామాలు చోటు చేసుకున్నాయి. ఈ కేసులో దుర్గారావును పోలీసులు విచారించి విడుదల చేశారు. ఇప్పటికే అజిత్‌సింగ్‌నగర్ వడ్డెర కాలనీకి చెందిన కొందరు అనుమానితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారిలో వేముల సతీశ్‌ను అరెస్టు చేసి ఏ1గా కేసు నమోదు చేశారు. మరో వ్యక్తి, టీడీపీ బీసీసెల్ నాయకుడు దుర్గారావును పోలీసులు ఏ2గా పెడతారన్న ప్రచారం విస్తృతంగా వచ్చింది. దుర్గారావును పోలీసులు విచారించి విడుదల చేశారు. దీంతో ఏ2గా ఎవరిని పెడతారనేదీ ప్రశ్నార్థకంగా మారింది. దుర్గారావును విడుదల చేయాలంటూ విజయవాడ సీపీ కార్యాలయం ఎదుట వారి కుటుంబీకులు ఆందోళన చేశారు. దుర్గారావుతో మరికొందరు యువకులను పోలీసులు అదుపులోకి తీసుకోవడంపై కోర్టును ఆశ్రయించారు. అదే రోజు టీడీపీ నేత బోండా ఉమామహేశ్వరరావు మీడియా సమావేశాన్ని నిర్వహించారు. సీఎంపై దాడి కేసులో తనను అక్రమంగా ఇరికించాలని చూస్తున్నారని, ఏ1గా తనను పెట్టినా ఆశ్చర్య పోనక్కరలేదని,

- మిగతా 2 లో



ఉచిత హామీలపై

## చర్చ అవశ్యం

**ఆర్‌బీఐ మాజీ గవర్నరు దువ్వూరి ఉద్ఘాటన**

**హైదరాబాద్:** ఉచిత హామీల విషయంలో రాజకీయ పార్టీలపై ఆంక్షలు విధించడంపై సమగ్ర చర్చ జరగాలని ఆర్‌బీఐ మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు అన్నారు. ఈ విషయంలో పార్టీల మధ్య ఏకాభిప్రాయం రావాల్సిన అవసరం ఉందన్నారు. అందుకోసం ప్రధానమంత్రి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం కృషి చేయాలని సూచించారు. ఈ మేరకు ఓ శ్వేతపత్రం విడుదల చేయాలని హితవు పలికారు. ఉచిత హామీలకు అయ్యే వ్యయం-చేకూరే ప్రయోజనాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సుబ్బారావు సూచించారు. ఆ బాధ్యత ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. భారత్ వంటి పేద దేశంలో అత్యంత బలహీనవర్గాలకు కొన్ని భద్రతలు

- మిగతా 2 లో

# నిజాలు మాట్లాడకుండా న్యాయస్థానం ఆంక్షలెందుకు?

- విగ్రహాలు కాదు - అవినీతిపరులను తీసుకురండి
- ప్రతిపక్షాలను ప్రజల నుంచి దూరం చేయలేరు
- సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

**విశాలాంధ్ర-విజయవాడ:** ప్రజాస్వామ్య దేశంలో వాస్తవాలు మాట్లాడకుండా రాజకీయ పార్టీలకు న్యాయస్థానాలు ఆంక్షలు విధించటం సరికాదని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ అభిప్రాయపడ్డారు. విజయవాడలోని దాసరి భవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నారాయణ మాట్లాడుతూ వివేకా హత్య కేసు గురించి, జగన్‌మోహన్‌రెడ్డి కేసుల గురించి మాట్లాడవద్దని కడప కోర్టులో జడ్జి ఆదేశించటం తగదన్నారు. సీబీఐ చార్జిషీటులో పొందుపర్చిన అంశాలే పత్రికల్లో వస్తాయని, వాటిపైనే రాజకీయపార్టీలు మాట్లాడతాయని చెప్పారు. న్యాయ వ్యవస్థ ఆంక్షలు పెడితే రాజకీయ పార్టీలు ఇక ఏం మాట్లాడాలని సందేహం వెలిబుచ్చారు. ఇలాంటి ఆంక్షల్ని సీపీఐ వ్యతిరేకిస్తున్నదని నారాయణ అన్నారు. ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేస్తానని ప్రధాని అబద్ధాలు చెపుతున్నారని విమర్శించారు. నల్లధనాన్ని వెనక్కి తీసుకువచ్చి, ప్రజల ఖాతాల్లో రూ.15 లక్షల చొప్పున జమ చేస్తానని చెప్పి మోసం చేశారన్నారు. విదేశాల్లో ఉన్న విగ్రహాలు భారత్‌కు తీసుకువస్తానని చెపుతున్న మోదీ...విగ్రహాలు కాకుండా మన దేశంలో అవినీతికి పాల్పడి విదేశాలకు పారిపోయిన దొంగలను వెనక్కి తీసుకురావాలని డిమాండ్ చేశారు. నీరవ్ మోదీ, విజయ్‌మాల్యా వంటి 29 మంది అవినీతిపరుల వద్ద రూ.10 లక్షల కోట్లు ఉన్నాయని చెప్పారు. ఉత్తర భారతదేశంలో బీజేపీకి సీట్లు తగ్గుతున్నాయని తెలిసి దక్షిణ భారతదేశంపై బీజేపీ దృష్టి పెట్టిందన్నారు. తమిళనాడులో ప్రతిపక్ష అన్నా డీఎంకే బలహీనంగా ఉన్నప్పటికీ కేంద్రంలో బీజేపీకి సీట్లు రాకూడదనే ఉద్దేశంతో డీఎంకే అధినేత స్టాలిన్ అందరినీ

- మిగతా 2 లో

చివరి దశలో మార్పులు...

## భగ్గుమన్న తెలుగు తమ్ముళ్లు

**మడకశిరలో ఫ్లెక్సీల చించివేత**

**ఉండిలో పెల్లుబికిన అసంతృప్తి**

**విశాలాంధ్రబ్యూరో-అమరావతి:** ఎన్డీఏ కూటమి ప్రధాన పార్టీ టీడీపీ...చివరి నిమిషంలో ఐదు నియోజకవర్గాల్లో అభ్యర్థుల్ని మార్చేసింది. దీంతో ఆయా నియోజకవర్గాల్లో పార్టీ శ్రేణులు భగ్గుమన్నారు. ఇప్పటికే ఎన్డీఏ కూటమి కారణంగా చాలామంది టీడీపీ సీనియర్ల టికెట్లు గల్లంతయ్యాయి. వారిలో కొందరు పార్టీని వీడగా, మరికొందరు అసంతృప్తితో ఉంటున్నారు. ఈ సమయంలో మళ్లీ ఐదుగుర్ని మార్చడంతో అక్కడ నిరసనలు నెలకొన్నాయి. పాడేరు, ఉండి, మాడుగుల, మడకశిర, వెంటగిరి అసెంబ్లీ స్థానాల్లో అంతకుముందు

- మిగతా 2 లో

బీజేపీ-టీడీపీ-వైసీపీది

# త్రికోణ ప్రేమ

2లో

- మతం పేరుతో మోదీ చిచ్చు
- కర్నూలుకు న్యాయరాజధాని ఏది?
- హామీ అమలుపరచని జగన్
- 'ఇండియా'ను గెలిపిస్తే ప్రత్యేక హోదా
- కాంగ్రెస్ న్యాయయాత్రలో షర్మిల

## ఇదీ లోకం!

రెండు కోడిపుంజులు దెబ్బలాడుకుంటుంటే చూసి ఆనందించేలాగుంది,ఏపీ రాజకీయం ఏమంటావు బావా?

# పశ్చిమాసియాలో ఉద్రిక్తత...చమురు ధరలపై ప్రభావం

**టెహ్రాన్:** ఇజ్రాయిల్-ఇరాన్ పరస్పర దాడుల నేపథ్యంలో పశ్చిమాసియాలో యుద్ధవాతావరణం నెలకొన్న సంగతి తెలిసిందే. ఈ పరిస్థితులు అంతర్జాతీయ వాణిజ్యం... మరీ ముఖ్యంగా భారత్ సహా వివిధ దేశాల్లో చమురు ధరలపై ప్రభావం పడనున్నట్లు అంచనా. సౌదీ అరేబియా, ఇరాక్, యూఏఈ దేశాల నుంచి అత్యధిక మొత్తంలో ముడి చమురును భారత్ దిగుమతి చేసుకుంటున్న సంగతి తెలిసిందే. ఇజ్రాయిల్‌పై ఇరాన్ డ్రోన్, రాకెట్ దాడులు.. అనంతరం ఇజ్రాయిల్ ప్రతీకార దాడులతో పశ్చిమాసియాలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఘర్షణ వాతావరణం క్రమంగా పెరుగుతూనే ఉంది. ఈ చర్యలను కట్టడి చేసేందుకు వివిధ దేశాలు కృషి చేస్తున్నాయి. ఈ తరుణంలో ఒకవేళ హర్మోజ్ జలసంధిని ఇరాన్ పూర్తిగా లేదా పాక్షికంగా అడ్డుకుంటే.. ముడి చమురు, ఎల్ఎన్‌జీ (లిక్విఫైడ్ నేచురల్ గ్యాస్) ధరలు పెరుగుతాయని అంతర్జాతీయ సంస్థలు అంచనా వేస్తున్నాయి. ఒమన్-ఇరాన్ సముద్ర మార్గంలో హర్మోజ్ జలసంధి ఉంటుంది. దాదాపు 40 కి.మీ మేర ఇరుకైన ప్రదేశం ఉండగా.. అందులో 2. కి.మీలు నౌకల రాకపోకల కోసం నావిగేషన్ ఛానల్ ఉంటుంది. సౌదీ అరేబియా, యూఏఈ,

కువైట్, ఖతార్, ఇరాక్, ఇరాన్ దేశాల నుంచి వివిధ దేశాలకు రోజుకు 2.1కోట్ల (21మిలియన్) బారెళ్ల చమురు ఎగుమతి అవుతుంది. ప్రపంచవ్యాప్తంగా రోజువారి వినియోగంలో ఇది 21శాతం. అంతర్జాతీయంగా ఎల్ఎన్‌జీ వినియోగంలోనూ 20శాతం ఇక్కడ నుంచే సరఫరా జరుగుతోంది. భారత్ అవసరాల్లో 85శాతం క్రూడ్ ఆయిల్ సౌదీ, ఇరాక్, యూఏఈ నుంచి వస్తుండగా.. ఖతార్ నుంచి వచ్చే ఎల్ఎన్‌జీ కూడా ఈ జలసంధి మార్గంలోనే వస్తుంది. ఈ నేపథ్యంలో ఒకవేళ 'హర్మోజ్' జలసంధిని ఇరాన్ అడ్డుకుంటే.. చమురు రవాణాకు ఎర్ర సముద్రం ప్రత్యామ్నాయంగా ఉంది. కానీ, ఎల్ఎన్‌జీ దిగుమతికి మాత్రం అటువంటి సౌలభ్యం లేదు. దీంతో భారత్‌లో ఇంధన ధరలపై ప్రభావం చూపే అవకాశం ఉన్నట్లు అంతర్జాతీయ సంస్థలు అంచనా వేస్తున్నాయి. ఇరాన్ పూర్తిగా లేదా పాక్షికంగా అడ్డుకుంటే.. క్రూడ్ ఆయిల్, ఎల్ఎన్‌జీ (లిక్విఫైడ్ నేచురల్ గ్యాస్) ధరలు పెరుగుతాయని మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ పేర్కొంది. తాజా పరిస్థితులతో ఆసియా-పసిఫిక్ ప్రాంతంలో వీటి ధరలు పెరిగే ముప్పు ఉందని మూడీస్ కూడా అంచనా వేసింది. ఇప్పటికే ఈ ఏడాది తొలి నుంచి క్రూడ్ ఆయిల్ ధరలు పెరిగే ధోరణి కనిపిస్తోందని కేర్‌ఎడ్జ్ రేటింగ్స్ డైరెక్టర్ హార్దిక్ షా పేర్కొన్నారు. ప్రస్తుతం ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య పరిస్థితులు మరింత దిగజారితే.. ముడి చమురు ధరల పెరుగుదలకు దారి తీయవచ్చన్నారు. అయినప్పటికీ, రష్యా నుంచి భారత్‌కు ఇంధన దిగుమతులు ఇటీవల పెరగడం కాస్త ఊరట కలిగించే అంశంగా నిపుణులు చెబుతున్నారు.

# శరణార్థి శిబిరంపై ఇజ్రాయిల్ దాడి

## 14 మంది మృతి

**గాజా:** పలస్తీనాపై ఇజ్రాయిల్ సాగిస్తున్న మారణకాండ కొనసాగుతూనే ఉంది. వెస్ట్ బ్యాంక్‌లోని ఓ శరణార్థి శిబిరంపై ఇజ్రాయిల్ సైన్యం జరిపిన దాడిలో 14మంది మృతిచెందినట్లు పలస్తీనా ఆరోగ్య మంత్రిత్వ శాఖ పేర్కొంది. దాదాపు 24 గంటల పాటు ఈ దాడి జరిగిందని పేర్కొంది. పలస్తీనా నగరమైన తుల్కర్మ్‌కు సమీపంలో ఉన్న నూర్ షామ్స్ ప్రాంతంలో ఇజ్రాయిల్ దళాలు శుక్రవారం తెల్లవారుజాము నుంచే దాడిని ప్రారంభించాయని పలస్తీనా ఆరోగ్య శాఖ తెలిపింది. దాదాపు 24 గంటలు అంటే శనివారం వరకు కాల్పులు జరుపుతూనే ఉన్నాయని పేర్కొంది. ఈ దాడిలో మరణించిన వారిలో ఓ బాలుడు, ఒక యువకుడు ఉన్నారని పేర్కొంది. గాయపడిన వారిని తీసుకెళ్లేందుకు వచ్చిన అంబులెన్స్ డ్రైవర్ మహ్మద్ అవద్ అల్లా మూసా(50)ను ఇజ్రాయిల్ సైన్యం చంపినట్లు పలస్తీనా రెడ్ క్రెసెంట్ సొసైటీ వెల్లడించింది. ఇలా అంబులెన్స్‌లు, వైద్య సిబ్బందిని లక్ష్యంగా చేసుకుని దాడులు చేయడం అంతర్జాతీయ మానవతా చట్టం ఉల్లంఘన కిందకు వస్తుందని ఆరోగ్య శాఖ పేర్కొంది. అయితే వెస్ట్ బ్యాంక్‌లో తమ సైన్యం జరిపిన దాడిలో 10మంది పలస్తీనా మిలిటెంట్లు మరణించారని, నలుగురు సైనికులు గాయపడ్డారని ఇజ్రాయిల్ పేర్కొంది.

**రఫాపై దాడి... 9 మంది మృతి**

శుక్రవారం రాత్రి రఫా శివారు టెల్ సుల్తాన్‌లోని నివాసభవనంపై జరిగిన వైమానిక దాడిలో ఆరుగురు చిన్నారులు సహా మొత్తం 9 మంది మరణించిన విషయం తెలిసిందే. వారంతా ఒకే కుటుంబానికి చెందినవారని బంధువులు తెలిపారు. ఇజ్రాయిల్ దాడులతో వలస వెళ్లిన గాజా ప్రజల్లో సగం మంది ఈజిప్టుకు దగ్గరలో ఉన్న రఫాలోనే తలదాచుకుంటున్నారు. గతేడాది అక్టోబర్ 7 నుంచి గాజాలో ప్రాణాలు కోల్పోయిన పలస్తీనియన్ల సంఖ్య 34,049కు చేరింది. మరో 76,901 మంది గాయపడ్డారు.

# బీజేపీ-టీడీపీ-వైసీపీది త్రికోణ ప్రేమ

**విశాలాంధ్ర బ్యూరో-కర్నూలు:** కేంద్రంలోని మోదీ ప్రభుత్వం మతం పేరుతో చిచ్చుపెడుతూ ఓట్లకోసం కుట్రలు చేస్తుందని, రాష్ట్రంలో టీడీపీ... బీజేపీతో పొత్తుపెట్టుకుంటే, వైసీపీ తొత్తుగా వ్యవహరిస్తుందని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల విమర్శించారు. న్యాయయాత్రలో భాగంగా ఆదివారం నగరంలో రోడ్‌షో నిర్వహించారు. హాస్పటల్ సెంటర్ వద్ద కర్నూలు ఎంపీ అభ్యర్థి రాంపుల్లయయ్యయాదవ్ అధ్యక్షతన జరిగిన సభలో ఆమె ప్రసంగించారు. జగన్... కర్నూలుకు న్యాయరాజధాని ఇస్తానన్నాడు ఇచ్చాడా అని ప్రశ్నించారు. ఒక్క రాజధాని కట్టలేని వాడు మూడు రాజధానులు కడతాడా అని ఎద్దేవా చేశారు. కర్నూలును స్మార్ట్ సిటీ చేస్తానన్నాడు కనీసం డ్రెయినేజీ కూడా కట్టలేదన్నారు. నాన్న రాజశేఖర్‌రెడ్డి ప్రారంభించిన ప్రాజెక్టులు ఆరు నెలల్లో పూర్తిచేస్తారని చెప్పారు... ఐదు సంవత్సరాలు అయింది, గుండ్రేవుల ప్రాజెక్టు పూర్తిచేశారా అని ప్రశ్నించారు. నిరుద్యోగులకు మోదీ సంవత్సరానికి రెండుకోట్ల ఉద్యోగాలు ఇస్తామన్నారు... ఒక్కరికి కూడా ఇవ్వలేదన్నారు. జగన్ ప్రతి ఏడాది జాబ్ క్యాలెండర్ ఇస్తానన్నారు... ఐదేళ్లలో ఒక్క జాబ్ క్యాలెండర్ కూడా ఇవ్వలేదని అన్నారు. ఎన్నికలు వస్తున్నాయని దగా డీఎస్సీ విడుదల చేశారని విమర్శించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు రెండు లక్షల 25వేల ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన తరువాత పట్టించుకోలేదన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి పోయాయని, విద్యుత్ ఛార్జిలు ఏడుసార్లు, ఆర్టీసీ బస్‌ఛార్జిలు ఐదుసార్లు పెంచారని పేర్కొన్నారు. ఓ చేత్తో మట్టిచెంబు ఇస్తూ మరో చేత్తో వెండి చెంబు తీసుకుంటున్నాడని ధ్వజమెత్తారు. మద్యం ధరలు పెంచి కల్తీ మద్యం సరఫరా చేస్తున్నారన్నారు. బీజేపీ... రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వలేదు, రాజధానికి, పోలవరానికి నిధులు ఇవ్వలేదని, అయినా టీడీపీ-వైసీపీ... బీజేపీకి గులాంగిరి చేస్తున్నాయని విమర్శించారు. బీజేపీ... వైసీపీ... టీడీపీల నడుమ త్రికోణ ప్రేమ నడుస్తోందన్నారు. ఇండియా కూటమి అధికారంలోకి వస్తే రాష్ట్రానికి ప్రత్యేక హోదా వస్తుందన్నారు. దీంతో పరిశ్రమలు వస్తాయని ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. హస్తం గుర్తుపై ఓటు వేసి ఎంపీ అభ్యర్థి రాంపుల్లయ్యయాదవ్‌ను, కోడుమూరు అసెంబ్లీ అభ్యర్థి మురళీకృష్ణను గెలిపించాలని ఆమె కోరారు. తొలుత సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.జగన్నాథం, రాంపుల్లయ్యయాదవ్, సీపీఎం నేత షరీఫ్, కాంగ్రెస్ నేత ఎస్కే మాలిక్ ప్రసంగించారు. సీపీఐ నగర కార్యదర్శి పీ రామకృష్ణారెడ్డి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బాబూరావు, సత్యనారాయణగుప్తా, సీపీఐ నేత నాగరాజు, మహేశ్, శ్రీనివాసరావు, బీసన్న ఈశ్వర్, రాము పెద్దఎత్తున నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఇజ్రాయిల్ దళంపై అమెరికా ఆంక్షలు?

## వ్యతిరేకించిన నెతన్యాహు

**టెల్ అవీవ్:** ఇజ్రాయిల్ రక్షణ దళాల (ఐడీఎఫ్)కు చెందిన 'నెట్జా యెహుదా' బెటాలియన్ పలస్తీనావాసులను చిత్రహింసలకు గురిచేసినట్లు ఆరోపణలు రావడంతో ఆ బెటాలియన్‌పై ఆంక్షలు విధించేందుకు అమెరికా సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఈ బెటాలియన్ వెస్ట్‌బ్యాంక్‌లోని పలస్తీనావాసులపై మానవ హక్కుల ఉల్లంఘనలకు పాల్పడిన నేపథ్యంలోనే ఈ నిర్ణయం తీసుకోనున్నట్లు సంబంధిత వర్గాలను ఉటంకిస్తూ యాక్సియోస్ వార్తాసంస్థ పేర్కొంది. నెట్జా యెహుదా బెటాలియన్‌పై అనేక ఆరోపణలు ఉన్నాయి. పలస్తినావాసులపై హింసాత్మక చర్యలకు పాల్పడ్డట్లు గతంలో వార్తలొచ్చాయి. 2022లో 78 ఏళ్ల పలస్తినా-అమెరికన్ ఒమర్ అసద్

మృతికి వీరే కారణమన్న ఆరోపణలున్నాయి. 2022 డిసెంబరులో వెస్ట్‌బ్యాంక్ నుంచి ఈ దళాన్ని ఇజ్రాయిల్ తరలించింది. కానీ, ప్రభుత్వం దీన్ని అధికారికంగా ధ్రువీకరించలేదు. నాటి నుంచి ఈ దళం ఇజ్రాయిల్ ఉత్తర భాగంలో పనిచేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ బెటాలియన్‌పై అనేక వివాదాలున్నాయి. కాగా అమెరికా ఆంక్షల వార్తలపై ఇజ్రాయిల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు పెదవి విరిచారు. ఉగ్రవాదులపై పోరాడుతున్న తరుణంలో వారి ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసే ఎలాంటి నిర్ణయం తీసుకోవద్దని అమెరికాను కోరారు. 'ఐడీఎఫ్‌పై ఆంక్షలు విధించొద్దు. ఇజ్రాయిల్ పౌరులపై చర్యలను నేను వ్యతిరేకిస్తున్నాను. ఆ దిశగా బైడెన్ కార్యవర్గంతోనూ మాట్లాడుతున్నాను. మా సైనికులు ఉగ్రవాదులతో పోరాడుతున్నారు. ఈ తరుణంలో ఆంక్షలు విధించడం సరికాదు. అలా చేసినట్లయితే అది అనైతికతం. దీన్ని అడ్డుకోవడానికి యత్నిస్తాం" అంటూ నెతన్యాహు 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. ఇజ్రాయిల్ జాతీయ భద్రత శాఖ మంత్రి ఇతమార్ బెన్ గవిర్ కూడా దీనిపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. తమ దళాలపై ఆంక్షలను రెడ్ లైన్‌గా భావించాల్సి ఉంటుందని... ఎట్టిపరిస్థితుల్లో అమెరికా ఒత్తిళ్లకు తలొగ్గద్దని రక్షణ మంత్రి యోవ్ గాలంట్‌కు సూచించారు.

# భగ్గుమన్న తెలుగు తమ్ముళ్లు

(మొదటిపేజీ తరువాయి)

కేటాయించిన అభ్యర్థుల పేర్లను తప్పించి, వారి స్థానంలో మరొకరికి సీట్లను కేటాయించింది. దీంతో వారందరికీ టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు బీ ఫారాలు అందజేశారు. మడకశిర అసెంబ్లీ టీడీపీ అభ్యర్థిగా ఎంఎస్‌రాజు, వెంకటగిరికి కురుగొండ్ల రామకృష్ణ, పాడేరుకు గిడ్డి ఈశ్వరి, ఉండి అసెంబ్లీకి రఘురామకృష్ణరాజు, మాడుగలకు బండారు సత్యనారాయణమూర్తికి టికెట్లు కేటాయించారు. అంతకుముందు ఎన్డీఏ కూటమి సీట్ల సర్దుబాటులో భాగంగా పెందుర్తి స్థానాన్ని జనసేనకు కేటాయించడంతో అక్కడ మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తికి అవకాశం లభించలేదు. ఈ మేరకు మాడుగుల అసెంబ్లీ స్థానాన్ని బండారుకు కేటాయించారు. ఉండి నుంచి రఘురామకృష్ణరాజుకు అవకాశం కల్పించడంతో అక్కడి సిట్టింగ్ ఎమ్మెల్యే మంతెన రామరాజుకు సీటు లభించలేదు. ఆయనను నరసాపురం టీడీపీ పార్లమెంట్ పార్టీ అధ్యక్షుడిగా నియమించారు. గతంలో మడకశిరకు సునీల్‌కుమార్‌కు టికెట్ కేటాయించగా, ఇప్పుడు ఆయనను తప్పించి ఎంఎస్ రాజుకు టికెట్ ఇచ్చారు. వెంకటగిరి స్థానాన్ని ముందుగా మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ కుమార్తె లక్ష్మీప్రియకు ఖరారు చేయగా... తాజాగా ఆమెను తొలగించి, రామకృష్ణను అభ్యర్థిగా ఖరారు చేశారు. పాడేరు అసెంబ్లీ టికెట్‌ను అంతకుముందు వెంకట రమేశ్ నాయుడుకు కేటాయించగా, తాజాగా మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరికి టిక్కెట్ ఇచ్చారు. శ్రీసత్యసాయిజిల్లా మడకశిరలో ఎంఎస్ రాజుకు టికెట్ ఇవ్వడంపై ఆయన వ్యతిరేక వర్గీయులు ఆగ్రహం వ్యక్తంచేశారు. టీడీపీ కార్యాలయం దగ్గర పార్టీ ఫ్లెక్సీలు చించిపారేసి, వాటిని దహనం చేశారు. ఫ్లెక్సీలపై ఉన్న చంద్రబాబు ఫోటోలపై చెప్పులతో కొట్టి ఆగ్రహం వ్యక్తం చేశారు. సునీల్‌కుమార్‌కు బదులుగా ఎంఎస్ రాజుకు టికెట్ ఇవ్వడాన్ని స్థానిక టీడీపీ నేతలు వ్యతిరేకిస్తున్నారు. పశ్చిమగోదావరి జిల్లా ఉండి టీడీపీ సీటును రఘురామకృష్ణరాజుకు కేటాయించడంపై ప్రస్తుత సిట్టింగ్ ఎమ్మెల్యే రామరాజు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ఆయన ఎవరికీ అందుబాటులో లేరు. భవిష్యత్ కార్యాచరణపై అనుచరులతో ఆత్మీయ సమావేశం నిర్వహించేందుకు సిద్ధమయ్యారు.

**పోలవరంలో టీడీపీ రెబల్, పెడనలో జనసేన రెబల్**

ఏలూరుజిల్లా పోలవరం అసెంబ్లీ సీటును జనసేన అభ్యర్థి బాలరాజుకు కేటాయించడంపైనా టీడీపీ నేతలు అసంతృప్తితో ఉన్నారు. పోలవరం టీడీపీ రెబల్ అభ్యర్థిగా మొడియం సూర్యచంద్రరరావు బరిలోకి రానుండటంతో ఎన్డీఏ కూటమికి పెద్ద షాక్ తగిలింది. జనసేన అభ్యర్థి బాలరాజును టీడీపీ నేతలు వ్యతిరేకిస్తూ, ఆయన ప్రచారానికి దూరంగా ఉంటున్నారు. టీడీపీ నేతలు రంగంలోకి దిగి సర్దిచెప్పినప్పటికీ, ఆయన వెనక్కి తగ్గలేదు. ఈనెల 23వ తేదీన నామినేషన్ వేసేందుకు సిద్ధమయ్యారు. పోలవరంలో జనసేన అభ్యర్థికి సహకరించేదీ లేదంటూ టీడీపీ నేతలు తెగేసి చెబుతున్నారు. దీంతో అక్కడి ఎన్డీఏ కూటమిలో గందరగోళం ఏర్పడింది. అలాగే పెడన సీటును టీడీపీకి ఇవ్వడంపై జనసేన నేతలు ఆగ్రహంగా ఉన్నారు. అక్కడ జనసేన నేత స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసేందుకు సిద్ధమయ్యారు.

# ఉచిత హామీలపై చర్చ అవశ్యం

(మొదటిపేజీ తరువాయి)

కల్పించడం దాని బాధ్యత అని గుర్తుచేశారు. అదే సమయంలో ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని వాటిని ఎంత వరకు విస్తరించవచ్చనేది సమీక్షించుకోవాలన్నారు. ఎఫ్ఆర్‌బీఎం పరిమితులను కొన్ని రాష్ట్రాలు అధిగమించడంపై మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు కేంద్రం కూడా ఆర్థిక క్రమశిక్షణ పాటించడం తప్పనిసరని సుబ్బారావు స్పష్టంచేశారు. ఎఫ్ఆర్‌బీఎం చట్టానికి కచ్చితంగా కట్టుబడి ఉండాలని సూచించారు.

2047 నాటికి భారత్ అభివృద్ధి చెందిన దేశంగా అవతరించాలంటే ఏటా 7.6 శాతం వృద్ధిరేటు నమోదు చేయాల్సిన అవసరం ఉందన్నారు. చైనా వంటి కొన్ని దేశాలు దీన్ని సాధించగలిగాయన్నారు. వాతావరణ మార్పులు, భౌగోళిక రాజకీయాల వంటి సవాళ్ల మధ్య భారత్ దాన్ని ఎంత వరకు కొనసాగించగలదనేది ప్రశ్నార్థకమేనని అభిప్రాయపడ్డారు. అభివృద్ధి చెందిన దేశానికి చట్టబద్ధ పాలన, బలమైన ప్రభుత్వం, ప్రజాస్వామ్య జవాబుదారీతనం, పటిష్ఠ సంస్థలు... నాలుగు స్తంభాల్లాంటివని దువ్వూరి వివరించారు. 'ఈ నాలుగు మనకు లేవని చెప్పలేం. అదే సమయంలో అవన్నీ ఉన్నాయనీ అనుకోలేని పరిస్థితి. వాటిని మరింత పటిష్ఠపర్చాల్సిన అవసరం ఉంది' అని వివరించారు.

# ఐదోరోజూ రైతుల నిరసన... 73 రైళ్లు రద్దు

**అంబాలా:** పంజాబ్‌లో రైతుల నిరసన ఐదో రోజుకు చేరింది. ఆదివారం కూడా పాటియాలా జిల్లాలోని శంభు రైల్వే స్టేషన్‌లో రైలు పట్టాలపై రైతులు బైఠాయించారు. ఈ నేపథ్యంలో అంబాలా-అమృత్‌సర్ మార్గంలో 73 రైళ్లను రద్దు చేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు. రైతుల ఆందోళన సందర్భంగా హర్యానా పోలీసులు అరెస్టు చేసిన ముగ్గురు రైతులను విడుదల చేయాలని రైతు నాయకులు డిమాండ్ చేస్తున్నారు. సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం), కిసాన్ మజ్దూర్ మోర్చా (కేఎంఎం) అధ్వర్యంలో బుధవారం నుంచి నిరసన చేపట్టారు. పంజాబ్, హర్యానా సరిహద్దు సమీపంలోని శంభులో అంబాలా-లూథియానా-అమృత్‌సర్ మార్గంలో రైలు పట్టాలపై బైఠాయించారు. అరెస్ట్ చేసిన ముగ్గురు రైతులను విడుదల చేసే వరకు తమ నిరసన కొనసాగుతుందని రైతులు స్పష్టం చేశారు. ఆదివారం మొత్తం 73 రైళ్లను రద్దు చేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు. గత ఐదు రోజులుగా రైళ్లను రద్దు చేయడం వల్ల ప్రయాణికులకు అసౌకర్యం కలగడంతో పాటు ఆర్థికంగా నష్టపోతున్నామని తెలిపారు. రైతుల నిరసన కారణంగా చాలా రైళ్లను దారి మళ్లించాల్సి వస్తోందని పేర్కొన్నారు. బుధవారం శంభులో అంబాలా లూథియానా-అమృత్‌సర్ మార్గంలో పట్టాలపై బైఠాయించి నిరసన తెలిపిన సందర్భంగా అరెస్టు చేసిన రైతుల్ని వెంటనే విడుదల చేయాలని రైతు నాయకులు డిమాండ్ చేశారు. పంటలకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ)కు చట్టబద్ధ హామీ సహా తమ డిమాండ్లను ఆమోదించాలని కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవడానికి ఎస్‌కేఎం, కేఎంఎం 'దిల్లీ చలో' మార్చ్‌కు పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. ఫిబ్రవరి 13 నుంచి తమ పాదయాత్రను భద్రతా దళాలు అడ్డుకోవడంతో రైతులు పంజాబ్-హర్యానా మధ్య శంభు, ఖనౌరీ సరిహద్దు పాయింట్ల వద్దనే ఉంటూ ఆందోళన కొనసాగిస్తున్నారు.

# న్యాయస్థానం ఆంక్షలెందుకు?

(మొదటిపేజీ తరువాయి)

కలుపుకుని ప్రతి ఒక్కరికీ సమాన భాగస్వామ్యం కల్పించారని చెప్పారు. తమిళనాడు ఎన్నికలకు ఎక్కువ సమయం ఇవ్వకుండా తొలి విడతలోనే ఎన్నికలు పెట్టి బీజేపీ ఎన్ని కుట్రలు చేసినా డీఎంకే, వామపక్షాలు విజయం సాధించనున్నాయని స్పష్టంచేశారు. కేరళలో కాంగ్రెస్, వామపక్షాలు పోటీ పడుతున్నాయని, వారిలో ఎవరు గెలిచినా, ఓడినా బీజేపీకి వ్యతిరేకమేనన్నారు. ఆరోగ్య కారణాలతో బెయిల్ పొందేందుకు కేజ్రీవాల్ మామిడి పండ్లు తింటున్నారంటూ ఈడీ కోర్టుకు చెప్పడాన్ని నారాయణ తప్పుబట్టారు. వైద్యులు నిర్ణయించాల్సిన అంశాలపై బీజేపీ సూచనల మేరకు ఈడీ నడుచుకోవడం తీవ్ర అభ్యంతరకరమన్నారు. దిల్లీలో కేజ్రీవాల్‌కు గల ప్రజాదరణ కాంగ్రెస్‌కు కలిసి వస్తోందన్నారు. రాజస్థాన్, ఉత్తరప్రదేశ్‌లో బీజేపీకి సీట్లు తగ్గుతున్నాయన్నారు. బీజేపీకి 400 సీట్లు వస్తే రాజ్యాంగాన్ని మార్చటం ఖాయమన్నారు. రాష్ట్రంలో వామపక్షాలు కాంగ్రెస్‌తో కలిసి పోటీచేస్తే వైసీపీ లాభపడుతుందని కొందరు వ్యాఖ్యలు చేయటాన్ని తాము ఖండిస్తున్నామన్నారు. వైసీపీ, టీడీపీ రెండూ మోదీ కాళ్లు పిసుకుతున్నాయని ధ్వజమెత్తారు. విభజన హామీలు అమలు చేయని బీజేపీకి వంతపాడుతున్నాయని విమర్శించారు. జగన్ బీజేపీపై ఈగ వాలనీయడం లేదన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం జీవోల డ్రాఫ్టులు తీసుకువచినప్పుడే జగన్‌మోహన్‌రెడ్డి సాగిలపడి మద్దతు ప్రకటిస్తున్నారని తెలిపారు. మీడియా కూడా తన ధర్మాన్ని పాటించటం లేదన్నారు. తమ అభిప్రాయం చెప్పకుండా మీడియా అనుకునే భావాన్ని తమతో చెప్పించాలకోవటం దారుణమన్నారు. రాష్ట్రంలో వామపక్ష పార్టీలు బలపడ్డాయని, కమ్యూనిస్టుల ప్రభావం కనబడుతోందన్నారు. తెలుగు రాష్ట్రాల్లో ప్రతిపక్షాలు లేకుండా చేద్దామనే కుట్ర బాగా జరుగుతోందన్నారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, చంద్రబాబు, కేసీఆర్, జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాలు అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకులు లేకుండా చేయాలని ప్రయత్నించాయని తెలిపారు. అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకులను లేకుండా చేయగలరేమోగానీ... ప్రజల్లో లేకుండా చేయలేరనే విషయాన్ని అధికార పార్టీ నేతలు గుర్తించాలని హితవు పలికారు. ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ, వైసీపీలు బీజేపీతో అనైతిక పొత్తు పెట్టుకున్నాయని మండిపడ్డారు. ఆవులు ఏ మందలోకి వెళ్లినా మన దొడ్లోనే ఈనుతాయనే భావనలో బీజేపీ ఉందని, జగన్, చంద్రబాబులో ఎవరు గెలిచినా తమకే లాభమని బీజేపీ భావిస్తోందని చెప్పారు. రాష్ట్రంలో కాంగ్రెస్, వామపక్ష పార్టీల కూటమికి ఆదరణ లభిస్తున్నదన్నారు. ఫ్యాక్షనిస్టులు రూపం మార్చుకుని పోలీసులుగా తిరుగుతున్నారని మండిపడ్డారు. విజయవాడ పోలీసు కమిషనర్ కాంతిరాణా టాటా గులకరాయితో సీఎంపై హత్యాయత్నం చేశారంటూ అభూత కల్పన చేశారని విమర్శించారు. మరణ వాంగ్మూలం అందరూ నమ్మాల్సిందేనని, కానీ ఫ్యాక్షనిస్టు మరణవాంగ్మూలం నమ్మకూడదని, అది వేరే వారిని ప్రభావితం చేస్తుందన్నారు. జెడ్ కేటగిరి భద్రత ఉన్న ముఖ్యమంత్రిపై గులకరాయి దాడి జరిగిందంటే అది పోలీసు వ్యవస్థకే అవమానమన్నారు. గులకరాయి దాడి విషయంలో వైసీపీ, టీడీపీ ఏమి చేసినా అది నాటకమేనని కొట్టిపడేశారు.

**ప్రలోభాలకు తెరతీసిన వైసీపీ, టీడీపీ: రామకృష్ణ**

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ పోలింగ్‌కు ఇంకా 22 రోజులు ఉన్నాయని, అప్పుడే ప్రధాన పార్టీలు ప్రలోభాలకు తెరతీశాయని విమర్శించారు. రాష్ట్రంలో మద్యపాన నిషేధం హామీ అమలు చేసి 2024 ఎన్నికల్లో ఓట్లు అడుగుతానని చెప్పిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి...అది అమలు చేయకుండా ఏ ముఖం పెట్టుకుని ఇప్పుడు ఓట్లు అడుగుతున్నారని నిలదీశారు. సిద్ధం సభలకు వందల సంఖ్యలో ఆర్టీసీ బస్సులు బుక్ చేసి వాటిల్లో మద్యం, బిర్యానీ, డబ్బులు పంపిణీ చేస్తున్నారని చెప్పారు. పోస్టల్ బ్యాలెట్ ఒక్కో ఓటుకి రూ.6 వేలు ఇస్తున్నారని చెప్పారు. ప్రతిపక్ష పార్టీలు సభలు పెట్టుకోవాలంటే పోలీసులు అనుమతి ఇవ్వటం లేదన్నారు. దీన్నిబట్టి రాష్ట్రంలో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు జరిపించటానికి ఎన్నికల సంఘం సరైన చర్యలు తీసుకోవటం లేదన్నారు. తన డీఎన్ఏలో ఎన్డీఏ ఉందని గొప్పలు చెపుతున్న చంద్రబాబు...గతంలో ఎన్డీఏ ప్రభుత్వంలో ఉండి కూడా రాష్ట్రానికి ఏమీ చేయలేదని విమర్శించారు. నాలుగేళ్ల తరువాత ఎన్డీఏ నుంచి బయటకు వచ్చి కేంద్రంలోనీ బీజేపీపై ధర్మపోరాట దీక్ష చేయడాన్ని గుర్తు చేశారు. రాష్ట్రంలో 25 ఎంపీ సీట్లు గెలిచి మోదీకి కానుకగా ఇస్తామని మంత్రి అంబటి రాంబాబు చెపుతున్నారని గుర్తు చేశారు. దిల్లీ ముఖ్యమంత్రిని జైలులో పెడితే ఖండించలేని స్థితిలో చంద్రబాబు, జగన్ ఉన్నారని ఆరోపించారు. తమ కేసుల భయంతో బీజేపీకి లొంగిపోయిన చంద్రబాబు, జగన్...రాష్ట్ర అభివృద్ధి కోసం కలిసి ఉంటున్నట్లు దిగజారి మాట్లాడుతున్నారని మండిపడ్డారు. విజయవాడ పార్లమెంటుకు పోటీ చేస్తున్న కేశినేని బ్రదర్స్‌లో ఎవరు గెలిచినా దిల్లీలో మోదీ బ్రదర్స్ అవుతారని చెప్పారు. ఉత్తర భారతదేశంలో మార్పు వచ్చిందని, ఇండియా కూటమి విజయం సాధిస్తుందని దీమా వ్యక్తం చేశారు. ముందుగా సార్వత్రిక ఎన్నికల్లో సీపీఐ తరపున ప్రచారం కోసం ప్రజానాట్యమండలి రూపొందించి పాటల సీడీని నారాయణ ఆవిష్కరించారు. సమావేశంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు అక్కినేని వనజ, కేవీవీ ప్రసాద్, ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు చంద్రనాయక్, కోశాధికారి ఆర్.పిచ్చయ్య పాల్గొన్నారు.

# ఏ2 ఎవరు?

(మొదటిపేజీ తరువాయి)

అదే జరిగితే జూన్ నాలుగున వారి అంతుచూస్తానంటూ హెచ్చరికలు చేశారు. బోండా ఉమా వ్యాఖ్యానించిన రోజే దుర్గారావును విడుదల చేయడం చర్చానీయాంశంగా మారింది. బోండా వ్యాఖ్యలతో పోలీసులు బెంబేలెత్తినట్లు, అందుకే దుర్గారావును వదిలేసినట్లుగా టీడీపీ శ్రేణులు భావిస్తున్నారు. అదేసమయంలో ఏ2గా ఎవరి పేరు పెడతారనేదీ వారిలో ఆందోళనకు గురిచేస్తోంది.

దుర్గారావు విడుదల అనంతరం బోండా ఉమా, ఆయన అనుచరుల్లో కలవరం చెందుతున్నారు. ఇప్పటికే ఎన్డీఏ కూటమి నుంచి టీడీపీ విజయవాడ సెంట్రల్ అభ్యర్థిగా బోండా ఉమామహేశ్వరరావు నామినేషన్ దాఖలు చేశారు. ఆయన నామినేషన్ వేసిన రోజు రాత్రికే సెంట్రల్ నియోజకవర్గ టీడీపీ కార్యాలయానికి పెద్దఎత్తున పోలీసులు చేరుకోవడంతో బోండా అదృశ్యమయ్యారన్న ప్రచారం వచ్చింది. సీఎంపై దాడి ఘటన కేసు దర్యాప్తులో భాగంగా బోండా ఉమా దగ్గరకు వెళ్లినట్లుగా తెలుస్తున్నది. ఈ కేసులో పోలీసుల విచారణ అనంతరం విడుదలైన దుర్గారావు మీడియాతో మాట్లాడారు. సీఎంపై దాడి కేసులో తన ప్రమేయం లేదని, తనకు 16 కింద నోటీసులు ఇచ్చారని స్పష్టంచేశారు.

అవసరమైతే పిలిచినప్పుడు స్టేషన్‌కు రావాలని పోలీసులు సూచించారన్నారు. తాను విడుదలయ్యాక బోండా ఉమాను కలవలేదని చెప్పారు. దుర్గారావు విడుదలతో ఈ కేసు ఇంతటితో ఆగిపోతుందా? లేక ఏ2గా ఎవరినైనా చేరుస్తారా అనేదీ ప్రశ్నార్థకంగా మారింది. రిమాండ్‌లో ఉన్న ఏ1 సతీశ్‌ను పోలీసులు కస్టడీ కోరతారని తెలిసింది.

# ఇండియా కూటమి వినూత్న నిరసన

**రాంచీ:** దిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్, జార్ఖండ్ మాజీ సీఎం హేమంత్ సోరెన్ అరెస్టును నిరసిస్తూ ఇండియా కూటమి వినూత్నంగా నిరసన తెలిపింది. ఆదివారం కూటమి అధ్వర్యంలో బీజేపీకి వ్యతిరేకంగా జార్ఖండ్‌లో మెగా ర్యాలీ జరిగింది. ఇందులో 28 ప్రతిపక్ష పార్టీలు పాల్గొన్నాయి. అక్రమంగా తమ నేతలను అరెస్టు చేశారని ప్రతిపక్షాలు ఆరోపించాయి. ర్యాలీలో కేజ్రీవాల్, సోరెన్‌లకు ప్రత్యేకంగా కుర్చీలు వేసి వినూత్నంగా నిరసన తెలిపారు. 'ఉలుగులన్ న్యాయ్ మహరల్లీ' పేరుతో జార్ఖండ్ ముక్తి మోర్చా(జేఎంఎం) ర్యాలీ నిర్వహించింది. 'ఉలుగులన్' అంటే విప్లవం అని అర్థం. గిరిజనుల హక్కుల కోసం బ్రిటీష్ వారిపై బిర్సా ముండా చేసిన పోరాటంలో ఈ పదం ఉద్భవించింది. ఇందులో పాల్గొన్న జేఎంఎం కార్యకర్తలు సోరెన్ మాస్క్‌లు ధరించి వచ్చారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సోరెన్‌ను జనవరి 31న ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అరెస్టు చేసింది. మార్చి 21న ఈడీ దిల్లీ మద్యం కుంభకోణంలో సీఎం కేజ్రీవాల్‌ను అరెస్టు చేసింది. వారి అరెస్టుకు వ్యతిరేకంగా.. 'జైలు కా తాలా తూటేగా, హేమంత్ సోరెన్ చుటేగా' (జైలు తాళం పగలగొడతాం. హేమంత్ సోరెన్‌ను విడుదల చేస్తారు), 'జార్ఖండ్ జుకేగా నహీ' (జార్ఖండ్ తలవంచదు)' వంటి నినాదాలు చేశారు. జేఎంఎం అధినేత శిబు సోరెన్, నేషనల్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా, బీహార్ మాజీ డిప్యూటీ సీఎం తేజస్వీ యాదవ్, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్, పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ తదితరులు పాల్గొన్నారు.

# ఏం చేసినా భయపడం

(మొదటిపేజీ తరువాయి)

విచ్ఛిన్నం చేయలేరు. మేం అంత బలంగా ఉన్నాం. మమ్మల్ని భయపెట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. హేమంత్ సోరెన్‌ను జైలుకు పంపి భయపెట్టాలని చూస్తే మేం భయపడం' అని ఖర్గే స్పష్టం చేశారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్మును రామమందిర శంకుస్థాపనకు, పార్లమెంటు భవన ప్రారంభోత్సవానికి ఆహ్వానించకుండా గిరిజన సమాజాన్ని ప్రధాని నరేంద్ర మోదీ అవమానించారని ఖర్గే విరుచుకుపడ్డారు. బీజేపీ ఆదివాసీలను అంటరానివారిగా పరిగణిస్తోందన్నారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఆ పార్టీ బలం 150 నుంచి 180 సీట్లకు తగ్గుతుందని జోస్యం చెప్పారు. కేజ్రీవాల్ సతీమణి సునీతా కేజ్రీవాల్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ నియంతృత్వానికి వ్యతిరేకంగా విపక్షాల కూటమి పోరాడుతోందన్నారు. తన భర్తను జైలులో అంతమొందించేందుకు కాషాయ పాలకులు కుట్ర పన్నుతున్నారన్నారు. తప్పు చేశారని తేలకుండానే ప్రతిపక్ష నేతలను జైల్లో పెట్టడం నియంతృత్వాన్ని తలపిస్తోందని సునీతా కేజ్రీవాల్ విమర్శించారు. 'అరవింద్ కేజ్రీవాల్‌కు అధికార కాంక్ష లేదు. దేశానికి సేవ చేయాలనే కోరిక ఉంది. దేశాన్ని తొలిస్థానంలో నిలబెట్టాలనుకుంటున్నారు. చదువుకున్న వారు రాజకీయాల్లోకి రాకపోతే దేశం ఎలా అభివృద్ధి చెందుతుంది. చాలామంది రాజకీయాలు నీచమైనవని అంటున్నారు. ఇప్పుడు జైలులో కేజ్రీవాల్ ఆహారంపై కెమెరా ఉంది. ఆయనకు పంపిన ఆహారంలోని ప్రతి చిన్న పదార్థాన్ని పరిశీలిస్తున్నారు. కేజ్రీవాల్ సుగర్ వ్యాధిగ్రస్థులు. ఆయన గత 12 సంవత్సరాలుగా ప్రతిరోజూ 50 యూనిట్ల ఇన్సులిన్ తీసుకుంటున్నారు. కానీ జైలులో ఆయనకు ఇన్సులిన్ ఇవ్వడం లేదు. కేజ్రీవాల్‌ను చంపాలనుకుంటున్నారు' అని సునీత ఆరోపించారు. 'బీజేపీ నియంతృత్వానికి వ్యతిరేకంగా ప్రతిపక్ష ఇండియా కూటమి పోరాడుతోంది. ఈ పోరాటంలో విజయం సాధిస్తుంది. కేజ్రీవాల్‌కు అధికారదాహం లేదు. దేశానికి మరింత సేవ చేయాలనుకుంటున్నారు. దేశాన్ని నంబర్ 1 స్థానంలో నిలపడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇది కష్టమని చాలామంది అంటున్నారు. 'జైల్ కే తాలే తూటెంగే, అరవింద్ కేజ్రీవాల్, హేమంత్ సోరెన్ చూటేంగే' జైలు గేట్లు బద్దలుగొట్టి కేజ్రీవాల్, హేమంత్ సోరెన్ బయటకు వస్తారు. నియంతృత్వానికి వ్యతిరేకంగా పోరాడి గెలుస్తాం' అని సునీత పేర్కొన్నారు. ఆర్జేడీ అగ్రనేత తేజస్వీ యాదవ్ మాట్లాడుతూ... బీజేపీ నేతలు పదే పదే రాజ్యాంగాన్ని మారుస్తామని అంటున్నారని, రాజ్యాంగాన్ని మార్చే అధికారం ఎవరికీ లేదని



తెలిపారు. 'బీజేపీ నేతలు పదే పదే రాజ్యాంగాన్ని మారుస్తామని అంటున్నారు. ఇది బాబాసాహెబ్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగం...ఎవరో బాబా రాసినది కాదు. బీహార్‌లో కూడా వారి (బీజేపీ) మంత్రులు రాజ్యాంగాన్ని మారుస్తామని చెబుతున్నారు. మాట్లాడేముందు ఒకసారి ఆలోచించండి. రాజ్యాంగాన్ని మార్చాలని ఆలోచిస్తే దేశ ప్రజలు మిమ్మల్ని అంతం చేస్తారు' అని హెచ్చరించారు. మాజీ సీఎం హేమంత్ సోరెన్ జైలు నుంచి ఓ సందేశం పంపారు. ప్రతిపక్ష పార్టీల పాలిత రాష్ట్రాల్లో ప్రభుత్వాలను పడగొట్టేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని, అయితే ప్రజాస్వామ్యాన్ని విఫలం కానివ్వబోమని... ఎంతదాకానైనా పోరాడతామని స్పష్టం చేశారు. సోరెన్ జైలు నుంచి పంపిన సందేశాన్ని భార్య కల్పన సభలో చదివి వినిపించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ... ప్రతిపక్షాల గొంతు నొక్కేందుకు బీజేపీ దర్యాప్తు సంస్థల్ని దుర్వినియోగం చేస్తున్నదన్నారు. తన భర్త హేమంత్ సోరెన్, అరవింద్ కేజ్రీవాల్, ఆయా రాష్ట్ర ప్రభుత్వాలపై కొన్ని శక్తులు కుట్రపన్ని వారిని జైల్లో పెట్టాయన్నారు. ఎన్నికల్లో బీజేపీని ఓడించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఒకవేళ బీజేపీ గెలిస్తే అది గిరిజనులకు పెద్దముప్పు వాటిల్లుతుందన్నారు.

# సమగ్రాభివృద్ధికి దర్పణం సీపీఐ మేనిఫెస్టో

**ఇండియా అధికారంలోకి రాగానే అమలు చేస్తాం**

**గాలి చంద్రను గెలిపించుకుందాం**

**ఓబులేసు**

**విశాలాంధ్ర-కడప కార్పొరేషన్:** శ్రమజీవుల అభ్యున్నతి, సమగ్రాభివృద్ధి, సామాజిక న్యాయానికి దర్పణం పట్టే విధంగా సీపీఐ ఎన్నికల మేనిఫెస్టో రూపకల్పన చేసినట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జి.ఓబులేసు తెలిపారు. కడప వైయస్సార్ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఓబులేసు మాట్లాడారు. ఎన్నికల మేనిఫెస్టో రూపకల్పనకు పార్టీ ఓ కమిటీ ఏర్పాటు చేసిందని, వివిధ రంగాలలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అవగాహన చేసుకుని... ఉద్యమాలు చేసే వారందరితో చర్చించి కమిటీ ఈ మేనిఫెస్టో తయారు చేసిందని ఓబులేసు వివరించారు. కడప జిల్లాలో కమలాపురం అసెంబ్లీ నియోజకవర్గానికి సీపీఐ అభ్యర్థిగా పోటీ చేసిన గాలి చంద్రకు ఓటు వేయాలని ఆయన ప్రజలను కోరారు. మతోన్మాద బీజేపీ ప్రజలను మభ్య పెట్టేందుకు బూటకపు మేనిఫెస్టో విడుదల చేసిందని విమర్శించారు. అందులో రైతులకు, యువకులకు, నిరుద్యోగ యువకులకు ఉపయోగపడే అంశాలు లేవన్నారు. కానీ ప్రధాని మోదీ మాత్రం ఈ మేనిఫెస్టో భావితరాలకు ఉపయోగపడేలా తయారు చేశామని గొప్పలు చెప్పుకుంటున్నారని విమర్శించారు. రైతులకు సంబంధించి స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేస్తామని మేనిఫెస్టోలో చెప్పలేదన్నారు. రైతులకు వ్యతిరేకంగా తెచ్చిన మూడు వ్యవసాయ చట్టాలను రద్దు చేస్తామని కూడీ భరోసా ఇవ్వలేదని ఆరోపించారు. ప్రభుత్వరంగ సంస్థలను అమ్మకానికి పెట్టే విధంగా బీజేపీ మేనిఫెస్టో ఉందన్నారు. అయోధ్య రాముడిని ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చేస్తామని చెబుతున్నారని, రాముడిని రాజకీయంగా వాడుకుంటు న్నారని మండిపడ్డారు. రాష్ట్ర అభివృద్ధి కోసమే బీజేపీతో కలుస్తున్నామని చంద్రబాబు, పవన్ కల్యాణ్ నిస్సిగ్గుగా చెబుతున్నారని, అలాగైతే 2014 నుంచి కలిసి ఉన్నప్పుడు బీజేపీ రాష్ట్ర రాజధాని, పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తి, నిర్వాసితులకు పరిహారం, వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ, రాష్ట్రానికి ప్రత్యేకహోదా, కడపలో స్టీల్ ప్లాంట్ వంటి హామీలు ఎందుకు అమలు చేయలేదని ఓబులేసు ప్రశ్నించారు. అప్పుడైనా ఆ హామీలు అమలు చేస్తామని బీజేపీ హామీ ఇచ్చిందా అని టీడీపీ, జనసేనను నిలదీశారు. బీజేపీకి బలం లేకపోయినా ఏదో ఒకవిధంగా పార్టీల మధ్య చిచ్చు పెట్టి ప్రభుత్వం ఏర్పాటుకు కుట్ర చేస్తుందని ఆయన హెచ్చరించారు. ఇండియా కూటమి అధికారంలోకి వస్తే తమ మేనిఫెస్టోను కచ్చితంగా అమలు చేస్తామని ఓబులేసు హామీ ఇచ్చారు. ఎన్నికల్లో సీపీఐ, సీపీఎం, కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించి చట్టసభలకు పంపాలని ప్రజలకు పిలుపునిచ్చారు. సమావేశంలో కమలాపురం నియోజకవర్గ సీపీఐ అభ్యర్థి గాలి చంద్ర, జిల్లా కార్యవర్గ సభ్యులు వెంకట శివ, బాదుల్లా, వేణుగోపాల్, చంద్రశేఖర్, సుబ్రహ్మణ్యం, జిల్లా సమితి సభ్యులు మనోహర్ రెడ్డి, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఏపీ డీఈఈసెట్-2024 నోటిఫికేషన్

**విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:** రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ డీఎడ్/టీటీసీ శిక్షణ కళాశాలల్లో 2024-25 విద్యా సంవత్సర ప్రవేశాలకు గాను సోమవారం ఏపీ డీఈఈసెట్-2024 నోటిఫికేషన్ విడుదల కానుంది. ఈ మేరకు పాఠశాల విద్య కమిషనర్ సురేశ్‌కుమార్ ఆదివారం షెడ్యూల్ వెల్లడించారు. ఏపీ డీఈఈ సెట్‌కు కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ) ద్వారా ప్రవేశ పరీక్షకు ఈనెల 23 నుంచి మే ఎనిమిదో తేదీ వరకు ఆన్‌లైన్‌లో పరీక్ష ఫీజు చెల్లింపు ప్రక్రియ ప్రారంభమవుతుంది. 24 నుంచి మే తొమ్మిదో తేదీవరకు దరఖాస్తులను స్వీకరిస్తారు. మే 15 నుంచి 20 వరకు హాల్ టికెట్లను జారీజేస్తారు. 24న డీఈఈసెట్ పరీక్షను రాష్ట్ర వ్యాప్తంగా ఎంపిక చేసిన పరీక్షా కేంద్రాల్లో నిర్వహిస్తారు. 30న ఫలితాలను ప్రకటిస్తారు. జూన్ ఆరో తేదీ నుంచి ఎనిమిదో తేదీ వరకు అభ్యర్థుల ర్యాంకుల ఆధారంగా వెబ్ ఆప్షన్లను నిర్వహిస్తారు. జూన్ 20 నుంచి తరగతులు నిర్వహిస్తారు. అభ్యర్థులు ఇంటర్‌లో ఉత్తీర్ణులై ఉండాలి. ఇంటర్ గ్రూపు ఆధారంగా ప్రవేశ పరీక్ష సిలబస్ ఉంటుంది. పూర్తి వివరాలను పాఠశాల ఏపీడీఈఈసెట్-2024 వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు.

# ప్రచారానికి 20 రోజులే...

- ఎన్నికలు ఎంతో కీలకం • అందరూ గెలిచి రావాలి
- అభ్యర్థులకు బీఫారాల అందజేత
- ప్రతిజ్ఞ చేయించిన చంద్రబాబు

**విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:** సార్వత్రిక ఎన్నికల ప్రచారానికి ఇంకా 20 రోజులే ఉందని, ఈ సమయం ఎంతో కీలకమని పార్టీ అభ్యర్థులకు టీడీపీ అధినేత చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. రాక్షసులతో యుద్ధం చేస్తున్నామని, సంకల్పంతో ముందుకెళ్లాలని సూచించారు. టీడీపీ మంగళగిరి కేంద్ర కార్యాలయంలో ఆదివారం లోక్‌సభ, అసెంబ్లీ అభ్యర్థులకు చంద్రబాబు బీఫారాలు అందజేశారు. తొలుత ఎన్టీఆర్ విగ్రహానికి చంద్రబాబుతో పాటు కె.అచ్చెన్నాయుడు, నందమూరి బాలకృష్ణ తది తరులు పూలమాలలేసి నివాళు లర్పించారు. అనంతరం ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులతో ప్రతిజ్ఞ చేయించారు. చంద్రబాబు మాట్లాడుతూ, బీఫాం తీసుకున్న ప్రతి అభ్యర్థి ఎన్నికల్లో గెలిచి రావాలని ఆశీర్వదించారు. తాను 40కి పైగా ప్రజాగళం సభలు నిర్వహించానని, పలు సభలు జనసేన అధినేత పవన్ కల్యాణ్‌తోనూ కలిసి నిర్వహించినట్టు చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌కు ఏం చేశాడో చెప్పుకోలేకే సీఎం జగన్ డ్రామాలు ఆడుతున్నారని మండిపడ్డారు. మళ్లీ రాష్ట్రంలో మంచి రోజులు రాబోతున్నాయని ప్రజలకు తెలియజెప్పాలన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నేతల మధ్య సమన్వయం ఉండాలని, ఓటు బదిలీ జరగాలన్నారు. ప్రజాగళానికి వస్తున్న స్పందన జగన్ పతనాన్ని చాటిచెబుతోందని చెప్పారు. ప్రజలు, కార్యకర్తల అభీష్టం

మేరకే అభ్యర్థులను ఎంపిక చేశామని చెప్పారు. క్యాడర్‌తో ప్రతి అభ్యర్థి అనుసంధానం కావాలని సూచించారు. అన్ని వర్గాల్లో ప్రభుత్వంపై వ్యతిరేకత కనిపిస్తోందన్నారు. వైసీపీ నుంచి టీడీపీలోకి మంచి వాళ్లను మాత్రమే తీసుకుని సీట్లు ఇచ్చానని గుర్తుచేశారు. ఎన్నికలకు ఇక 22 రోజుల సమయమే ఉందని, ప్రచారానికి 20 రోజులే ఉందని చంద్రబాబు వ్యాఖ్యానించారు. వలంటీర్లతో పంపిణీ చేయొద్దనడంతో పెన్షన్లు ఆగిపోయాయని తనపై విషప్రచారం చేశారన్నారు. దాన్ని తిప్పికొట్టాలన్నారు. అమరావతి, పోలవరాన్ని విధ్వంసం చేశారని, రాష్ట్రాన్ని అడ్డగోలుగా దోచుకున్నారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ బస్సు యాత్రలో వాళ్లే కరెంట్ తీసేసుకున్నారని, తనపై అంభాడాలు మోపుతున్నారని ధ్వజమెత్తారు. చీకట్లో తాను దాడి చేయించానని తప్పుడు ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. రాయి విసిరిన వ్యక్తితో టీడీపీ నేత బోండా ఉమమహేశ్వరరావు ప్రమేయం ఉందని చెప్పించేలా కుట్రలు చేస్తున్నారని మండి పడ్డారు. బీఫాం తీసుకునే సమయంలో చంద్రబాబు కాళ్లకు లోకేశ్ నమస్కరించి ఆశీర్వాదం పొందారు.

## వామపక్షాల అభ్యర్థులను గెలిపించండి: వనజ

**విశాలాంధ్ర-ఏలూరు:** సార్వత్రిక ఎన్నికల్లో ఇండియా కూటమి బలపరిచిన వామపక్ష పార్టీల అభ్యర్థులను గెలిపించాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు, ఏలూరు జిల్లా ఇన్‌ఛార్జి అక్కినేని వనజ పిలుపు నిచ్చారు. కాంగ్రెస్, సీపీఎం, ఆమ్ ఆద్మీ బలపరుస్తున్న సీపీఐ ఏలూరు అసెంబ్లీ అభ్యర్థి బండి వెంకటేశ్వరరావుకు బీఫాంను పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆమె అందజేశారు. ఈ సందర్భంగా వనజ మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీని, రాష్ట్రంలో ఆ పార్టీతో జతకట్టిన టీడీపీ, జనసేనను... అభివృద్ధి లేకున్నా రాష్ట్రాన్ని అప్పులపాల్జేసిన వైసీపీని ఓడించాలని పిలుపునిచ్చారు. భారతదేశ లౌకిక వ్యవస్థ ను కాపాడాలన్నా, మత సామరస్యాన్ని రక్షించుకోవాలన్నా, ప్రజాస్వామ్య విలువలను పెంపొందించు కోవాలన్నా ఇండియా కూటమి అభ్యర్థులకు విజయం చేకూర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డేగా ప్రభాకర్, ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, ఏలూరు ఏరియా కార్యదర్శి ఉప్పులూరి హేమ శంకర్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాస డాంగే, ఎస్ఎఫ్ఐడబ్ల్యు జిల్లా కార్యదర్శి మన్నవ యామిని, జిల్లా కార్యవర్గ సభ్యురాలు కొండేటి బేబి, ఎం. విజయ, ఏలూరు ఏరియా సహాయ కార్యదర్శి కే వరప్రసాద్ పాల్గొన్నారు.

## వైసీపీ మేనిఫెస్టోపై కసరత్తు

**నేడు ముఖ్యనేతలతో జగన్ సమావేశం**

**విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:** వైసీపీ మేనిఫెస్టో విడుదలపై పార్టీ దృష్టి పెట్టింది. వైసీపీ అధినేత, సీఎం జగన్ మేమంతా సిద్ధం బస్సు యాత్రలో ఉండగానే, ఈ మేనిఫెస్టోకు తుది రూపం దాల్చే అవకాశముంది. దీనిపై సోమవారం వైసీపీ ముఖ్యనేతలతో జగన్ కీలక సమావేశం నిర్వహించనున్నారు. ప్రధానంగా ఉత్తరాంధ్ర అభివృద్ధిపై వైసీపీ దృష్టి సారించింది. ఈనెల 26 లేదా 27 తేదీల్లో మేనిఫెస్టో విడుదల చేసేందుకు ఆ పార్టీ నేతలు కసరత్తు చేస్తున్నారు. సీఎం జగన్ బస్సు యాత్ర విశాఖకు చేరు కుంది. బస్సు యాత్రకు విరామిచ్చి ముఖ్యనేతలతో జగన్ భేటీ అవుతారు. ప్రస్తుత మేనిఫెస్టోలో కూర్చిన అంశాలతోపాటు కొత్తగా చేర్చబోయే వాటిపైనా చర్చిస్తారు. గత వైసీపీ మేనిఫెస్టోలోని నవరత్నాలు యథాతథంగా కొనసాగించాలని వైసీపీ భావిస్తున్నది. దీంతోపాటు కొత్తగా విద్యా, వైద్యరంగంతోపాటు రాష్ట్రాభివృద్ధి, మరిన్ని సంక్షేమ పథకాలపైనా కసరత్తు చేస్తున్నారు. బస్సు యాత్ర ఈనెల 24న శ్రీకాకుళం జిల్లాల్లో ముగియనుంది. 25న పులివెందులలో జగన్ నామినేషన్ వేయనున్నారు. ఈ ప్రక్రియ పూర్తయిన వెంటనే మేనిఫెస్టో విడుదల తేదీలపై ఒక స్పష్టత వస్తుంది. అనంతరం మళ్లీ 100 నియోజకవర్గాల లక్ష్యంగా, మూడు ప్రాంతాల్లోను రోజుకు మూడు నియోజకవర్గాల్లో సీఎం జగన్ హెలీకాప్టర్ ద్వారా సభలు, బస్సుల ద్వారా రోడ్‌షోలు నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందించుకున్నారు.

## ప్రజానాట్య మండలి ఎన్నికల పాటల సీడీ విడుదల

**విశాలాంధ్ర-విజయవాడ:** సార్వత్రిక ఎన్నికలు- 2024ను పురస్కరించుకొని ఆంధ్రప్రదేశ్ కమ్యూనిస్టు పార్టీ సహకారంతో ప్రజానాట్యమండలి రూపొందించిన పాటల సీడీని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ, రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ స్థానిక దాసరి భవన్‌లో ఆదివారం ఆవిష్కరించారు. సినీ రచయిత బాబ్జి శ్రీనివాస్ వర్మ రాసిన పాటలను వందేమాతరం శ్రీనివాస్, పి.చంద్రనాయక్ ఆలపించారు. పాటలను హైదరాబాద్‌లో రికార్డింగ్ చేశారు. కార్యక్ర మంలో సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కేవీవీ ప్రసాద్, ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు చంద్రనాయక్, కోశాధికారి పిచ్చయ్య, సుబ్రహ్మణ్య శర్మ, వెంకటేశ్వర్లు , దోనేపూడి సూరిబాబు పాల్గొన్నారు.

# అసలైన సైకోలు చంద్రబాబు, పవన్

**ఎమ్మెల్యే మహ్మద్ అబ్దుల్ హఫీజ్‌ఖాన్**

**విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:** చంద్రబాబు, పవన్ కల్యాణ్ సభల్లో మాట్లాడుతున్న భాష తీరు విడ్డూరంగా ఉందని, అసలైన సైకోలు చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లేనని వైసీపీ ఎమ్మెల్యే మహ్మద్ అబ్దుల్ హఫీజ్‌ఖాన్ మండిపడ్డారు. వైసీపీ తాడేపల్లి కేంద్ర కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమా వేశంలో ఆయన మాట్లాడుతూ, వీరిద్దరూ విషం కక్కేందుకు ప్రయత్నిస్తున్నారని, రాజకీయాల్లో 40 ఏళ్ల అనుభవశాలిగా ఒకరు చెప్పుకుంటే, ఎలాంటి స్వార్థం లేకుండా రాజకీయాల్లోకి వచ్చానంటూ మరొకరు చెప్పుకుంటూ ఇష్టానుసారంగా నోరు పారేసుకోవడం బాధాకరమన్నారు. వీళ్లు రాష్ట్రానికి మేలు చేసే అంశాలపై మాట్లాడుతారా అంటే, అది వాళ్ల ప్రసంగాల్లో ఎక్కడా వినిపించబోదని చెప్పారు. పొత్తు పెట్టుకుని ఎన్‌డీఏ భాగ స్వాములుగా కేంద్రం నుంచి రాష్ట్రానికి మేలు చేసే ప్రాజెక్టులను ఏమైనా తెస్తారని చెబుతారా అంటే అదీలేదని, కేవలం జగన్‌ను దూషించడానికి మాత్రమే వారి ప్రసంగాలు రాసుకుంటున్నారని ధ్వజమెత్తారు. సీఎం జగన్ పరిపాలన సమర్థుడు అని అన్నారు. ఎన్నికల ప్రచారంలో మీరేం మాట్లాడుతున్నారో, జగన్ ఏం చెబుతున్నారో ప్రజలంతా గమనిస్తున్నారని చెప్పారు. ఓటమి తప్పదనే ఆందోళనతో చంద్రబాబు కుట్రలకు దిగుతున్నారని దుయ్యబట్టారు. బీజేపీతో పొత్తు పెట్టుకుని ఎన్‌డీఏ భాగస్వాములం మేము అని చెప్పుకుంటున్నారని, విశాఖ స్టీల్‌ప్లాంట ప్రైవేటీకరణపై అదే బీజేపీ నోటితో ఏమైనా చెప్పిస్తున్నారా, ప్రత్యేకహోదాపై ఏమైనా మాట్లాడిస్తున్నారా అని ప్రశ్నించారు. ఎటూ ఎన్నికల్లో గెలవలేమన్న అక్కసుతోనే రాజకీయ ప్రత్యర్థిని రాజకీయంగా ఎదుర్కోలేక, జగన్‌పై హత్యాయత్నానికి పాల్పడ్డారన్నారు. మంగళగిరిలో చంద్రబాబు కొడుకు లోకేశ్ రాజకీయాలకు మేకా వెంకటరెడ్డి బలయ్యారని, ఆయనను దారుణంగా చంపారని ఆరోపించారు. ఎస్ఆర్ఐల మనీ రాజకీయాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు.

## పోస్టల్ బ్యాలెట్ ఓటు సద్వినియోగానికి చర్యలు

**ఈసీకి వర్ల రామయ్య లేఖ**

**విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:** ఎన్నికల విధులు నిర్వర్తిస్తున్న ప్రతి ప్రభుత్వ ఉద్యోగి తమ ఓటు హక్కు పోస్టల్ బ్యాలెట్ ద్వారా వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య ఆదివారం ఈసీకి లేఖ రాశారు. రాష్ట్రంలో దాదాపు ఐదు లక్షల మంది ఎన్నికల విధులు నిర్వర్తించబోతున్నారని తెలిపారు. పోస్టల్ బ్యాలెట్లపై పీఓ, ఏపీఓలకు శిక్షణ ఇచ్చిన మాదిరి ఓపీఓ (అదర్ పోలింగ్ ఆఫీసర్ల)కు శిక్షణ ఇవ్వాలని కోరారు. పోలీసులు, డ్రైవర్లు, కండక్టర్లు, క్లీనింగ్ సిబ్బందికి శిక్షణ ఇవ్వకపోతే వారు పోస్టల్ బ్యాలెట్‌ను సరిగా వినియోగించుకోలేరని తెలిపారు. 2019లో 56,545 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు తిరస్కరించబడ్డాయని పేర్కొన్నారు. ఫాం-12 తప్పనిసరిగా అందేలా చర్యలు తీసుకోవాలన్నారు.

**ఓట్ల తగ్గింపునకు కుట్ర: అశోక్‌బాబు**

లక్షల్లో ఉన్న పోస్టల్ బ్యాలెట్ ఓట్ల తగ్గింపునకు కుట్ర చేస్తున్నారని టీడీపీ ఎమ్మెల్సీ పర్చూరు అశోక్‌బాబు ఆరోపించారు. టీడీపీ మంగళగిరి జాతీయ ప్రధాన కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఉద్యోగులను చూసి జగన్ వణికిపోతున్నారని, జగన్ కోసం పనిచేస్తున్న కొంత మంది అధికారులు పోస్టల్ బ్యాలెట్ ఓట్లు నమోదు కాకుండా చేసేందుకు అయోమయానికి గురి చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఎలక్షన్ కమిషన్ సర్క్యులర్ అందకుండా చేశారని, ఫాం-12 తీసుకున్నా ఎక్నాలెడ్జ్‌మెంట్ ఇవ్వడం లేదని వివరించారు. నోడల్ అధికారులను నియమించి ఆయన ఎవరో కింది స్థాయి అధికారులకు తెలిసేలా చర్యలు చేపట్టాలన్నారు. వైసీపీ ప్రభుత్వానికి ప్రభుత్వ ఉద్యోగులంతా ఓటు రూపంలో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.

## 9 మందితో కాంగ్రెస్ లోక్‌సభ జాబితా

**విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:** ఆంధ్రప్రదేశ్ లోక్‌సభకు కాంగ్రెస్ తరపున పోటీ చేసే 9 మంది అభ్యర్థుల జాబితాను వెల్లడించారు. కాంగ్రెస్ కేంద్ర ఎన్నికల కమిటీ ఈ అభ్యర్థుల పేర్లను ఆమోదించింది. వాటి వివరాలను ఆదివారం ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ తెలిపారు.

**శ్రీకాకుళం:** డాక్టర్ పెద్దాడ పరమేశ్వరరావు, **విజయనగరం:** బొబ్బిలి శ్రీను, **అమలాపురం (ఎస్‌సి):** జంగా గౌతమ్, **మచిలీపట్నం:** గొల్లు కృష్ణ, **విజయవాడ:** వల్లూరు భార్గవ్, **ఒంగోలు:** ఈదా సుధాకర్‌రెడ్డి, **నంద్యాల:** జంగ్తి లక్ష్మీ నరసింహ యాదవ్, **అనంతపురం:** మల్లికార్జున వజ్జల, **హిందూపురం:** బీఏ సమీద్ షాహీన్.

# ఉక్కుపై మీ వైఖరేమిటి?

**రాజకీయ పార్టీలను ప్రశ్నించిన పోరాట కమిటీ నేతలు**

**విశాఖలో ఉక్కు మహా గర్జన ధర్నా**

**విశాలాంధ్ర- కూర్మన్నపాలెం(విశాఖ):** విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ అధ్వర్యంలో స్టీల్‌ప్లాంట్ ఆర్చ్ వద్ద ఉక్కు మహా గర్జన పేరుతో భారీ ధర్నా జరిగింది. ఉద్యమం చేపట్టి 1165వ రోజుకు చేరుకున్న సందర్భంగా కమిటీ నిరసన చేపట్టింది. దీనిలో పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ సీహెచ్ నర్సింగరావు, డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ విధానాల వల్లే విశాఖ ఉక్కు కర్మాగారం సమస్యలు ఎదుర్కొం టోందని విమర్శించారు. ఈ సమస్యల సృష్టికర్త కేంద్ర ప్రభుత్వ విధానాలని, దీనిని వ్యతిరేకిస్తూ 1165 రోజుల నుంచి పోరాటం చేస్తున్నామని, తమ ఆందోళనకు మద్దతు పలికిన ప్రతి రాజకీయ పార్టీ తమ స్పష్టమైన వైఖరి ప్రదర్శించాల్సిన సమయం ఆసన్నమైందని చెప్పారు. ఆ దిశగా ఈ ఉద్యమాన్ని బలోపేతం చేయడంలో భాగంగానే నేడు ఉక్కు మహాగర్జన నిర్వహిస్తున్నా మన్నారు. కార్మికుల ఓట్లు కోరుకునే ప్రతి రాజకీయ పార్టీ తమ మేనిఫెస్టోలో ఈ అంశానికి ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు. 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు మాట్లాడుతూ కార్మికవర్గం ఐక్యంగా పోరాటాలు చేయడం ద్వారానే ప్రభుత్వ విధానాలు మారతాయని స్పష్టం చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికవర్గంపై చేస్తున్న దాడిని ప్రతిఘటించడానికి ఇదే సరైన సమయమన్నారు. విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ కన్వీనర్, కో కన్వీనర్ కేయస్ఎన్ రావు, నీరుకొండ రామచంద్రరావు, జె.అయోధ్యరామ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలకు సహకరిస్తున్న స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం ప్రణాళికాబద్ధంగా దీనిని నాశనం చేస్తోందని విమర్శించారు. అందులో భాగంగామే తాజాగా స్టీల్ ప్లాంట్ ఎదుర్కొంటున్న బొగ్గు సమస్య, ముడి పదార్థాల లభ్యత సమస్య, పూర్తిస్థాయి ఉత్పత్తి తీయడంలో వైఫల్యం, కార్మికులకు నూతన వేతనాలు అమలు చేయకపోవడం అని వివరించారు. దీనిని ఎదుర్కోవడానికి కార్మికవర్గం మరింత ఐకమత్యంగా ఉద్యమం నిర్వహించాలని పిలుపునిచ్చారు. సిటీ జేఏసీ చైర్మన్ ఎం.జగ్గునాయుడు మాట్లాడుతూ నగరంలో ఈ పోరాటానికి మద్దతుగా 1106 రోజులుగా జరుగుతున్న రిలే నిరాహార దీక్షలో రెక్కాడితే గానీ కడుపు నిండని అనేకమంది పాల్గొనడం ద్వారా తమ నిరసన తెలియజేస్తున్నారని ఆయన వివరించారు. కార్మికుల నిరసనకు, ఇక్కడ జరుగుతున్న పోరాటానికి మద్దతుగా నిలిచే రాజకీయ పార్టీలను గెలిపించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ప్రతినిధులు యు.రామస్వామి, మాసేన్ రావు, కారు రవణ, డీవీ రమణారెడ్డి, వరసాల శ్రీనివాస్, డి.సురేష్ బాబు, పరంధామయ్య, కరణం సత్యారావు, శ్రీనివాసులు నాయుడు, నమ్మి సింహాద్రి, ఆదారి అప్పారావు, స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తౌడన్న, మల్లయ్య, ఓబీసీ అధ్యక్షుడు బి.అప్పారావు సహా వివిధ విభాగాల అధ్యక్ష, కార్యదర్శులు, అధిక సంఖ్యలో కార్మికులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## లావణ్య, వెంకటేశ్వరరావును గెలిపించండి

**వాడవాడలా సీపీఐ ప్రచార హోరు**

**విశాలాంధ్ర-ఏలూరు:** ఇండియా కూటమి బలపరిచిన కాంగ్రెస్ ఏలూరు ఎంపీ అభ్యర్థి కావూరి లావణ్య, సీపీఐ ఏలూరు అసెంబ్లీ అభ్యర్థి బండి వెంకటేశ్వరరావులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు డేగా ప్రభాకర్, ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, కాంగ్రెస్ ఏలూరు జిల్లా అధ్యక్షుడు రాజనాల రామ్మోహనరావు పిలుపునిచ్చారు. సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం స్థానిక సత్రంపాడు ఎంఆర్‌సీ కాలనీలో ఇంటింటికి తిరిగి ఓట్లు అభ్యర్థించారు. వారు మాట్లాడుతూ, విభజన హామీలు, ప్రత్యేక హోదా, పోలవరం నిర్మాణం... ఇండియా కూటమి అధికారం చేపడితేనే సాధ్యం అని అన్నారు. కేంద్రంలోని బీజేపీ ఏపీకి తీరని అన్యాయం చేసిందన్నారు. నిరుద్యోగం పెరిగిందని, ప్రజల ఆకలి బాధలు ఎక్కువయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలు నిర్వీర్యం అవుతున్నాయని విమర్శించారు. వైసీపీ, జనసేన, టీడీపీ... బీజేపీకి ఊడిగం చేస్తున్నాయని ధ్వజమెత్తారు. వైసీపీ పాలనలో రాష్ట్రం అథోగతి పాలైందన్నారు. మోదీకి ప్రయోజనం చేకూర్చే విధంగానే చంద్రబాబు, జగన్ వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. నగరంలో సమస్యల పరిష్కారం లో స్థానిక ఎమ్మెల్యే ఘోరంగా విఫలం చెందారని ఆరోపించారు. స్వప్రయోజనాల కోసమే పనిచేశారని అన్నారు. ఏకైక పరిశ్రమ జూట్‌మిల్లు మూతకు కారకులయారని ఆరోపించారు. తమ అమూల్యమైన ఓటును కంకికొడవలి, హస్తం గుర్తుపై వేసి కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. రాష్ట్ర భవిష్యత్తును, ఏలూరు జిల్లా అభివృద్ధిని కాపాడుకోవాలని విజ్ఞప్తి చేశారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పుప్పాల కన్నబాబు, కొడేటి బేబి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాస్ డాంగే, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ యామిని, సీపీఐ ఏలూరు ఏరియా సమితి కార్యదర్శి ఉప్పులూరి హేమశంకర్, సహాయ కార్యదర్శి కురెళ్ళ వరప్రసాద్, కొల్లూరి సుధారాణి, అడ్డగర్ల లక్ష్మి ఇందిర, తెర్లాపు శ్రీను, మావూరి విజయ, గొర్లి స్వాతి, లక్ష్మి, రవి, కొండేటి రాంబాబు, గేదెల నాగేశ్వరరావు, మేరీ, విక్రమ్, కేశవ, భవాని, దండుబోయిన చంద్రశేఖర్ పాల్గొన్నారు.

## చంద్రబాబు మోసపు మాటలు దళితులు నమ్మరు: కనకారావు మాదిగ

**విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:** దళితుల గురించి మాట్లాడే అర్హత చంద్రబాబుకుగానీ, టీడీపీకిగాని లేదని వైసీపీ నేత కనకారావు మాదిగ అన్నారు. ఆ పార్టీ తాడేపల్లి కేంద్ర కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఎన్నికల్లో సీఎం జగన్‌కు మద్దతు ఇవ్వాలని దళితులంతా నిర్ణయించారని స్పష్టంచేశారు. దళితుల్లో పుట్టాలని ఎవరైనా కోరుకుంటారా అన్న చంద్రబాబును దళితులు ఏనాడో దూరం పెట్టారని చెప్పారు. గత ఎన్నికల్లో ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గాలు 29 ఉంటే 28 స్థానాల్లో ఓడించారన్న విషయాన్ని చంద్రబాబు మరిచిపోయినప్పటికీ, ఆ విషయాన్ని దళితులు మరిచిపోలేదని గుర్తుచేశారు. ఎస్టీ నియోజకవర్గాల్లో సైతం చంద్రబాబుకు అదే విధంగా బుద్ధి చెబుతారని హెచ్చరించారు. జగన్‌కు దళితులు అంటే చులకన అంటూ చంద్రబాబు మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. చంద్రబాబు మోసపు మాటలు నమ్మేస్థితిలో దళితులు లేరన్నారు. దళితులను జగన్ అక్కున చేర్చుకుంటే చంద్రబాబు మాత్రం ఓటు బ్యాంక్‌గానే చూశారన్నారని మండి పడ్డారు. దళితుల భూములను లాక్కున్న ఘనత టీడీపీదీ, చంద్రబాబుదేనని ఆరోపించారు. ఎస్సీల్లో మాల, మాదిగల మధ్య చంద్రబాబు గొడవ సృష్టించారన్నారు. టీడీపీ నేత వర్ల రామయ్యకు నీవు ఇచ్చిన గౌరవం ఏంటో అందరికీ తెలుసని, దళితులంతా బైబై బాబు అంటున్నారని విమర్శించారు.

## ఉచిత'మంట'

కనురెప్పలు నిద్రలేచాయి
తెల్లారి వెలుగు చూసిన నల్లకళ్ళు
ఎగిరి వెళుతున్న పక్షుల రెక్కల్లో
ఊహలైపోయి ఎగిరిపోతున్నాయి!

అల్పాహారం అంటూ అల్పజీవాలు ఆకులు
పట్టుకుంటూ ఊగిపోతున్నాయి

అది సరదా ఆట అనుకున్న చూపులు
కళ్ళు తిప్పేసుకుంటూ
తమ తమ పనుల్లో మునిగిపోతున్నాయి

మొదట- దాతలు పెట్టే పెరుగన్నం ముద్ద
పంచభక్షపరమాన్నంగా మెచ్చినోడు-
పెరిగిన సహృదయ దాతల రాకతో
బిర్యాని పొట్లాన్నే కోరుతున్నాడు

ఎన్ని సదుపాయాల షెల్టర్లు నిర్మాణమైతే-
ఫుట్‌పాత్‌లపై పొర్లిగింతలు పెట్టేటోడికి
పందిరిమంచం సరిహద్దులు విధిస్తే
ఏం స్వేచ్ఛనివ్వగలదు?

ఆకలి దేహానిదా?
ఆత్మన్యూనత- ఆత్మవంచన అనే పదాల మధ్య సంఘర్షణ
పెద్ద ప్రశ్నల యుద్ధానికి దారి తీస్తోంది

జాలితనం గాలికొదిలేస్తే మానవత్వం మంట గలిపామంట!
పేదతనం నిర్మూలించ తలపెడ్తే
మానవ'తత్త్వం' వంటల రుచుల్లో మగ్గితేలుతున్నదట!!
ఒక్కో పథకం ఒక్కో విధంగా మెళ్ళో వేసి విజేతగా నిలుపుదామంటే
పనులు చేసే సోమమ్మ 'సోమరి'
బక్కయ్య బద్ధకిష్టుగా పేర్లు మార్చేసుకుంటున్నారే?!!

అసలు...మారేదెవరో, మార్చేస్తున్నదెవరో
ఎవరికెవరికి తెలుస్తోంది?
కనీసం కాలానికేమైనా తెలుసేమో ఒకసారి అడిగి చూద్దాం?!!

(పాల్వంచ కళాపరిషత్ - ఉక్కు సాహితీ సమైక్య కవితల పోటీల్లో బహుమతి పొందిన కవిత )

చలపాక ప్రకాష్, 9247475975

# సాహితి

# రూపుకట్టిన హాస్యం భమిడిపాటి

గెల్లి రామమోహనరావు, 0863-2357514

చమత్కారం వ్యంగ్యం / సునిశితత్వం నిజం కలబోసిన
అపూర్వ హాస్య చతురానన
హాస్య ఘనాపాటి మన భమిడిపాటి (భానుమూర్తి-మనుమడు)

భమిడిపాటి కామేశ్వరరావు పశ్చిమ గోదావరి జిల్లా ఆకివీడులో 1897 ఏప్రియల్‌లో జన్మించారు. రాజమండ్రిలో ఉన్నారు. ఆయన కథలు, నాటకాలు రాసినా పాఠశాలలో గణితశాస్త్ర ఉపాధ్యాయుడిగా రాణించారు. ఆయన కాలక్షేపం, ఇప్పుడు, అవును, నిజం, అప్పుడు, వద్దంటే పెళ్లి, మాట వరస, గుసగుస పెళ్లి, పెళ్లి ట్రయినింగు, రెండు రెళ్లు, అన్నీ తగాదాలే, కచటతపలు, మేజువాణీ మున్నగునవి రచించారు. హాస్యానికి మారుపేరు భమిడిపాటి వారు. వారి పలుకులే రసగుళికలు. చిలకమర్తి, పానుగంటి వారి పక్కన భమిడిపాటి వారికి పీట వేయవచ్చు. వారి కథల్లో సామాజిక విమర్శ నిండుగా ఉంటుంది. వారు రచించిన నాటికలు కళాశాలల్లో విద్యార్థులు ప్రదర్శించేవారు.

కామేశ్వరరావు 1918 లో బి.ఏ గణితశాస్త్రం, 1922లో యల్.టి నాటి నుండి వీరేశలింగం హైస్కూల్‌లో గణితాధ్యాపకులు. ఆ పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులుగా పనిచేశారు. 1953లో ఉద్యోగ విరమణ అయింది. లెక్కల మాస్టారు అయినా ఆంగ్ల భాషను అనర్గళంగా మాట్లాడేవారట. సంస్కృతంలో ప్రావీణ్యం ఉంది. ఉదర పోషణార్థం ఉద్యోగంచేయవలసి వచ్చిందన్నారు. మొదటగా మద్రాసు ఎకౌంటెంట్ జనరల్ ఆఫీసులో ఉద్యోగం చేశారు. ఆఫీసులో తన తోటి వారితో హాస్యం ఒలకపోస్తూ చమత్కారపు మాటలు మాట్లాడేవారు. విరామ సమయంలో అందరూ ఒకచోట చేరినపుడు హాస్యంతో పరాచకాలాడే వారు. అక్కడే సాహిత్యం మీద అభిలాష కలిగింది. కొంత కాలం తరువాత ఉద్యోగం వదలి రాజమండ్రి చేరుకొన్నారు. వీరేశలింగం ఉన్నత పాఠశాలలో గణిత శాస్త్ర ఉపాధ్యాయులుగా చేరారు. ఆయనకు శిష్యులు, ప్రశిష్యులు చాలామంది ఉన్నారు. వారందరూ తరువాత కలిసి విశేషాలు ముచ్చటగా చెప్పుకొనేవారు. రాజమండ్రి ఆర్ట్సు కాలేజిలో వీరు ఉపన్యసిస్తుంటే విద్యార్థులు మైమరచి వినేవారట. ఆయన అలవాట్లు చూసేవారికి వింతగా ఉండేవి. నియమ వ్యతిక్రమణ అంటే నచ్చదు.

ఆయన 'త్యాగరాజ ఆత్మవిచారము' అనే గ్రంథాన్ని వెలువరించారు. అది ఆరువందల త్యాగరాజుకీర్తనలను తొమ్మిది విభాగాలుగా విభజించి కీర్తన అర్థాన్ని వివరిస్తూ వచనంలో రాశారు. విమర్శనాశక్తి, సంగీతాభినివేశం, ఈ గ్రంథం తెలియజేస్తుంది. మృచ్ఛకటికం, ముద్రారాక్షసం, మోలియర్ నాటకాలనువదించారు. 1950 ప్రాంతంలో జయపూరు మహారాజు విక్రమదేవవర్మ రాజమండ్రి వచ్చి కామేశ్వరరావుని 'హాస్యబ్రహ్మ' బిరుదుతో సత్కరించారు. భమిడిపాటి వారి రచనలన్నీ విశాలాంధ్ర ప్రచురణాలయం సంస్థ ఏడు సంపుటాలుగా ప్రచురించారు. అందులో భమిడిపాటి వారి రచనా చమత్కృతి, సామాజిక దృక్పథం, హాస్యం తెలుస్తాయి. వారు ప్రచురించిన కథా సంపుటే ఈ వ్యాసానికాధారం.

**అద్దె కొంపలు:** మానవులకు గోచరించే కారణాన్ని పురస్కరించుకొని జీవుడు ఖాళీచేసి పోతుండటం అరగారుగా చూడగా ఎవడిండ్లు వాడికే తెలిసేదాన్ని బట్టి జీవులకి శరీరాలు 'అద్దె కొంపలు'. అద్దె కొంపల్లో ఉండేవారిలో చాలామంది అష్టకష్టాలనుభవిస్తారు. జీతం అందక బాడుగ చెల్లించడం ఆలస్యం, అద్దె సరిగా ఇచ్చినా ఇంటి యజమాని సణుగుడు మానడు. మంచినీళ్లు లేవని అంటే చుట్టూ చెరువులున్నాయి. ఆ నీళ్లు వాడుకోండని బోడి సలహా ఇచ్చిపోతాడు.

**సంగతులు:** వివిధాలైన ఘటనలు జీవితంలో జరుగుతుంటాయి. వాటిని గూర్చి సమాజం రకరకాలైన సంగతులు చెప్తుంది. ఆయా సంగతులు పరస్పరం చెప్పుకొంటారు. ఒకడు తనకన్నం పెట్టే యజమానికి టాక్సు వేయమని కచేరికి పోయి చెప్తాడు. టాక్సు వేస్తారు. యజమాని అంతా తెలుసుకొని ఇంటి నుంచి గెంటేస్తాడు. వాడు ఇంతే సంగతుల్లో ఇరుక్కొనిపోతాడు.

**స్థాయి మారినా ఓటే పాట:** ఐదేళ్లకొకసారి ఎన్నికలు వస్తాయని చాలామందికి తెలియదు. ఎవరో వచ్చి ఏదో అడుగుతారు. అడిగే వాడిని ఓటర్లు ప్రశ్నలు వేస్తారు. సరిగా సమాధానాలిస్తే పరవాలేదని పిస్తుంది. ఓటర్లుకు బహుమతులిస్తారు. కానుకలు పుచ్చుకొన్న వ్యక్తి ఇచ్చేవారి చేతుల్లో చిక్కుతాడు. ఏదిఏమైనా ఎన్నికలు ఓటర్ల పాలిట తంతుగా మారుతుంది. ఓటర్ల ఓట్లతో అభ్యర్థులు విజయం సాధిస్తారు.

**పరీక్షలు:** అసలు జీవితమే ఒక పెద్ద పరీక్ష. లేదునేనెప్పుడో తయారవుతానులే అనడం కాక ఎప్పటికప్పుడు తయారుగా ఉండడం మానవుడు విధి. అటువంటి ధన్యుడి జీవితం ఆదర్శం. ఈ పరీక్ష సామాన్య వాచికం. విద్యార్థి కష్టపడి చదువుతాడు. అందుకు పరీక్షలు పెడతారు. ఆ పరీక్షల్లో మొదటివాడిగా వస్తే బహుమతులు వస్తాయి.

**మన తెలుగు:** తెలుగుదేలయన్న దేశంబు తెలుగేను/ దెలుగు వల్లభుండ దెలుకొకండ/యెల్ల నృపులు గొలువ యెరుగనే బాసాది/ దేశ భాషలందు తెలుగులెస్స. తెలుగుదేశం స్వతంత్రమైంది. తెలుగుభాష దేశ భాషయింది. సంస్థల్లో విస్తరించింది. భాషాపరంగా తెలుగుతో దినపత్రికలు, వారపత్రికలు, మాస పత్రికలు వచ్చాయి. ఇవి తెలుగు భాషాభివృద్ధిని సూచిస్తున్నాయి.

**గ్రంథ ప్రచురణ:** ఒకే క్షణంలో అనేకులు ఒక గ్రంథం సారాన్ని ఆస్వాదించడానికి దానికి లిఖిత ప్రతులు గాని, ముద్రిత ప్రతులు గాని తయారు చేయించటమూ, లేక సభాముఖంగా దాన్ని వినిపించి కనబరచటమూ, మొదలైన పనులన్నీ చేయడం గ్రంథాన్ని ప్రచురణ చెయ్యడం అవుతుంది. గ్రంథ ప్రచురణ అందరికీ సాధ్యం కాదు. డబ్బులున్న వారు, రచయితలు తమ రచనలను తామే ప్రకటిస్తారు. ఆంధ్ర గ్రంథ ప్రచురణ 1806 నుండి జరుగుతూనే ఉంది. ఈ గ్రంథ ప్రచురణలో వావిళ్ల వారిదే అగ్రస్థానం. 1907లో విజ్ఞాన చంద్రికా మండలి జనించింది. దీనిని కొమర్రాజు లక్ష్మణరావు స్థాపించి వారు రచించిన గ్రంథాలన్నీ ఆ మండలి నుండే ప్రచురించారు. తరువాత ఆంధ్ర ప్రచారిణి, ఆంధ్రాభాషాభివర్ధనీ, వేగుచుక్క మొదలైన గ్రంథ మాలలు అవతరించాయి. గ్రంథం ఆత్మ యొక్క అక్షర రూపం. ప్రచురించటం యజ్ఞం లాంటిది.

**వన్స్‌మోర్:** 'వన్సుమోర్' అనేది నాటక రంగానికి చెందింది. ఈ వన్సుమోర్ అనేది ఆంగ్ల భాషా పదం. ఈ పదంలో రెండు పదాలు ఉన్నాయి. వన్సుమోర్‌పదం 1888నుంచి వ్యవహారంలో ఉంది. కొన్ని పదాలకు ఒక దాన్నేచేర్చారు. చిత్రమైనఅర్థాలు చెప్పారు. 'తట్ట' అనే పదానికి 'తట్' బుట్టకి బుట్ కష్టానికి కట్టం, గాలికి గాల్ అని పేరుపెట్టాడు. దీనితో కొందరు ఆయన దగ్గరకు వెళ్లి తమ పేర్లను ఇంగ్లీషులో రాయించుకొన్నారు. తమపేర్లు ఇంగ్లీషులో ఉండటం హోదాగా భావించేవారు. ఈ 'వన్స్‌మోర్' ను వంశమోరు, వనసమోర్, హంసమోర్ అని దానికి పర్యాయ పదాలున్నాయి. ఇది 'వన్స్‌మోర్' చరిత్ర.

**తెలుగు నటుడు:** ఆంధ్ర నాటక విమర్శకులు తెలుగు నటుడికి ఉండవలసిన లక్షణాలను వివిధ ప్రజ్ఞలు బేరీజు వేశారు. నటుడికి సౌష్టవం, బలం కలిగిన విగ్రహం, ఆడేకాళ్లు, తిరిగే చేతులు, కోటేరు లాంటి నాసిక, చారడేసి కళ్లు, కళాత్మకంగా ఉండే వదనం, మధురంగా ఉండే గొంతు, ఉచితమైన సామగ్రి, తెలుగు ఉచ్చారణ, ఆంధ్రము ఇతర భాషలతో పరిచయం, ధారణ, ఉచితవేషం ధరించు కోగల తెలివి మున్నగునవి ఉంటే తెలుగు నటుడిగా రాణించగలుగు తాడట. హృదయ రంజకంగా మెప్పించగలవాడు నటుడు మాత్రమే. అతనికి మరెవ్వరూ సాటిరారు. ఏమైనా నటన అనేది కళ. ఆ కళను ప్రదర్శించేవాడు నటుడు, తెలుగు నటుల్లో ఈ లక్షణాలను పరి శీలించుకొండి. భమిడిపాటి కావేశ్వరరావు కథా కథనాన్ని నడిపారు. ఆయన జీవితంలో ఎన్నో సంఘటనలు జరిగాయి. అందులో ఒకటి. హాస్య బ్రహ్మ భమిడిపాటి కామేశ్వరరావు భావకవి కాకపోయినా పొడుగ్గా జుట్టు పెంచారు. ఆ గిరజాల జుట్టు వెనుక ఒక సీక్రెట్టు ఉంది. ఆయనకు మెడ మీద కణితి ఉండేది. దాన్ని దర్పంగా కవరు చేసుకోవడానికి కేశాలను ఆశ్రయించారు. కొంతకాలం తరువాత కణితిని ఆపరేషను ద్వారా తీయించుకొన్నారు. ఇహ ఈ బరువు దేనికని మామూలు క్రాపింగు చేయించుకొన్నారు. కొన్నాళ్లయ్యాక ఒకరోజు డాక్టరు దగ్గరకు వెళ్లి నా కణితి నాకు తెప్పించండని పట్టుపట్టారు భమిడిపాటి. డాక్టరు విస్తుబోయి ఇదేం చోద్యం? అన్నారట. అయ్యా! ఈ జుట్టుతో నన్నెవరూ గుర్తుపట్టడం లేదు. ఏ ఒక్కడూ దణ్ణం పెట్టడం లేదు. మునుపటి గౌరవం యావత్తు ఆ కణితితో పోయింది అన్నారట. (శ్రీరమణ).

భమిడిపాటి వారు ఉపాధ్యాయునిగా పనిచేశారు. అనుభవాలు పొందారు. ఆ అనుభవాలను కథల్లో చూపించారు. "బతుకు బండి లాగటానికి బడిపంతులు ఉద్యోగం చేయాలి. సంపాదించిన జీతపు రాళ్లతో సంసారాన్ని లాగాలి. బడిపాట అందరూ పాడాలి. బతికుంటే బలుసాకు తినవచ్చుకాని బడిపంతులు ఉద్యోగం వద్దు అనే మాటలు ఆ రోజుల్లో వినిపించాయట. అంతేగాక మేష్టరీ కూడ ఒక ఉద్యోగమేనా అని పెదవి విరిచే వారు. భమిడిపాటి కథా ఘనాపాఠి. హాస్యం జీవితానికి విశ్వం.

## ఒకానొక కొలాజ్ చిత్రం

ఏదైతేనేం ఉక్కపోత
ఏమైతేనేం ఉడుక పోత
చిట చిట చిర చిర/ చెమటపోయడం

బురద పొలంలో నాట్లు వేస్తూ
పోటెత్తి పాటెత్తుకున్నప్పుడల్లా
వీడు ఓట్లను ఏరుకుంటూ ఉంటాడు

ఫిర్యాదు చేయాల్సిన వేళ
కవిత్వ వ్యక్తిత్వం అభావం
బొమ్మ కట్టని పదచిత్రం
కవి మరింత మర్యాదస్తుడై
చేతులు కట్టుకుంటూ వుంటాడు

సుఖించేది నువ్వే/దుఃఖించేది నువ్వే
కర్మ మీద తోసేసి
చేతులు దులుపుకుంటావు

గ్లాసుల గడబిడను /రౌద్ర క్లాస్ స్ట్రగుల్‌గా
అభివర్ణిస్తుంటావు

దీప కాంతికి/శలభం రెక్కలు కాలుతున్న
కమురువాసన అంగడిలో
మనశ్శాంతి వెతుక్కుంటుంటావు

లేబర్ అడ్డా మీద/ ఓ నవ బీహారి జంట
బేహారీ శ్రమ బేరం చేస్తుంటాడు

గౌతముడిని తరిమేసి
అష్టాంగాలను పాతరేసి
రాయి ముందు సాష్టాంగ పడుతున్న
బానిస భక్త శక్తి యుక్తి హీనదశ

దేశమంటే
ఎవడికీ ద్వేషం ఉండదు
రాజసూయ యాగం
ప్రజల యోగం పేరున
కొనసాగుతూనే ఉంటుంది

మత్స్య యంత్రం
తెగకొట్టినవాడే అర్జునుడు
శివ ధనస్సు ఎత్తిన
వాడిదే అయోనిజ

అసలైన దేశభక్తి శస్త్రం
ఇప్పుడు దేవుడు
ఎక్కుపెట్టిన ఎన్నికల అస్త్రం

కేరింగులేని షేరింగ్ ఆటో
నిన్ను ఏదో ఒడ్డుకు చేరుస్తుంది
బుద్ధుడికి శుద్ధి చేసే రోజులు
రారాజుల్లా వెలిగిపోతుంటాయి

కూలర్ ఉన్న ఏసీ వేసిన
ఉక్కపోత ఉడుకపోత
పోత పోసిన మనిషిని
ఉక్కిరి బిక్కిరి బిత్తిరి బిత్తిరి
ఆగమాగం చేసి పడేస్తుంది

దుర్యోధనుడు జలస్తంభనలో
ముక్కు మూసుకొని దాక్కున్నాడు

జవాబు లేని ప్రశ్న/తన్నోడి నన్నోడెనా
నన్నోడి తన్నోడెనా
ద్రౌపది అడుగుతూనే ఉంది

జమ్మిచెట్టు మీంచి/ఆయుధాలను అందుకో
ఐదేళ్లకోసారి చెప్పిన అబద్ధం
ఆయుధం మరోసారి సంధించి
యుద్ధానికి సిద్ధం కావాలి

జ్ఞాత వినియోగదారుడా
అజ్ఞాన అందమైన ప్యాక్‌లో
ఆడితప్పని పానాలగుత్త ధర్మరాజా!
నాకు తెలుసు నువ్వు
ఎన్నటికీ సభలో నిజం చెప్పలేవు

చేసేవాడిని చేయించేవాడిని నేనే
నువ్వు నిమిత్త మాత్రుడివే సవ్యసాచీ!

ఘంటసాల కంచు కంఠంలోంచి
పార్థా! నొసటి రాత
భగవద్గీత జాలు జోలపాడుతుంది

పల్లేర్ల మీద బతుకుబొర్లుతూ
గుండెల్లో గుచ్చుకున్న
విరిగిన ముండ్లను తీస్తున్న పిన్నీసు

పరికి కంప చెట్టు పళ్ళను
ఒడుపుగా తెంపుకు
తింటున్న కమ్మదనం కాలం

నిశ్చల నది మీద పడవ
ఒక్క అడుగు ముందుకు పడదు

గోడకు వేలాడుతున్న
ఒకానొక దిమ్మతిరిగే రంగుల
వెలిసి అలసిన అతుకుల
చిత్తగించని విచిత్ర చిత్రం

పందెం కాయలేక
పొమ్మనలేక పొగ పెట్టడాలు
పాలు తాగిన పిల్లి
వర్చువల్ మల్లగుల్లాలు

జూకంటి జగన్నాథం,
94410 78095

# వర్తమాన సామాజిక వాస్తవికత అడిగోపుల 'నిలువెత్తు సంతకం'

రాచపాలెం చంద్రశేఖరరెడ్డి, 9440222117

నా కవిత్వం పగలు పున్నమి
రాత్రి తిమిరంపై సమరం
కవిత్వం ఉదయించాలి
వెలుగై విస్తరించాలి
కవిత్వంలో నవ్యత్వం
కలకాలం వర్థిల్లాలి (నిలువెత్తు సంతకం: పు-16) - నాలుగు దశాబ్దాలలోని 25 కావ్యాలు రచించిన కవి అడిగోపుల వెంకటరత్నం. ఆయన ఇంజనీరు. అది ఉద్యోగం. ఆయన కవి. అది ప్రవృత్తి. ఆర్భాటం లేకుండా, ప్రచార జ్వరం లేకుండా, సంఘాలలో చేరకుండా, తాను నివసించే సమాజ వేదిక మీద కవిత్వ నృత్యం చేస్తున్న కవి అడిగోపుల. సూర్యోదయంనుండి నిలువెత్తుసంతకం దాకా, అడిగోపుల నిర్మాణాత్మకంగా కవిత్వ వ్యవసాయం చేసుకుంటూ వస్తున్నారు. కవిత్వం ద్వారానే ఆయన తన సమాజంతో సంభాషిస్తున్నారు. ఆయన రచించిన అసంఖ్యాక కవితలకు విడివిడిగా చాలా బహుమతులు వచ్చాయి. వాటినిచూసి ఆయన పొంగిపోలేదు. రాని వాటి కోసం వెంపర్లాడలేదు. తాను కవి గనక, కవిత్వంరాయడం తన కర్తవ్యంగనక, కవిత్వంరాస్తున్నారు. అడిగోపుల ప్రజాస్వామ్య ప్రియుడు. మానవతారాధకుడు. అభ్యుదయవాది. పాఠక ప్రేమికుడు. వస్తు ప్రాధాన్యవాది. సామాజిక వాస్తవికత ఆయన వస్తువు. అది వర్తమానం. అది సమకాలీనం. ఆయనకు కలుషిత రాజకీయాల పట్ల కోపం. హింస పట్ల అసహ్యం. దోపిడి పట్ల కోపం. అవినీతి పట్ల చిరాకు. ఆధిపత్యం పట్ల ఆగ్రహం. సమానత్వం పట్ల ఆకాంక్ష. సమాజ పరివర్తన పట్ల నిబద్ధత. అందు కోసం ఆయన ఇరవైఅయిదు కావ్యాలు రాశారు.

అభ్యుదయ, విప్లవ సాహిత్యాలు కొనసాగుతూ, అస్తిత్వవాదాలు పురుడు పోసుకుంటూ, ప్రపంచీకరణ చీకట్లు ప్రపంచాన్ని చుట్టుముట్టే సమయంలో అడిగోపుల తన అభ్యుదయ పతాక ఎగురవేసి కవిత్వ కరచాలనం చేయడం ప్రారంభించారు. ఆయన తాజా కావ్యం నిలువెత్తు సంతకం.

అప్పుడు నాది/మొలకెత్తిన రెండాకుల శైశవం...
నేనిప్పుడు మహావృక్షాన్ని/ఆకాశమంత ఆశయం
నిలువెత్తుసంతకం (ఈ కావ్యం:పు-49) -అని తనసుతాను నిర్వచించుకున్నారు. నాలుగు దశాబ్దాల పాటు కవిత్వం రాసిన పిడికెడు మంది తెలుగుకవులలో అడిగోపుల ఒకరు. అయితే ఆయనఒంటరి ప్రయాణికుడు.

'నిలువెత్తు సంతకం' కావ్యంలో ఆయన కవితల్ని జాగ్రత్తగా అధ్యయనం చేస్తే మనకు స్పష్టంగా కనిపించేది వర్తమాన సమాజ ముఖ చిత్రమే. స్వాతంత్ర్యానంతర భారతీయ సమాజ పరిణామాలే అడిగోపుల కవిత్వంలో విమర్శనాత్మకంగా ప్రతిబింబించాయి. "నది సముద్రంలో లంగరు", "స్మృతి పథంలో స్వాతంత్ర్యం" అనే రెండు కవితలు భారత స్వాతంత్ర్యం వస్తువుగా వచ్చినవే.

ఏడున్నర దశాబ్దాల స్వాతంత్ర్యం
మూడు కాళ్ల ముదుసలి విచ్చేసింది...
అందరి స్వాతంత్ర్యం/కొందరికే దత్తమైంది
మోడువారిన స్వాతంత్ర్యానికి
అవశ్యం సంజీవని ప్రయోగం (ఈ కావ్యం: పు-22, 23) -ఈ మాటలు మనం సాధించుకున్నది విఫల స్వాతంత్ర్యం అని ధ్వనిస్తున్నది. కవికి చరిత్రపట్ల, ముఖ్యంగా భారతదేశ చరిత్రలో అతి ముఖ్యమైన ఘట్టం స్వతంత్ర ఉద్యమం- దాని పరిణామాల పట్ల విమర్శనాత్మక దృష్టి ఉండడాన్ని సూచిస్తున్నది. స్వాతంత్ర్యాన్ని గుర్తు చేసుకొని ఉప్పొంగిపోయి, జెండా ఎగరేసుకుని పరవశించిపోతే లాభం లేదు, దేశం అసలు రూపాన్ని చూడమని కవి హెచ్చరించారు.

జెండా హరివిల్లై/నేలను మరచి నింగిని
చూస్తుంటే/నేలను చూసి
నింగిని చూడమంటుంది జన్మభూమి (ఈ కావ్యం: పు-111) - మన దేశంలో నెలకొన్న వాస్తవ స్థితిని మొగమాటం లేకుండా చెప్పేవాళ్లే విశ్వసనీయమైన కవులు. పాలకుల ప్రచారాల్లో మునిగిపోయి లేనిది ఉన్నట్లు చెప్పే కవుల కోవకు చెందిన కవి కాదు అడిగోపుల. ఆయన సత్యవాది. అనేక మంది శాస్త్రవేత్తల విజయాలను ప్రస్తుతించి, చివరికి సమాజం ఎలా నిలబడిందంటే...




నియంతృత్వం కన్న హింసను/ ప్రజాస్వామ్యం దత్తత తీసుకుంది. (ఈ కావ్యం: పు-131) అని అనగలగడం కవి నిబద్ధతకు నిదర్శనం. అధికారం లేనప్పుడు ప్రజాస్వామ్యాన్ని గురించి మాట్లాడడం, అధికారంలోకి రాగానే నిరంకుశంగా మారిపోవడం ఈ ద్వంద్వ స్థితిని కవి ఎండగట్టారు.

ఎన్ని చట్టాలు వస్తున్నా స్త్రీల మీద జరిగే దౌర్జన్యాలు ఆగడం లేదు. అడిగోపుల "భారతమ్మ ముద్దుబిడ్డ" కవితలో స్త్రీ పరాధీనతను, ఆమె కుటుంబ జీవిత సమరాన్ని వర్ణించి, చివరికి కల్పనాచావ్లాను గొప్పగా కీర్తించారు. మనదేశం ఎన్ని గొప్పవిజయాలు సాధించినా అనాథ బాలల బాధలు సజీవంగా ఉండడం ఒక వాస్తవం. వీధి బాలలను వర్ణించిన కవి చివరికి 'ప్రభుత్వం పాలిస్తుందని వీళ్లకు/ పాలించాలని ప్రభుత్వానికి తెలియదు (ఈ కావ్యం: పు-13)' అన్నారు. అడిగోపుల ఏ సమస్యను వస్తువుగా తీసుకున్నా రాజకీయాన్నే దోషిగా నిలబెడతారు. ఆ స్పృహ ఆయనకు బలంగా ఉంది. వలస పాలన కాలంలో, వలసానంతర పాలనలోను దెబ్బతింటున్నది రైతాంగం. ప్రజలకు తిండి పెట్టేవారిని దిక్కులేని వాళ్లుగా మార్చే రాజకీయం మనం చూస్తున్నాం. ఇవాళ దేశ రాజధానిలో రైతులు ఉద్యమిస్తున్నారు. రైతుల ఆత్మహత్యలు దేశానికి తలవంపులు. పండించిన పంటకు గిట్టుబాటు ధర లేకపోవడం, పంట కోతకొచ్చినప్పుడు అకాల వర్షం వచ్చి పంటను ముంచెయ్యడం భారతీయ రైతు పడుతున్న అవస్థ. అడిగోపుల "పుట్టెడు దుఃఖం" కవితలో ఈ వాస్తవాన్ని చిత్రించారు. కవికి శాసన వ్యవస్థ పట్ల ఉన్నట్లే, కార్య నిర్వహణవ్యవస్థ పట్ల కూడా విమర్శనాత్మక దృష్టి ఉంటుంది. ఎక్కడో నేరం జరిగితే, అసలైన నేరస్థులను గుర్తించలేక, గుర్తించకుండా, దిక్కులేని వాళ్లను పట్టుకుపోయి లాకప్‌లో చావగొట్టి అనాథ శవంగా చేసే దుర్మార్గం మీద అడిగోపుల 'చిరునామా లేదు' కవిత రాశారు.

నడిచిపోయిన మనిషి/మూటగా మారాడు
ప్రభుత్వం ఉంది/రాజ్యాంగం ఉంది
మనిషి ఉన్నాడు/చిరునామాయే లేదు (ఈ కావ్యం: పు-69) - నేటి ప్రాజెక్టులు ఆధునిక దేవాలయాలన్నారు జవహర్‌లాల్ నెహ్రూ. పెద్ద ప్రాజెక్టులు కట్టినప్పుడు, మునిగిపోయే ప్రాంతాల ప్రజలకు పాలకులు సరైన సౌకర్యాలు కల్పించరు. నష్టపరిహారం చెల్లించరు. నానా ఇబ్బందులు పెడతారు. ప్రజల కష్టాలు వర్ణనాతీతం.

'పునరావాసం పరిహారం/కృష్ణాష్టమి ఉట్టిగట్టి
అందుకోమంటూ/ప్రభుత్వం వేలాడదీస్తుంది (ఈ కావ్యం: పు-61)' అని కవి పాలకుల జాప్యాన్ని అధిక్షేపించారు.

సమాజం ఆధునికమౌతున్న కొలదీ మానవ సంబంధాలు మరింత మానవీయంగా మారాలి. కానీ పెట్టుబడిదారీ వ్యవస్థ, దాని పరిణత రూపమైన ప్రపంచీకరణ మానవ సంబంధాలలోని మానవాంశను చంపి, ధన సంబంధాలుగా మార్చేస్తున్నాయి.

'చూపుల కలయికల్లేవు, కరచాలనాల్లేవు / యుగల గీతాల్లేవు,
నడకల సందోహం లేదు/ మాటల సందడి లేదు,
చేతుల సంఘటితాల్లేవు/ఏకవచన జీవిత చక్రం
బహువచన ఇరుసు మయం (ఈ కావ్యం: పు-82)' - ఒక ఆధునిక కవి తన కాలపు సమాజాన్ని ఎన్ని పార్శ్వాల నుండి కావ్యంలోకి తీసుకురావాలో అడిగోపులకు బాగా తెలుసు. ఆయనకు మానవతా పరిణామం, మానవ జాతి పుట్టుక విన్యాసాలను ఒక చిన్న పరిధిలో అద్భుతంగా చిత్రించారు.

శ్రామికకుటుంబాల నుండి వచ్చినకవులు మట్టిని గురించి రాయకుండా ఉండడం సాధ్యం కాదు. మట్టి అంటే భూమి. భూమిమీద జరిగే కార్యకలాపాలు అసంఖ్యాకం. అడిగోపుల భూమితత్వాన్ని "మట్టి ప్రాణం పోస్తుంది" అనే కవితలో చెప్పారు. భూమి మీద జరిగిన చరిత్రను చెప్పారు. అంతేగాక ఇలా నిర్వచించారు.

మట్టి ఒక గణితం ఒక వాచకం/ఒక శాస్త్రం ఒక సాంకేతికం (ఈ కావ్యం: పు-38)

'కాదేదీ కవిత కనర్హం' అన్నారు శ్రీశ్రీ. అడిగోపుల వాల్‌పోస్టర్ మీద అరుదైన కవిత రాశారు. 'గోడలు సజీవాలు' పేరుతో.

కార్మికులంతా ఏకంకండంటూ
పిడికిలి బిగిస్తుంది గోడ (ఈ కావ్యం: పు-128)
అంటూ గోడలు సామాజిక చరిత్రకు ఎలా ప్రచార సాధనాలవుతాయో వర్ణించారు.

వర్తమాన సమాజాన్ని అడిగోపుల "చీకటి దీపం" అని ఉపమించారు. స్వార్థపరులు ఆ దీపాన్ని మత తైలం, కుల చమురు పోసి వెలిగిస్తున్నారని విమర్శించారు. అడిగోపులకు ప్రకృతి ప్రీతి అపారంగా ఉంది. ప్రకృతిని మానవీకరిస్తారాయన. వర్షం పర్యావరణంలో తీసుకొచ్చే ప్రక్షాళనను ఆసక్తికరంగా వర్ణించారు. నీటి ప్రవాహ చిత్రణలో కవి ఈత కొట్టారు. కవి కరెంటులేని కాలంనాటి బాల్యాన్ని కల రూపంలో చిత్రించారు. "వెన్నెల వెలుతురు" కవితలో కల చెదిరేటప్పటికి వర్తమానంలో ఉంటాడు కవి.

అడిగోపుల మౌనిలాగే ఉంటారు. అందుకేనేమో ఆయన ఒంటరితనం, ఏకాకిత్వం గురించి కొన్ని కవితలు రాశారు.

కుదురు పటిష్టమైతే/ఒంటరి సమూహం
కుదురు కదిలితే/సమూహం ఏకాకి (ఈ కావ్యం: పు-113) అని తత్వపరిచారు. గౌతమ బుద్ధుని ఒంటరి తపస్సును కవితలో ప్రస్తావించడం ఉచితంగా ఉంది. పక్షి, మనిషి చేసే విశ్వ విహారం, దాని పరిణామాన్ని అడిగోపుల "విశ్వ విహారి" కవితలో తులనాత్మకంగా వర్ణించడం కొత్తగా ఉంది.

అడిగోపుల కవిత్వం పాఠకులు మోయలేని బరువుగా ఉండదు. శిల్ప పరంగా అడిగోపుల పొదుపరి. "భూమి శిలాఫలకమైంది", "ఊహలు నారు కయ్యలాగ గుబురుగా మొలుస్తాయి" వంటి పాఠకుల హృదయాలను తడతాయి. అడిగోపుల కవిత్వం గురించి ప్రతి సంపుటిలోనూ కొన్ని కవితలు రాస్తుంటారు. వాటినన్నిటినీ కలిపి చదివితే ఆయన కవిత్వ దృక్పథం తెలుస్తుంది. "నిలువెత్తు సంతకం" కావ్యంలో ఆరేడు కవిత్వ కవితలున్నాయి.

భాషేదైనా భావమేదైనా
ఐదు ఖండాల్ని కలిపి కుట్టేదే కవిత (ఈ కావ్యం: పు-122)
అక్షరాలు ఆనందాశ్రువులు, దుఃఖాశ్రువులు
గుడ్డివాళ్లకు చూపౌతాయి
కుంటి వాళ్లకు నడకౌతాయి (ఈ కావ్యం: పు-33)

అడిగోపుల కావ్యాలు అభ్యుదయ అక్షర దీపికలు. వర్తమాన వాస్తవికతా వ్యాఖ్యానాలు. రాజకీయ కంఠస్వరాలు. విమర్శనాత్మక కళాకాంతులు. అడిగోపుల వెంకటరత్నం కృషి తెలుగు కవిత్వానికి గర్వకారణం.

# బెంగాల్‌కు ఏమైంది?

- పెరుగుతున్న వారసత్వ రాజకీయం
- 42 మందిలో 13 మంది అభ్యర్థులు వారసులే
- ఎన్నికలకు దూరంగా వర్సిటీలు, కళాశాలలు
- కానరాని క్షేత్రస్థాయి నాయకులు

**కోల్‌కతా:** భారత ప్రజాస్వామ్యంలో వారసత్వ రాజకీయాలు సహజ పరిణామమే. అయితే సాంప్రదాయకంగా శక్తివంతమైన విద్యార్థి రాజకీయాలకు ప్రసిద్ధి చెందిన పశ్చిమబెంగాల్‌లో ఈసారి వాటి ఉనికి పెరగడడం చూస్తుంటే... అట్టడుగు స్థాయి నుండి రాజకీయ నాయకులను తయారుచేసే సంప్రదాయం నుంచి రాష్ట్రం దూరమవుతున్న సంకేతాలు కనిపిస్తున్నాయి. ఈసారి సార్వత్రిక ఎన్నికల్లో బెంగాల్‌లోని 42 లోక్‌సభ స్థానాలకు గాను 13 స్థానాల్లో రాజకీయ కుటుంబాలకు చెందిన అభ్యర్థులు పోటీలో ఉన్నారు. మూడు స్థానాలకే పరిమితమైన గత ఎన్నికలతో పోలిస్తే ఇది గణనీయ పెరుగుదలను సూచిస్తుంది. 'బెంగాల్‌లో వర్గ ఆధారిత రాజకీయాల నుండి వారసత్వ రాజకీయాలకు వస్తున్న కొత్త ధోరణి లేదా పరిణామం. లోక్‌సభ ఎన్నికలలో ఎన్నడూ రాజకీయ కుటుంబాల నుండి ఇంత ఎక్కువ మంది అభ్యర్థులు రాలేదు' అని సెంటర్ ఫర్ స్టడీస్ ఇన్ సోషల్ సైన్సెస్ రాజకీయ శాస్త్రవేత్త మైదుల్ ఇస్లాం పీటీఐకి చెప్పారు. ప్రజా నాయకుల చరిష్మా, పార్టీ చిహ్నాలు, సమస్యలతో రాజకీయాలు నిర్దేశించబడుతున్న బెంగాల్‌లో ఈ వారసత్వ రాజకీయాలను ప్రజలు ఏ విధంగా అంగీకరిస్తారో చూడాలి' అని ఆయన అన్నారు. ఈసారి అధికార తృణమూల్ ఐదు, కాంగ్రెస్ నాలుగు, వంశపారంపర్య రాజకీయాలను వ్యతిరేకించే రెండు పార్టీలు, బీజేపీ, సీపీఎం లకు కూడా ఇద్దరు చొప్పున రాజవంశ అభ్యర్థులు ఉండటం గమనార్హం. టీఎంసీ, బీజేపీ, కాంగ్రెస్ నాయకుల అభిప్రాయం ప్రకారం, బెంగాల్‌లో వారసత్వ రాజకీయ అభ్యర్థుల సంఖ్య పెరుగుదలకు అనేక అంశాలు దోహదం చేస్తాయి. "రాజకీయాల్లో స్థిరపడిన కుటుంబం నుంచి వచ్చిన వారి విజయానికి రెండు ప్రధాన కారణాలున్నాయి- పేరు గుర్తింపు, నెట్‌వర్కింగ్, ఇది ఎన్నికల్లో ప్రజల మద్దతును పొందడం వారికి సులభతరం చేస్తాయి' అని టీఎంసి సీనియర్ నాయకుడు ఒకరు చెప్పారు. టీఎంసీ జాతీయ ప్రధాన కార్యదర్శి, డైమండ్ హార్బర్ నుండి రెండుసార్లు ఎంపీగా ఎన్నికైన అభిషేక్ బెనర్జీ, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ మేనల్లుడు. ఎన్నికల్లో పోటీ చేస్తున్న వారసత్వ రాజకీయ అభ్యర్థుల జాబితాలో అగ్రస్థానంలో ఉన్నారు. ఈ స్థానం నుంచి ఆయన మళ్లీ ఎన్నికవ్వాలని కోరుతున్నారు. కాంతి లోక్‌సభ స్థానం నుండి బీజేపీ అభ్యర్థి సౌమేందు అధికారి తూర్పు మిడ్నాపూర్‌లోని శక్తివంతమైన అధికారి కుటుంబం నుండి వచ్చారు. అతని తండ్రి సిసిర్ అధికారి ఈ స్థానం నుండి మూడుసార్లు ఎంపీగా గెలిచారు. అతని సోదరుడు సువేందు అధికారి బెంగాల్ అసెంబ్లీలో ప్రతిపక్ష నేత. మాల్దా సౌత్ సీటులో కాంగ్రెస్ పార్టీ 2006 ఉపఎన్నికల నుండి విరామం లేకుండా విజయం సాధించిన కాంగ్రెస్ పితామహుడు ఎబిఎ ఘనీ ఖాన్ చౌదరి సోదరుడు అబూ హసేమ్ ఖాన్ చౌదరిని కాదని అతని కుమారుడు ఇషాఖాన్ చౌదరికి సీటు అప్పగించింది. ఈయన కాంగ్రెస్ మాజీ ఎమ్మెల్యే. ఇక సీపీఎంకు చెందిన దక్షిణ కోల్‌కతా అభ్యర్థి సరియా షా హలీమ్ కూడా రాజకీయ కుటుంబానికి చెందినవారే. ఆమె మామ, హషీమ్ అబ్దుల్ హలీమ్... పశ్చిమ బెంగాల్ అసెంబ్లీకి ఎక్కువ కాలం పనిచేసిన స్పీకర్. ఆమె భర్త ఫువాద్ హలీమ్... సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు. 'డాక్టర్ కొడుకు డాక్టర్ కావాలని ఆశిస్తే, అడ్వొకేట్ కొడుకు లాయర్ కావాలని కోరుకుంటే, రాజకీయ నాయకుల పిల్లలు లేదా బంధువులు ఇలాంటి అడుగుజాడలను అనుసరించడంలో తప్పేమిటి? అర్హత ప్రమాణాల విషయంలో రాజీపడినప్పుడే అధికార కేంద్రీకరణకు దారి తీసి అది సమస్యాత్మకం అవుతుంది' అని టీఎంసీ నాయకుడు శాంతాను సేన్ పీటీఐకి చెప్పారు. ఉలుబెరియా నుండి టీఎంసీ తన సిట్టింగ్ ఎంపీ సజ్దా అహ్మద్‌ని రంగంలోకి దింపింది. ఈమె టీఎంసీ మాజీ ఎంపీ సుల్తాన్ అహ్మద్ భార్య. అలాగే పార్టీ మాజీ ఎంపీ గోవింద చంద్ర నాస్కర్ కుమార్తె, ప్రతిమ మండల్‌ను జయనగర్ అభ్యర్థిగా నిలబెట్టింది. బర్ధమాన్-దుర్గాపూర్ స్థానం నుండి బీహార్ మాజీ ముఖ్యమంత్రి భగవత్ ఝా ఆజాద్ కుమారుడు, గతంలో బీహార్ నుంచి ఎన్నికైన ఎంపీ, మాజీ క్రికెటర్ కీర్తి ఆజాద్‌ను పోటీకి దింపింది. కాంగ్రెస్ పార్టీ మాజీ ఎంపీ దేబేంద్ర మహతో కుమారుడు పురూలియా నుంచి నేపాల్ మహతో, జంగీపూర్ స్థానం నుంచి మాజీ మంత్రి అబ్దుస్ సత్తార్ మనవడు మోర్తాజా హొస్సేన్‌ను పోటీకి దింపింది. 'కేవలం నా కుటుంబం వల్ల కాదు... నేను కూడా గత 15 సంవత్సరాలుగా ఇక్కడ ఎమ్మెల్యేగా ఉండి ప్రజలకు సేవ చేస్తున్నాను' అని రాయ్‌గంజ్ నుండి కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలోకి దిగిన అలీ ఇమ్రాన్ రంజ్ పేర్కొన్నారు. ఈయన ప్రముఖ ఫార్వర్డ్ బ్లాక్ నాయకుడు మహమ్మద్ రంజాన్ అలీ కుమారుడు. లెఫ్ట్ ఫ్రంట్ ప్రభుత్వంలో మాజీ మంత్రి హఫీజ్ ఆలం సైరాని మూనల్లుడు. బొంగావ్ స్థానం నుంచి బరిలోకి దిగిన బిజెపి అభ్యర్థి శంతను ఠాకూర్... మతువా-ఠాకూర్‌బారీ కుటుంబం నుండి వచ్చారు. శంతను ఠాకూర్ తండ్రి మంజుల్ కృష్ణ ఠాకూర్ టీఎంసీ మాజీ మంత్రి. అతని అత్త మమతా బాలా ఠాకూర్ టీఎంసీ ఎంపీ. ఇక సీపీఎం సెరంపూర్ అభ్యర్థి దీప్సితా ధర్... మూడుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన పద్మా నిధి ధర్ మనవరాలు. రాజకీయ వంశపారంపర్యంగా అభ్యర్థులను నిలబెట్టాలన్న తమ నిర్ణయాలను బీజేపీ, సీపీఎం సమర్థించుకున్నాయి. 'సరియా షా హలీమ్, దీప్సితా ధర్ ఇద్దరూ మంచి నాయకులు, వక్తలు. దీనికి వారసత్వంతో సంబంధం లేదు' అని సీపీఎం నాయకుడు సుజన్ చక్రవర్తి అన్నారు. పశ్చిమ బెంగాల్ బీజేపీ అధికార ప్రతినిధి సమీక్ భట్టాచార్య మాట్లాడుతూ... పార్టీ వారసత్వ రాజకీయాలకు వ్యతిరేకంగా గళం విప్పిందని... అయితే ఠాకూర్ , సౌమేందు అధికారి విషయంలో ఇందుకు మినహాయింపు ఉందన్నారు. ఇద్దరూ బాగా పేరున్న నాయకులని పేర్కొన్నారు. 'ఇద్దరూ సొంతంగా నాయకులుగా ఎదిగారు. వారి గెలుపును బట్టి పార్టీ టికెట్లు పొందారు' అని ఆయన అన్నారు. బెంగాల్‌లో వారసత్వ రాజకీయాలు స్వాతంత్ర్యానికి పూర్వం నుంచి స్వాతంత్ర్యం తర్వాత కూడా ప్రబలంగా ఉన్నప్పటికీ ముఖ్యంగా 50వ దశకం నుంచి విద్యార్థి రాజకీయాలనేవి తరువాతి తరం రాజకీయ నాయకులు ఉద్భవించడానికి అవకాశం కల్పించాయి. ప్రస్తుత ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, మాజీ ముఖ్యమంత్రి బుద్ధదేవ్ భట్టాచార్య, లెఫ్ట్ ఫ్రంట్ ఛైర్మన్ బిమన్ బోస్, కాంగ్రెస్ నేతలు సోమెన్ మిత్ర, ప్రియరంజన్ దాస్‌మున్సీ విద్యార్థి రాజకీయాల నుంచి వచ్చినవారే. రాజకీయ విశ్లేషకుడు విశ్వనాథ్ చక్రవర్తి మాట్లాడుతూ క్యాంపస్‌ల నుండి పుట్టుకొచ్చే నాయకుల కొరత కారణంగా వారసత్వ రాజకీయాల ధోరణి ఊపందుకుంటోందన్నారు. 'ఇంతకుముందు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలు తరువాతి తరం రాజకీయ నాయకులను తయారుచేశాయి. కానీ ప్రెసిడెన్సీ కళాశాల, జాదవ్‌పూర్ విశ్వవిద్యాలయం మినహా... గత ఐదేళ్లలో ఏ విశ్వవిద్యాలయాలు ,కళాశాలల్లో విద్యార్థి సంఘం ఎన్నికలు జరగలేదు. కాబట్టి కొత్త నాయకులు ఎవరూ పైకి రాలేదు. వారసత్వ అభ్యర్థులపై ఆధారపడేలా రాజకీయ పార్టీలను ఈ పరిస్థితి నిర్బంధిస్తోంది' అని ఆయన అన్నారు.

## నేరుగా పోటీచేయలేని నేతలకు రాజస్థాన్ అడ్డా

### సోనియాపై మోదీ పరోక్ష వ్యాఖ్యలు

**జైపూర్:** లోక్‌సభ ఎన్నికల మొదటి దశ పోలింగ్ తర్వాత ప్రధాని నరేంద్ర మోదీ ప్రచారంలో దూకుడు పెంచారు. రాజస్థాన్‌లోని జలోర్ ఎన్నికల సభలో ఆదివారం మోదీ మాట్లాడుతూ కాంగ్రెస్ అగ్రనేత సోనియాగాంధీపై పరోక్షంగా సంచలన వ్యాఖ్యలు చేశారు. నేరుగా ఎన్నికల్లో పోటీ చేయలేని నేతలు కొందరికి రాజ్యసభకు వెళ్లేందుకు రాజస్థాన్ అడ్డాగా మారిందన్నారు. తొలుత దక్షిణాది నుంచి కేసీ వేణుగోపాల్, తర్వాత మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ ఇప్పుడు మరో నేత రాజస్థాన్ నుంచి రాజ్యసభకు వెళ్లారని సోనియాగాంధీని ఉద్దేశించి మోదీ పరోక్షంగా వ్యాఖ్యానించారు.'కాంగ్రెస్ 60 ఏళ్లు అధికారంలో ఉంది. ఒకప్పుడు ఆ పార్టీ 400 సీట్లు గెలుచుకుంది. ఇప్పుడు కనీసం 300 సీట్లలో పోటీ చేయడానికి వాళ్లకు అభ్యర్థులే దొరకడం లేదు. తప్పులు చేసి చేసి ఈ పరిస్థితి తెచ్చుకున్నారు. ఇప్పుడు ఇండియా కూటమి పేరుతో అవకాశవాద కూటమి ఒకటి ఏర్పాటు చేశారు. కూటమిలోని పార్టీలే 25 శాతం సీట్లలో ఒకరిపై ఒకరు పోటీ చేస్తున్నారు. కాగా, జలోర్‌లో లోక్‌సభ ఎన్నికల రెండో దశలో భాగంగా పోలింగ్ ఈ నెల 26న జరగనుంది.

## నాకు, నా మేనల్లుడికి రక్షణ లేదు: మమత

**కోల్‌కతా:** తనకు, తన మేనల్లుడు, టీఎంసీ జాతీయ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీకి భద్రత లేదని సీఎం మమతా బెనర్జీ సంచలన ఆరోపణలు చేశారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో కుమార్ గంజ్ టీఎంసీ అభ్యర్థి, రాష్ట్ర మంత్రి బిప్లబ్ మిత్రా తరపున ఎన్నికల ర్యాలీ నిర్వహించారు. దీదీ మాట్లాడుతూ బీజేపీ తనను, తన మేనల్లుడిని టార్గెట్ చేస్తోందన్నారు. రాష్ట్రంలో తమకు భద్రత లేదన్నారు. గతంలో ఓ అంశం టీఎంసీని, ఆ పార్టీ అగ్రనేతలను కుదిపేస్తుందంటూ ప్రతిపక్ష బీజేపీ నేత సువేందు అధికారి కీలక వ్యాఖ్యలు చేశారు. దీనిపై మమతా బెనర్జీ తాజాగా స్పందించారు. 'బీజేపీ నన్ను, అభిషేక్‌ను టార్గెట్ చేస్తోంది. మేము సురక్షితంగా లేము. అయితే బీజేపీ కుట్రలకు మేం బయపడం. టీఎంసీ నాయకులు... రాష్ట్ర ప్రజలపై కుట్ర జరగకుండా అందరూ జాగ్రత్తగా ఉండాలని కోరుతున్నాము' అని ఆమె అన్నారు. సువేందు అధికారి వ్యాఖ్యలపై స్పందించిన మమతా బెనర్జీ 'తన కుటుంబాన్ని అక్రమ సంపదను కాపాడుకోవడానికి బీజేపీలో చేరిన ఒక దేశద్రోహి ఉన్నాడు. అతడి తాటాకు చప్పుళ్లకు మేం బెదరమని స్పష్టం చేశారు.

## కాంగ్రెస్‌పై దాడే ముఖ్యమా?

### మోదీపై పవార్ మండిపాటు

**జలగావ్:** లోక్‌సభ ఎన్నికల వేళ ప్రధాని నరేంద్ర మోదీ ప్రచార తీరుపై ఎన్సీపీ-ఎస్‌పీ అధినేత శరద్ పవార్ విమర్శలు గుప్పించారు. ఎన్నికల ప్రచారంలో ప్రధాని దేశం ఎదుర్కొంటున్న సమస్యలపై మాట్లాడకుండా... కేవలం ప్రతిపక్ష కాంగ్రెస్‌పై విమర్శలకే పరిమితమవుతున్నారని పవార్ ఆరోపించారు. ఆదివారం ఆయన జలగావ్‌లో మీడియాతో మాట్లాడుతూ గతంలో ప్రధానమంత్రులు ఎన్నికల ప్రచారంలో దేశ భవిష్యత్తుపై తమ విజన్ ఏమిటో చెప్పేవారని పవార్ గుర్తు చేశారు. కానీ, మోదీ మాత్రం తనదైన వాక్చాతుర్యంతో ప్రజల్ని ప్రభావితం చేసేందుకు వ్యక్తిగత దాడులు, కాంగ్రెస్‌ను నిందించడంతోనే సరిపోతుంది తప్ప... దేశ సమస్యలపై మాట్లాడట్లేదని ఆక్షేపించారు. ప్రస్తుతం దేశ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలేంటి? ఎలా ముందుకెళ్లాలనే అంశాలపై మోదీ మాట్లాడటం లేదని పవార్ విమర్శించారు. గాంధీ-నెహ్రూ భావజాలంతో జలగావ్ గుర్తింపు పొందిందని, అయితే, కొన్నేళ్లుగా కొన్ని అంశాల్లో మార్పు వచ్చిందని తెలిపారు. ఈసారి ఎన్నికల్లో జలగావ్, రేవర్ లోక్‌సభ నియోజకవర్గాల్లో మహావికాస్ అఘాడీ (కాంగ్రెస్-శివసేన యూబీటీ-ఎన్సీపీ ఎస్పీ)కి అనుకూలంగా ఉందని అభిప్రాయపడ్డారు.

## ఆ పదాలు తొలగించం

### ఈసీ నోటీసులపై ఉద్ధవ్ ఠాక్రే

**ముంబై:** మహారాష్ట్రలో శివసేన(యూబీటీ)కు చెందిన కొత్త ప్రచార గీతం వివాదంలో పడింది. అందులోని జైభవానీ, హిందూ అనే పదాలు తొలగించాలని సూచిస్తూ కేంద్ర ఎన్నికల సంఘం తమకు నోటీసులు పంపిందని పార్టీ అధ్యక్షుడు ఉద్ధవ్ ఠాక్రే వెల్లడించారు. అయితే ఈసీ ఆదేశాలకు తాము కట్టుబడి ఉండబోమని ఆయన స్పష్టం చేశారు. పార్టీ గీతం నుంచి ఆ పదాలు తొలగించడం మహారాష్ట్రకు అవమానకరమని పేర్కొన్నారు. 'తుల్జా భవానీ ఆశీస్సులతో ఛత్రపతి శివాజీ మహారాజ్ హిందవీ స్వరాజ్‌ను స్థాపించారు. మతం, భవానీ మాత పేర్ల మీద మేం ఓట్లు అడగటం లేదు. ఈ పదాలు తొలగించమనడం అవమానకరం. దీన్ని మేం సహించం' అని ఉద్ధవ్ పేర్కొన్నారు. 'ఒకవేళ మా మీద చర్యలు తీసుకోవాలనుకుంటే... కర్నాటక అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రధాని మోదీ 'బజరంగ్ బలీ' ప్రస్తావన తెచ్చినప్పుడు ఏం చేసిందో ఈసీ చెప్పాలి. అయోధ్య ఉచిత దర్శనం పేరిట అమిత్ షా ఓట్లడిగారు' అని తెలిపారు. ప్రస్తుతం మతం పేరిట ఓట్లడుగుతున్నారని, ఈ విషయంలో నిబంధనలు ఏమైనా మారాయా అని 'ఈసీ'ని ఉద్ధవ్ ప్రశ్నించారు. అతల్ బిహారీ వాజ్‌పేయి హయాంలో హిందుత్వ ప్రచారం చేసినందుకు తన తండ్రి బాలాసాహెబ్ ఠాక్రేను ఆరేళ్లపాటు ఎన్నికల్లో ఓటు వేయకుండా, పోటీ చేయకుండా నిషేధించారని గుర్తుచేశారు. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ప్రధాని మోదీ, అమిత్ షా మతాన్ని ప్రస్తావిస్తూ చేసిన ప్రసంగాలు నిబంధనల ఉల్లంఘన అవునా? కాదా? స్పష్టం చేయాలని ఎన్నికల సంఘాన్ని కోరినట్లు చెప్పారు.

## నేడు11 కేంద్రాల్లో రీపోలింగ్

**ఇంఫాల్:** ఇన్నర్ మణిపూర్ లోక్‌సభ నియోజకవర్గంలోని 11 పోలింగ్ స్టేషన్‌లలో 22వ తేదీన రీపోలింగ్ నిర్వహించనున్నట్లు మణిపూర్ ముఖ్య ఎన్నికల అధికారి ప్రకటించారు. ఏప్రిల్ 19న ఈ పోలింగ్ స్టేషన్లలో జరిగిన ఓటింగ్ చెల్లదని ప్రకటించి మళ్లీ ఓటింగ్ నిర్వహించాలని తాజాగా ఎన్నికల సంఘం నిర్ణయం తీసుకుంది. రీపోలింగ్ నిర్వహించే పోలింగ్ స్టేషన్లలో ఖురాయ్ నియోజకవర్గానికి చెందిన మొయిరాంగ్‌కంపు సాజేబ్, థోంగమ్ లీకై, క్షేత్రీగావ్‌లో నాలుగు, ఇంఫాల్ తూర్పు జిల్లాలోని థోంగ్జులో ఒకటి, ఉరిపోక్‌లో మూడు, ఇంఫాల్ పశ్చిమ జిల్లాలోని కొంతౌజామ్‌లో ఒకటి ఉన్నాయి. మణిపూర్‌లోని రెండు లోక్‌సభ స్థానాలైన ఇన్నర్ మణిపూర్, ఔటర్ మణిపూర్‌లకు శుక్రవారం మొదటి దశ పోలింగ్ జరగగా 72 శాతం మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఆ సమయంలో రిగ్గింగ్, బూత్ క్యాప్చర్ జరిగిందని కాంగ్రెస్ ఆరోపించింది. 47 పోలింగ్ స్టేషన్లలో రీపోలింగ్ నిర్వహించాలని డిమాండ్ చేసింది. కాంగ్రెస్ మణిపూర్ యూనిట్ అధ్యక్షుడు కె. మణిపూర్ ప్రధాన ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేశారు. ఇన్నర్ మణిపూర్ నియోజకవర్గంలోని 36 పోలింగ్ స్టేషన్‌లు, 'ఔటర్ మణిపూర్' నియోజకవర్గంలోని 11 పోలింగ్ స్టేషన్లలో రీపోలింగ్ నిర్వహించాలని డిమాండ్ చేశారు. కుల సంఘర్షణతో ప్రభావితమైన మణిపూర్‌లోని కొన్ని పోలింగ్ స్టేషన్లలో కాల్పులు, బెదిరింపులు, ఈవీఎంలు ధ్వంసం చేయడం, పోలింగ్ స్టేషన్లు స్వాధీనం చేసుకోవడం వంటి ఆరోపణలు వెలుగులోకి వచ్చాయి.

## రాజకీయాల్లోనే ఉంటా: యూసఫ్ పఠాన్

**కోల్‌కతా:** తాను రాజకీయాల్లో కొనసాగేందుకే ఇక్కడకు వచ్చానని, స్థానిక ప్రజల కోసమే పని చేస్తానని మాజీ క్రికెటర్, తృణమూల్ నేత యూసఫ్ పఠాన్ పేర్కొన్నారు. గుజరాత్‌కు చెందిన ఆయన... పశ్చిమ బెంగాల్‌లో కాంగ్రెస్ సీనియర్ నేత అధీర్ రంజన్‌కు ప్రత్యర్థిగా బరిలో ఉన్నారు. అన్నిరకాల క్రికెట్ ఫార్మాట్‌ల నుంచి 2021లోనే వైదొలిగిన ఇర్ఫాన్ పఠాన్... ప్రస్తుతం బహరంపూర్ లోక్‌సభ స్థానం నుంచి పోటీలో ఉన్నారు. 'స్థానికులు నన్ను సొంత మనిషిగా భావిస్తున్నారు. ఎన్నికల ఫలితం ఎలా వచ్చినా ఈ ప్రాంత ప్రజల అభివృద్ధికి కట్టుబడి ఉంటాను. గెలుస్తానని నమ్మకం ఉంది. మమ్మల్ని వదిలి వెళ్లనివ్వమని చెబుతున్న ప్రాంతానికి రావడం సంతోషంగా ఉంది' అని యూసఫ్ పఠాన్ పేర్కొన్నారు. పీటీఐ వార్తా సంస్థకు ఇంటర్వ్యూ ఇచ్చిన ఆయన... ప్రత్యర్థి అధీర్ రంజన్ అంటే వ్యక్తిగతంగా తనకెంతో గౌరవం ఉందన్నారు. ఎన్నో ఏళ్లుగా ఇక్కడి నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నప్పటికీ అభివృద్ధిని నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్ ప్రతిష్ఠాత్మకంగా భావిస్తోన్న ముర్షిదాబాద్ జిల్లాలోని బహరంపూర్ లోక్‌సభ స్థానం నుంచి యూసఫ్ పఠాన్ పోటీలో ఉన్నారు. కోల్‌కతా నైట్ రైడర్స్ తరపున ఐపీఎల్‌లో ఆడిన యూసఫ్...టీఎంసీ అధినాయకత్వంతో సన్నిహితంగా మెలిగారు. మరోవైపు జాతీయస్థాయిలో విపక్ష కూటమి 'ఇండియా'లో భాగస్వామ్యమైన ఈ రెండు పార్టీలు.. బెంగాల్‌లో వేర్వేరుగా పోటీ చేస్తున్నాయి.

## మోదీ పాలనలో రైలు ప్రయాణం ఓ శిక్ష: రాహుల్

**న్యూఢిల్లీ:** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రైల్వే వ్యవస్థలను నిర్వీర్యం చేయాలని చూస్తోందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మండిపడ్డారు. రైల్వేలను తన స్నేహితులకు విక్రయించేందుకు ఓ సాకు చూపుతోందని ఆరోపించారు. ట్విటర్ యూజర్ షేర్ చేసిన ఓ వీడియోను రాహుల్ రీట్వీట్ చేస్తూ రైలు ప్రయాణికుల కష్టాలను చూపించారు. రిజర్వేషన్ బోగీలోనూ ప్రయాణికులు కిక్కిరిసిపోయిన వైనాన్ని, బోగీలో చోటులేక టాయిలెట్ లో కూర్చుని ప్రయాణిస్తున్న అవస్థను వీడియోలో చూపించారు. మోదీ పాలనలో రైలు ప్రయాణం శిక్షగా మారిందని, జనరల్ బోగీలను తగ్గించి 'ఎలైట్ రైళ్ల' (లగ్జరీ ట్రైన్లను) మాత్రమే ప్రోత్సహిస్తుందన్నారు. తద్వారా అన్ని వర్గాల రైల్వే ప్రయాణికుల్ని ఇబ్బంది పెడుతోందంటూ ఎక్స్ వేదికపై పోస్ట్ చేశారు. కన్ఫర్మ్ చేసిన టికెట్లతో కూడా ప్రయాణికులు తమ సీట్లపై ప్రశాంతంగా కూర్చోలేకపోతున్నారని ఆయన పేర్కొన్నారు. సామాన్యులు మరుగుదొడ్డిలో దాక్కుని లేదా నేలపై కూర్చొని ప్రయాణం చేయవలసి వస్తోందని రాహుల్ వ్యాఖ్యానించారు. 'మోదీ ప్రభుత్వం తన విధానాలతో రైల్వే వ్యవస్థలను బలహీన పరచి... రైల్వేను తన స్నేహితులకు విక్రయించేందుకు ఒక సాకు చూపుతుంది అని ఆరోపించారు. సామాన్యులు సౌకర్యవంతమైన రవాణా కావాలంటే రైల్వేలను నాశనం చేస్తున్న మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించాల్సిందేనని పిలుపు నిచ్చారు.

## ఆర్‌జేడీలో ఎల్‌జేపీ ఎంపీ మెహబూబ్ చేరిక

**పాట్నా:** లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో బీహార్ లోక్ జనశక్తి పార్టీ (ఎల్‌జేపీ)కి భారీ షాక్ తగిలింది. పాట్నా ఎల్‌జేపీ ఎంపీ మెహబూబ్ అలీ కైసర్ రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్‌జేడీ)లో చేరారు. ఈ సందర్భంగా ఆర్‌జేడీ ముఖ్యనేత తేజస్వీ యాదవ్ మాట్లాడుతూ పార్టీ అధ్యక్షుడు లాలూ ప్రసాద్ యాదవ్‌తో భేటీ తర్వాత మెహబూబ్ మాతో చేరుతున్నారు. అతడి రాజకీయ అనుభవం రాజ్యాంగాన్ని పరిరక్షించేందుకు మేం చేస్తున్న పోరాటానికి అనుకూలంగా అధికార పార్టీ ముప్పు నుంచి దీటుగా ఎదుర్కొనేందుకు ఉపయోగపడుతుందని అన్నారు. 2020లో ఎల్‌జేపీ అధినేత రామ్ విలాస్ పాశ్వాన్ మరణంతో ఆ పార్టీలో చీలిక ఏర్పడింది. పాశ్వాన్ సోదరుడు పసుపతి కుమార్ పరాస్ తనకు అండగా ఉన్న ఎంపీల సాయంతో సొంతంగా రాష్ట్రీయ లోక్‌జన శక్తి పార్టీని స్థాపించారు. ఆ సమయంలో పసుపతి పరాస్‌కు మొహబూబ్ అండగా నిలిచారు. అయితే ఈ సారి ఎన్నికల్లో చిరాగ్ పాశ్వాన్‌కు మద్దతు పలికారు. అయినప్పటికీ చిరాగ్ పాశ్వాన్ మొహబూబ్‌కు లోక్‌సభ సీటును తిరస్కరించారు. దీంతో తాజాగా మొహబూబ్ ఆర్జేడీ తీర్థం పుచ్చుకున్నారు.

## మోదీని ఆరాధించే మతం బీజేపీ: చిదంబరం

**చెన్నై:** సార్వత్రిక ఎన్నికల ప్రచార హోరు జోరుగా సాగుతోంది. జాతీయ పార్టీల కీలక నేతలు చురుగ్గా ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నారు. ఈ తరుణంలో కాంగ్రెస్ సీనియర్ నేత పీ చిదంబరం ఆదివారం బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. బీజేపీ... ఒక రాజకీయ పార్టీ కాదని, ఇప్పుడు అది ప్రధాని నరేంద్ర మోదీని ఆరాధించే మతంగా మారిందని అన్నారు. పదేళ్ల మోదీ పాలనలో వాక్ స్వాతంత్ర్యం, భావప్రకటనా స్వేచ్ఛ పూర్తిగా నశించాయి. ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించాలని ప్రజలు కోరుకుంటున్నట్లు చిదంబరం అన్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో వివాదాస్పద పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ) ప్రస్తావించనప్పటికీ ఇండియా కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత దానిని రద్దు చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. తమిళనాడులో 39 ఎంపీ స్థానాలను, పాండిచ్చేరిలోని ఒక సీటును ఇండియా కూటమి గెలుచుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. 14 రోజుల్లో బీజేపీ మేనిఫెస్టోను రూపొందించిందని, దానికి మేనిఫెస్టో అని పేరు పెట్టలేదని, దానిని 'మోదీ కి గ్యారెంటీ' అని పేర్కొన్నారు. భారతదేశంలో మతపరమైన ఆరాధన బలం పెరుగుతోందని, ఇది నియంతృత్వానికి దారి తీస్తుందని చిదంబరం అన్నారు. దేశం ఎదుర్కొంటున్న అతిపెద్ద సవాలు నిరుద్యోగమని ఆయన అన్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఉద్యోగాల కల్పన, సంపద సృష్టి గురించి పేర్కొన్నట్లు ఆయన వెల్లడించారు.

## కర్నాటకలో చెలరేగిన 'ఖాళీ చెంబు' రాజకీయం!

**బెంగళూరు:** కర్నాటకలో లోక్‌సభ ఎన్నికల వేళ అధికార కాంగ్రెస్, బీజేపీ మధ్య 'ఖాళీ చెంబు' రాజకీయం చెలరేగింది. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కర్నాటకకు ఏమీ ఇవ్వలేదని, కేవలం ఖాళీ చెంబు చేతిలో పెట్టినట్లు కాంగ్రెస్ ఓ యాడ్‌ను ప్రచురించింది. దీంతో ఈ యాడ్ సోషల్ మీడియాలో ఇరు పార్టీల మధ్య విమర్శల యుద్ధానికి తెరలేపింది. ప్రధాన మంత్రి నరేంద్రమోది, జేడీఎస్ చీఫ్ దేవెగౌడ ఓ సభలో కూర్చోగా... దేవెగౌడ చేతిలో ఓ పత్రిక మొదటి పేజీలో కాంగ్రెస్ ఇచ్చిన 'ఖాళీ చెంబు' యాడ్ ఎడిట్ చేసి ఉన్న ఫొటోను సీఎం సిద్ధరామయ్య తన 'ఎక్స్' ఖాతాలో పోస్ట్ చేసి... 'దేవెగౌడ ఆర్ట్‌ను ఆర్టిస్టుకు చూపుతున్నారు' అని క్యాప్షన్ పెట్టారు. దీంతో వెంటనే స్పందించి బీజేపీ కాంగ్రెస్‌కు కౌంటర్ వేసింది. 2013లో సిద్ధరామయ్య చెంబు పట్టుకున్నట్లు, 2023లో ఆయన చేతిలో చెంబు లేనట్లు ఉన్న ఒక ఎడిటెడ్ ఫొటోను తమ పార్టీ ఖాతాలో బీజేపీ పోస్ట్ చేసింది. 'తేడా స్పష్టంగా కనిపిస్తోంది' అని క్యాప్షన్ పెట్టింది. కాంగ్రెస్ పార్టీ ఎంపీ, పార్టీ జనరల్ సెక్రటరీ రణదీప్ సూర్జేవాల్ శనివారం ఖాళీ చెంబుతో నిరసన తెలిపిన ఫొటోలను ఎక్స్‌లో పోస్ట్ చేశారు. కర్నాటక ప్రజలు, రాష్ట్ర డిమాండ్లను బీజేపీ నిర్లక్ష్యం చేసిందని మండిపడ్డారు. నిరసన సమయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. 'కర్నాటక ప్రజల డిమాండ్, వారి హక్కు, రాష్ట్రం ప్రభుత్వం టాక్సుల రూపంలో రూ.100 ఇస్తే కేంద్రం కేవలం రూ.13 తిరిగి పంపింది. మేము మా టాక్సులు తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేస్తే మోదీ మాకు ఖాళీ చెంబు ఇచ్చారు. కర్నాటక పేదలు, రైతుల కోసం కరువు నిధులు ఇవ్వాలని కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్రానికి విజ్ఞప్తి చేస్తే మోదీ ఖాళీ చెంబు చేతిలో పెట్టారు'అని సూర్జేవాలా విమర్శించారు.

## గాడిద పాలతో నెలకు రూ.3 లక్షలు

### ఓ గుజరాతీ యువకుడి విజయగాథ

**అహ్మదాబాద్:** గాడిద పాలతో లక్షలు సంపాదిస్తున్నాడు ఓ గుజరాతీ యువకుడు. అతని పేరు ధీరేణ్ సోలంకి. అతని విజయగాథ యువతరానికి ప్రేరణగా నిలుస్తోంది. గాడిదల పెంపకంతో ధీరేణ్ నెలకు రూ.లక్షల్లో సంపాదిస్తున్నాడు. ధీరేణ్ చాలాకాలం పాటు ప్రభుత్వ ఉద్యోగం కోసం ఎదురుచూశాడు. ఫలితం లేక కొన్ని ప్రైవేట్ సంస్థల్లో పని చేశాడు. ఆర్థికంగా పెద్దగా సంతృప్తి చెందలేదు. ఈ క్రమంలో కొత్త ఉపాధి మార్గాలు అన్వేషించాడు. దక్షిణ భారత్‌లో గాడిదల పెంపకానికి క్రమంగా ఆదరణ పెరుగుతోందని తెలుసుకున్నాడు. కొంత మందిని కలిసి సమాచారం సేకరించాడు. అనుకున్నదే తడవుగా ఎనిమిది నెలల క్రితం 20 గాడిదలతో సొంత ఊర్లోనే ఫామ్‌ను ప్రారంభించాడు. రూ.22 లక్షలు పెట్టుబడిగా పెట్టాడు. ఇప్పుడు అవి 42 గాడిదలయ్యాయి. వాటి నుంచి వచ్చే పాలను దక్షిణ భారత్‌లోని వినియోగదారులకు సరఫరా చేస్తున్నాడు. నెలకు రూ.2-3 లక్షలు సంపాదిస్తున్నానని స్వయంగా ధీరేణ్ చెప్పాడు. 'తొలినాళ్లలో కాస్త కష్టంగానే అనిపించింది. గుజరాత్‌లో గాడిద పాలకు పెద్దగా గిరాకీ లేదు. దీంతో తొలి ఐదు నెలలు ఆదాయమేమీ రాలేదు. క్రమంగా దక్షిణ భారత్‌లోని కస్టమర్లను సంప్రదించా. అక్కడ డిమాండ్ బాగా ఉంది. ఇప్పుడు కర్నాటక, కేరళకు ఈ పాలు సరఫరా చేస్తున్నాను. సౌందర్య ఉత్పత్తుల తయారీ కంపెనీలు వీటిని కొనుగోలు చేస్తున్నాయి' అని సోలంకీ వివరించాడు. గాడిద పాలు ఒక లీటర్ ధర రూ.5,000-7,000 వరకు ఉన్నట్లు సోలంకీ తెలిపాడు. "తాజాగా ఉండడం కోసం పాలను ఫ్రీజర్లలో నిల్వ చేస్తున్నాం. వీటిని పొడిగానూ మార్చి విక్రయిస్తున్నాం. ఆన్‌లైన్‌లోనూ ఆర్డర్లు తీసుకొని సరఫరా చేస్తున్నాం. ఇప్పటి వరకు రూ..38 లక్షల వరకు ఖర్చయింది. ప్రభుత్వం నుంచి ఎలాంటి సహకారం తీసుకోలేదు. కానీ, సర్కార్ ఈ రంగంపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది" అని సూచించాడు. ఇన్ఫెక్షన్లు, కోరింత దగ్గు, వైరల్ జ్వరాలు, ఆస్తమాకీ గాడిదపాలను ఔషధంగా వాడుతుంటారు. ఈ పాలల్లో ఎ, బి, బి1, బి12, సి, డి, ఇ విటమిన్లు సమృద్ధిగా ఉంటాయని వైద్యులు చెప్పారు. కొవ్వు తక్కువ. నిద్రలేమి, ఎసిడిటీలతోపాటు ఎగ్జిమా, సిఫిలిస్, స్కేబిస్, దురద, తామర... వంటి ఇన్ఫెక్షన్లకి గాడిద పాలు మంచి ఔషధమని చెబుతారు. ఆ పాలతో ఫెయిర్‌నెస్ క్రీమ్, షాంపూ, లిప్‌బామ్, బాడీవాష్.. వంటి కాస్మొటిక్స్ తయారు చేస్తుంటారు.

# ఈసీకి ఫిర్యాదుల వెల్లువ

- పోటాపోటీగా విషప్రచారాలు
- రాజకీయ వాతావరణం కలుషితం
- జగన్, చంద్రబాబుకు నోటీసులు



విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:
ఎన్నికల బహిరంగ సభల వేదికగా ఎన్డీఏ కూటమి పార్టీలు, వైసీపీ పరస్పరం దూషణలకు దిగుతున్నాయి. రాజకీయ వాతావరణాన్ని కలుషితం చేస్తున్నాయి. అంతటితో ఆగకుండా... పరస్పరం ఈసీకి ఫిర్యాదులు చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ ఎన్నికల సంఘానికి వివిధ రాజకీయ పార్టీల నుంచి పోటాపోటీగా ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. ఎన్నికల నోటిఫికేషన్ రాకముందు నుంచే ఓట్ల చేర్పులపై అధికార, ప్రతిపక్ష పార్టీలు పరస్పరం ఫిర్యాదులు ప్రారంభించాయి. అప్పటి నుంచి మొదలైన ఫిర్యాదుల పరంపర ఎన్నికల నాటికి ఊపందుకున్నాయి. ఇప్పటివరకు రాష్ట్ర ఎన్నికల సంఘానికి అధికార వైసీపీపై ఎన్డీఏ కూటమి పార్టీలైన టీడీపీ, బీజేపీ, జనసేన దాదాపు 200 ఫిర్యాదులు చేశాయి. ఎన్డీఏ కూటమిపై 150కిపైగా ఈసీకి వైసీపీ ఫిర్యాదుల చేసింది. రాబోయే రోజుల్లో ఇవి మరింత పెరగనున్నాయి. ఈ ఫిర్యాదుల కోసం ఆయా పార్టీల నుంచి ప్రత్యేక నేతలతో కూడిన బృందాలను ఏర్పాటు చేశారు. వైసీపీ నుంచి ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, ఎమ్మెల్యే మల్లాది విష్ణు, మాజీ మంత్రి రావెల కిశోర్‌బాబు, నారాయణమూర్తి ఉంటున్నారు. టీడీపీ తరపున వర్ల రామయ్యతోపాటు మరికొందరు టీడీపీ నేతలు ఈసీకి వెళ్లి తగిన ఆధారాలు, వీడియో క్లిప్పింగ్‌లతో ఫిర్యాదులు చేస్తున్నారు. వాటితోపాటు ఫోరమ్ ఫర్ సిటిజన్ అనే సంస్థ నుంచి నిమ్మగడ్డ రమేశ్‌కుమార్ కేంద్ర, రాష్ట్ర ఎన్నికల సంఘాలకు వైసీపీపై ఫిర్యాదు చేశారు. ఇందులో ప్రధానంగా వలంటీర్లతో సంక్షేమ పథకాలను నిలిపివేయాలని, ఓటర్ల జాబితాలో అవకతవకలు అనే అంశాలున్నాయి. ఆయన ఫిర్యాదుతో వలంటీర్లను ప్రజా సంక్షేమ పథకాలకు దూరంగా ఉండాలని ఈసీ ఆదేశించింది. ఎన్డీఏ కూటమి చేసిన ఫిర్యాదులతో చాలా మార్పులు చోటు చేసుకున్నాయి. కీలకమైన జిల్లాల్లో ఐఏఎస్, ఐపీఎస్‌లను ఈసీ బదిలీ చేసింది. కొన్ని స్థానాల్లో పోలీసు అధికారులనూ మార్చారు. డీజీపీని, సీఎస్‌ను మారుస్తారన్న ప్రచారముంది. ఎన్నికల విధుల్లో పాల్గొంటున్నారన్న ఆరోపణలపై ఇటీవల ఏపీ సచివాలయ ఉద్యోగుల సంఘం నాయకులు వెంకటరెడ్డిపై ఈసీ వేటు వేసింది. భవిష్యత్‌లో మరికొందరు అధికారులపైనా ఇదే తరహాగా చర్యలు ఉండే అవకాశాలున్నాయి.

**సోషల్ మీడియా ద్వారా...**

ఎన్డీఏ కూటమికి చెందిన చంద్రబాబు, పవన్, పురందేశ్వరి వ్యాఖ్యలపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఈసీకి వైసీపీ ఫిర్యాదులు చేస్తోంది. సోషల్ మీడియా, యూట్యూబ్, ఫోన్ల ద్వారా జగన్‌పైన, వైసీపీ ప్రతిష్ఠతను దిగజార్చేలా పాటలు ప్రసారం చేస్తున్నారంటూ ఈసీకి తగిన ఆధారాలతో ఫిర్యాదులు చేశారు. ఇటీవల తాడికొండ టీడీపీ బహిరంగ సభలో జగన్‌ను, రాళ్లతో కొట్టాలంటూ చంద్రబాబు చేసిన వ్యాఖ్యలు ఎన్నికల ప్రవర్తనా నియమావళికి వస్తాయంటూ ఈసీకి వైసీపీ ఫిర్యాదు చేసింది. జగన్‌పై రాయిదాడి కేసులో లోకేశ్ ట్విట్టర్ వేదికగా అవహేళన చేస్తూ చేసిన పోస్టింగ్‌లపైనా ఈసీకి ఫిర్యాదులు అందాయి. సీఎంపై విజయవాడలో జరిగిన దాడిని డ్రామా, నటన అంటూ అవహేళనగా మార్ఫింగ్‌లతో తన అధికారిక సోషల్ మీడియాలోను, ట్విట్టర్లోను, టీడీపీ అఫీషియల్ వెబ్‌సైట్‌లోను అబద్దాలు, అసత్యాలు, దురుద్దేశపూరితంగా విషప్రచారానికి పాల్పడుతున్నవిషయాన్ని ఈనెల 14న వైసీపీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. ఇది ఎన్నికల నియమావళిని ఉల్లంఘించడమేనని దీనికి 48 గంటల్లోగా సమాధానం ఇవ్వాలని ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనా టీడీపీకి నోటీసులు జారీ చేశారు. టీడీపీ గుంటూరు రాష్ట్ర కార్యాలయంలో ఈనెల ఎనిమిదిన వర్ల రామయ్య సీఎం జగన్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడంపై ఈసీకి వైసీపీ ఫిర్యాదు చేసింది. దీంతో దీనిపై మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ను అనుసరించి తగిన చర్యలు తీసుకోవాలని గుంటూరు జిల్లా కలెక్టర్ వేణుగోపాలరెడ్డికి ఈసీ ఆదేశించింది. అటు వైసీపీపైన, జగన్‌పైన కూటమి పార్టీలు ఫిర్యాదు చేశాయి. మేమంతా సిద్ధం పేరుతో నిర్వహిస్తున్న సభల్లో చంద్రబాబు, పవన్‌పై చేస్తున్న అనుచిత వ్యాఖ్యలపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులు అందుతున్నాయి. వైసీపీ గుర్తులతో వివిధ చోట్ల టీ గ్లాజులు, ఎన్నికల సామాగ్రి నిర్వహణపైనా ఫిర్యాదులు అందాయి. కాంగ్రెస్ అధినేత షర్మిలపైనా వైసీపీ ఫిర్యాదు చేసింది. వివేకా హత్య కేసుపై మాట్లాడకూడదంటూ ఇటీవల కడప కోర్టు ఆదేశించగా, దానికి విరుద్ధంగా ప్రచారంలో షర్మిల మాట్లాడారు. దీంతో షర్మిలపై కడప ఎంపీ అవినాశ్‌రెడ్డి, ఎమ్మెల్యే మల్లాది ఫిర్యాదుచేయగా, 24 గంటల్లోగా వివరణ ఇవ్వాలని షర్మిలకు ఈసీ నోటీసులు ఇచ్చింది. మొత్తంగా జగన్, చంద్రబాబుకు ఈసీ నోటీసులు జారీ చేసింది. ఎన్నికల ప్రచార ముగింపునకు దాదాపు 20 రోజుల వ్యవధి మాత్రమే ఉంది. ఇప్పటికైనా ఎన్డీఏ కూటమి పార్టీలు, వైసీపీ ఈ తరహా పోకడల్ని విడనాడి, నిర్మాణాత్మకమైన విమర్శలతో ముందుకు వెళ్లాల్సిన అవసరముంది.

## నేడు రామచంద్రయ్య నామినేషన్

విశాలాంధ్ర-పత్తికొండ:
ఇండియా కూటమి బలపరుస్తున్న కర్నూలు జిల్లా పత్తికొండ నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థిగా సీపీఐకి చెందిన పి.రామచంద్రయ్య సోమవారం నామినేషన్ దాఖలు చేస్తున్నట్లు ఆ పార్టీ మండల కార్యదర్శి డి.రాజా సాహెబ్, పట్టణ కార్యదర్శి రామాంజనేయులు తెలిపారు. ఉదయం 10 గంటలకు ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్ నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు భారీ ర్యాలీ జరుగుతుందన్నారు. వామపక్ష, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, సానుభూతిపరులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

**పత్తికొండకు నారాయణ రాక...**

సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ సోమవారం పత్తికొండకు వస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి బి. గిడ్డయ్య తెలిపారు. పత్తికొండ అసెంబ్లీ అభ్యర్థి పి. రామచంద్రయ్య నామినేషన్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన విచ్చేస్తున్నట్టు చెప్పారు. కాంగ్రెస్ కర్నూలు ఎంపీ అభ్యర్థి రాంపుల్లయ్య యాదవ్ హాజరవుతారని తెలిపారు.

## 'ఇండియా' గెలుపుతోనే గుంటూరు జిల్లా అభివృద్ధి

### సీపీఐ ఎంపీ అభ్యర్థి జంగాల అజయ్‌కుమార్

విశాలాంధ్ర-గుంటూరు:
ఇండియా కూటమి అభ్యర్థుల గెలుపుతోనే గుంటూరు జిల్లా అభివృద్ధి సాధ్యమని సీపీఐ గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి జంగాల అజయ్‌కుమార్ పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం రాత్రి ఆయన ఏటీ అగ్రహారంలోని సీపీఐ కాలనీలో పర్యటించారు. కాలనీలో ప్రతి ఒక్కరినీ పలకరిస్తూ... ఇండియా కూటమికి మద్దతునివ్వాల్సిందిగా కోరారు. 2024 ఎన్నికలు దేశానికి ఎంత కీలకమో వారికి వివరించారు. మరలా మోదీ అధికారంలోకి వస్తే జరిగే పరిణామాలను వివరించారు. మే 13న జరిగే సార్వత్రిక ఎన్నికలు దేశ భవిష్యత్తును సూచించే ఎన్నికలని, ప్రతి ఓటరు ఆలోచించి తమ ఓటు హక్కును వినియోగించాలని కోరారు. దేశంలో మార్పు వచ్చిందని, మోదీ హఠావో... దేశ్‌కో బచావో... నినాదం మారుమోగుతోందన్నారు. దేశ ప్రజలు రెండు పూటలా తినాలన్నా... పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు తగ్గాలన్నా... దేశ సందపను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టే విధానాలను స్వస్తి పలకాలన్నా కేంద్రంలో ఇండియా కూటమి ప్రభుత్వం ఏర్పడాలన్నారు. మోదీ తొత్తులుగా ఉన్న రాష్ట్రంలోని చంద్రబాబు, జగన్‌లను చిత్తుగా ఓడించాలని జంగాల పిలుపునిచ్చారు. రానున్న పార్లమెంట్ ఎన్నికలలో కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం, ఆమ్ ఆద్మీ పార్టీలు బలపరచిన తనను కంకి కొడవలిపై ఓట్లు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించారు.

**'జంగాల'ను గెలిపించుకుందాం: కోట మాల్యాద్రి**

ఇండియా కూటమి బలపరచిన గుంటూరు పార్లమెంట్ సీపీఐ అభ్యర్థి జంగాల అజయ్‌కుమార్‌ను గెలిపించుకుందామని సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి పిలుపునిచ్చారు. మోదీ అధికారంలోకి వచ్చిన తరువాత ఒకవైపు మతోన్మాదాన్ని రెచ్చగొడుతూ.... మరొవైపు ధరల భారాలను ప్రజలపై వేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో సీపీఐ అభ్యర్థి విజయం అవశ్యమని అన్నారు. సీపీఐ గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి జంగాల అజయ్‌కుమార్ గుర్తు కంకి కొడవలి గుర్తుపై, కాంగ్రెస్ గుంటూరు తూర్పు అసెంబ్లీ అభ్యర్థి మస్తాన్‌వలి గుర్తు హస్తంపై ఓట్లు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మేడా హనుమంత రావు, ఇప్టా జాతీయ కార్యదర్శి గని, సీపీఐ నగర కార్యవర్గ సభ్యులు రావుల అంజిబాబు, మంగా శ్రీనివాస్, డివిజన్ కార్యదర్శి రెడ్డయ్య, ఇన్సాఫ్ నాయకులు షేక్ అమీర్ వలి, సీపీఐ నగర సమితి సభ్యులు నూతలపాటి చిన్న, జగన్నాధం, యోగయ్య తదితరులు పాల్గొన్నారు.

## రాహుల్‌కు అస్వస్థత...ఇండియా సభకు దూరం

న్యూఢిల్లీ:
మధ్యప్రదేశ్, జార్ఖండ్ రాష్ట్రాల్లో జరిగే ఎన్నికల ప్రచార సభలకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ హాజరుకావడంలేదని ఆ పార్టీ సీనియర్ నేత జైరామ్ రమేశ్ తెలిపారు. రాహుల్‌గాంధీ ఆరోగ్యం సరిగా లేదని, అందుకే మధ్యప్రదేశ్, జార్ఖండ్ సభల్లో పాల్గొనడం లేదని ఆయన వెల్లడించారు. షెడ్యూల్ ప్రకారం రాహుల్‌గాంధీ ఆదివారం మధ్యప్రదేశ్‌లోని సాత్నా, జార్ఖండ్‌లోని రాంచిలో జరిగే ఇండియా కూటమి ఎన్నికల ప్రచార సభలకు హాజరుకావాల్సి ఉంది. అయితే ఆరోగ్యం బాగా లేకపోవడంతో ఆయన ఆ రెండు సభలకు రావడంలేదు. రాహుల్‌గాంధీకి బదులుగా కాంగ్రెస్ పార్టీ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సాత్నా, రాంచి సభల్లో పాల్గొంటారని జైరామ్ రమేశ్ తెలిపారు.

## మురళి గెలుపుతోనే తిరుపతి అభివృద్ధి

### సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యుడు హరినాథ్‌రెడ్డి

విశాలాంధ్ర-తిరుపతి:
తిరుపతి నగరం అభివృద్ధి చెందాలంటే...నిరంతరం ప్రజల కోసం పనిచేసే సీపీఐ అభ్యర్థి పి.మురళికి ఓటు వేసి గెలిపించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పి.హరినాథరెడ్డి పిలుపునిచ్చారు. ఇండియా కూటమి బలపర్చిన తిరుపతి అసెంబ్లీ నియోజకవర్గ సీపీఐ అభ్యర్థి పి.మురళి గెలుపును కాంక్షిస్తూ... ఆదివారం సీపీఐ, సీపీఎం నాయకులు, కార్యకర్తలు గొల్లవానిగుంట, కొరమేను గుంట ప్రాంతాలలో విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఉదయం 7 గంటల నుండి ప్రారంభమైన ప్రచారానికి అడుగుగడుగునా ప్రజలనుంచి మంచి స్పందన లభించింది. మహిళలు హారతులు పట్టి సీపీఐ అభ్యర్థిని మురళిని స్వాగతించారు. కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంచుతూ సీపీఐ అభ్యర్థికి ఎందుకు ఓటు వేయాలో వివరించారు. ఈ సందర్భంగా హరినాథరెడ్డి మాట్లాడుతూ తిరుపతి నగరం శరవేగంగా విస్తరిస్తోందని... అయితే పాలకుల నిర్లక్ష్యం వల్ల విస్తరించిన ప్రాంతాలలో కనీస సౌకర్యాలు కూడా లేవన్నారు. సరైన రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో వర్షాకాలంలో తిరుపతిలోని నీరంతా శివారు కాలనీల గుండా ప్రవహిస్తుందన్నారు. కాలనీల పేద ప్రజలు అనారోగ్య పాలవుతారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రణాళిక లేకుండా తిరుపతి నగరం విస్తరిస్తోందని, దీనిపై పాలకుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోందన్నారు. అధికారులు కూడా పట్టీ పట్టనట్టు వ్యవహరించడం శోచనీయమన్నారు. నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారానికి పనిచేస్తున్న మురళికి ఓటు వేసి గెలిపిస్తే ప్రణాళిక బద్ధంగా తిరుపతి నగరం అభివృద్ధికి రూపకల్పన చేస్తారని ఆయన పేర్కొన్నారు. మురికివాడల్లో సైడ్ కాలవల నిర్మాణం, సిమెంట్ రోడ్ల నిర్మాణం చేసుకోలేని స్థితిలో ఉన్నామన్నారు. గత 20 సంవత్సరాలుగా ఆటోనగర్ ప్రాంతాలలో ఇల్లు నిర్మించుకొని కాపురం ఉంటున్న వారందరికీ ఎంజాయ్‌మెంట్ సర్టిఫికెట్లు గానీ, పట్టాలు గాని ఇప్పించి కాలనీల అభివృద్ధి చేపడతామని చెప్పారు. పేద ప్రజానీకానికి ఇళ్ల స్థలాలు తిరుపతి పరిసర ప్రాంతాలలోనే ఇచ్చే విధంగా పోరాడుతామని, స్మార్ట్ సిటీ నిధులు అభివృద్ధికి ఉపయోగిస్తామని తెలిపారు. కంకి కొడవలి గుర్తుపై ఓటు వేసి సీపీఐ అభ్యర్థి మురళిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అభ్యర్థి మురళి, కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి మాగంటి గోపాల్ రెడ్డి, సీపీఐ నగర కార్యదర్శి ఎం.సుబ్రహ్మణ్యం, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎ.రామానాయుడు, కె.శివారెడ్డి, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్నం పెంచలయ్య, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ, సీపీఐ నగర కార్యదర్శి జల్లా విశ్వనాధ్, సీపీఎం నాయకులు వేణుగోపాల్, బుజ్జి, సీపీఐ నాయకులు ఎస్.శ్రీరాములు, బండి చలపతి, ఎస్.డి.రవి, కె.పద్మనాభ రెడ్డి, ఎం.రామకృష్ణ మంజుల, నాగరాజు, శివ, కేవై రాజా, బిల్డింగ్ రవి, ప్రమీల, ఓం ప్రకాష్, నవీన్ శ్రీనివాసులు, విజయమ్మ, ఆటో హమాలీ కార్మికులు, కాలనీ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## విశ్వనాథ్‌నాయక్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించండి

### ఓబులేసు పిలుపు

విశాలాంధ్ర బ్యూరో- కడప:
రాజంపేట అసెంబ్లీ సీపీఐ అభ్యర్థి బూక్యా విశ్వనాథ్‌నాయక్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి.ఓబులేసు పిలుపునిచ్చారు. విశ్వనాథ్ నాయక్ గెలుపును కాంక్షిస్తూ ఆదివారం సాయంత్రం రాయచోటి జిల్లా ఒంటిమిట్టలో జరిగిన రోడ్ షోలో ఓబులేసు మాట్లాడుతూ... కేంద్రంలో బీజేపీ పాలన వల్ల సామాన్యుల జీవితం దుర్భరంగా మారిందన్నారు. నిత్యావసర సరుకులు, గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు విపరీతంగా పెరిగిపోయాయన్నారు. ప్రధాని మోదీ ప్రతి సంవత్సరం నిరుద్యోగులకు రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి మొండి చేయి చూపార న్నారు. ప్రభుత్వ రంగ సంస్థలన్నిటిని ఆదానీ కంపెనీకి అమ్మివేసి కార్మికులను వీధుల పాల్జేశారని దుయ్యబట్టారు. రైతులను ఆత్మహత్యలను కాపాడుతామని చెప్పి... వారికి ఇవ్వాల్సిన సబ్సిడీలు రద్దుచేయడం, కనీస మద్దతు ధర ఇవ్వకపోవడంతో రైతులు ఆత్మహత్యలు రెట్టింపయ్యాయన్నారు. అంబానీ, అదాని కంపెనీలకి సేవ చేయడమే పరమావధిగా లక్షల కోట్ల ప్రజాధనాన్ని అప్పనంగా వారికి అప్పచెప్పారన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థను మోదీ, అమిత్ షాలు కుప్ప కూల్చారన్నారు. దేశానికి, రాష్ట్రానికి ద్రోహం చేసిన బీజేపీకి అంటకాగుతూ... టీడీపీ, జనసేన, వైసీపీలను చిత్తుగా ఓడించాలన్నారు. దేశ, రాష్ట్ర అభివృద్ధికి, ప్రజాస్వామ్య పరిరక్షణకు ఇండియా కూటమి అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఓబులేసు విజ్ఞప్తి చేశారు. మత సామరస్యం కాపాడుకోవాలన్నా.. మహిళలు, దళితులపై జరుగుతున్న అత్యాచారాలను అరికట్టాలన్నా... రాజ్యాంగాన్ని కాపాడుకోవాలన్నా.. ఎన్డీఏ కూటమిని ఓడించాల్సిందేనని ఆయన అన్నారు. సీపీఐ రాజంపేట అసెంబ్లీ అభ్యర్థి విశ్వనాథ నాయక్ మాట్లాడుతూ గాలేరు-నగిరి కాలువని పూర్తి చేయనందువల్ల ఒంటిమిట్ట ప్రాంతానికి తాగునీరు, సాగునీటికి ఇబ్బంది ఏర్పడి ప్రజలు అల్లాడుతున్నారన్నారు. రైతులకు గిట్టుబాటు ధర వచ్చే విధంగా అసెంబ్లీ వేదికగా రైతుల పక్షాన నిలబడతామన్నారు. మహిళలు, దళితులకు అండగా నిలుస్తామన్నారు. సీపీఐ అభ్యర్థిగా తనను అసెంబ్లీలో గెలిపిస్తే నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి ఇకృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి పీఎల్ నరసింహులు, సహాయ కార్యదర్శి పీ మహేష్, రాజంపేట నియోజకవర్గ కార్యదర్శి రామకృష్ణ దేవర, సహాయ కార్యదర్శి ఎమ్మెస్ రాయుడు, ఒంటిమిట్ట మండలం సీపీఐ కార్యదర్శి యానాదయ్య, సీపీఎం మండల కార్యదర్శి నరసయ్య, సీపీఐ నాయకులు నిజాముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీలో విలీనం ప్రశ్నేలేదు: కుమారస్వామి

బెంగళూరు:
బీజేపీలో జేడీఎస్ విలీనంపై వస్తున్న వార్తలపై ఎట్టకేలకు మాజీ ముఖ్య మంత్రి హెచ్‌డీ కుమారస్వామి స్పందించారు. అంతా సవ్యంగా సాగితే బీజేపీలో జేడీయూ విలీనమయ్యే ప్రశ్నే ఉత్పన్నం కాదని, ఇద్దరం కలిసి పని చేస్తామన్నారు. మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ 'మా పార్టీ వేరే పార్టీలో విలీనం చేసే ప్రశ్నే లేదు. నేను చెబుతున్నట్లుగా బీజేపీ మంచిగా వ్యవహరిస్తే... అంతా సవ్యంగా జరిగితే... జేడీఎస్ బీజేపీలో చేరే ప్రశ్నే లేదు. కలిసి పనిచేస్తాం. ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం. ఇంకా వంద మంది సిద్దరామయ్యలు తిరగబడినా మా పార్టీని ఏమీ చేయలేరని చెప్పాలనుకుం టున్నా' అని కుమారస్వామి అన్నారు. ప్రధాని మోదీ, దేవెగౌడ మధ్య సంబంధాలపై ఆయన స్పందిస్తూ... మోదీ జాతీయ రాజకీయాల్లోకి వచ్చిన సమయంలో దేవెగౌడ సైతం విమర్శించారని, అయినా మోదీ ప్రధాని అయ్యాక దేవెగౌడ సైతం ఆయనను కలిశారన్నారు. కాంగ్రెస్‌ను ఓడించే సత్తా తమ పార్టీకి ఉందని, తాను కాంగ్రెస్‌కు పూర్తిగా వ్యతిరేకినన్నారు. వారు మనతో ఎలా వ్యవహరిస్తారో, ముఖ్యమంత్రిగా తనతో ఎలా ప్రవర్తించారో చర్చిపోలేదని కుమారస్వామి అన్నారు. కాంగ్రెస్ పార్టీ పేరులో సెక్యులర్ అనే పదాన్ని తొలగించారని కుమారస్వామి విమర్శించారు. లౌకికవాదం అంటే ఏమిటో కాంగ్రెస్‌ని అడగాలనుకుంటున్నానన్నారు. లౌకిక వాదానికి, మతతత్వానికి అర్థం లేదని ఆయన అన్నారు.

## సుప్రీంలో రామ్‌దేవ్ బాబాకు ఎదురుదెబ్బ

న్యూఢిల్లీ:
సుప్రీంకోర్టులో యోగా గురువు రామ్‌దేవ్ బాబాకు ఎదురుదెబ్బ తగిలింది. రామ్‌దేవ్ బాబాకు చెందిన పతంజలి యోగ్ పీఠ్ ట్రస్ట్ రూ.4.5 కోట్లు చెల్లించాల్సిందేనని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. జస్టిస్ అభయ్ ఎస్ ఒకా, జస్టిస్ ఉజ్జల్ భుయాన్ నేతృత్వంలోని ధర్మాసనం అలహాబాద్ కస్టమ్స్ ఎక్సైజ్ సర్వీస్ టాక్స్ అప్పిలేట్ ట్రిబ్యునల్ ఇచ్చిన ఉత్తర్వులను సమర్థించింది. రామ్‌దేవ్ బాబాకు చెందిన యోగ్ పీఠ్ ద్వారా యోగా క్యాంపులు నిర్వహిస్తుంటారు. యోగా క్యాంపులకు వచ్చే వారి నుంచి డబ్బులు వసూలు చేస్తారు. దీనికి సంబంధించి మీరట్‌కు చెందిన కస్టమ్స్, సెంట్రల్ ఎక్సైజ్ కమిషనర్ ఉత్తర్వులు ఇచ్చారు. దానిని రామ్‌దేబ్ బాబా అలహాబాద్ కస్టమ్స్ ఎక్సైజ్ సర్వీస్ టాక్స్ అప్పిలేట్ ట్రిబ్యునల్‌లో సవాల్ చేశారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2024-26, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.

# సమరాంగణం 2024

# ఎల్డీఎఫ్‌కు అనుకూలం

## కేరళలోని 20 స్థానాల్లో గెలుపుకు అవకాశం

- డీలా పడ్డ యూడీఎఫ్
- ఉనికి చాటుకునే ప్రయత్నాల్లో బీజేపీ

**కేరళలో ఎల్డీఎఫ్ అనుకూల పవనాలు బలంగా వీస్తున్నాయి. తాజా సార్వత్రిక ఎన్నికల్లో ప్రభంజనం దిశగా ఎల్డీఎఫ్ దూసుకెళుతోంది. గత ఎన్నికల్లో జరిగిన నష్టాన్ని పూరించుకోవడమే కాకుండా అఖండ మెజారిటీ సాధించి పార్లమెంటుకు ఎన్నిక కావాలని అభ్యర్థులు కంకణం కట్టుకున్నారు. ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. 2019లో ఘన విజయం నమోదు చేసిన యూడీఎఫ్ ఈసారి డీలా పడినట్లు కనిపిస్తోంది. మరోవైపు బీజేపీ తన ఉనికిని చాటుకునే ప్రయత్నాలు చేస్తోంది. ఒకట్రెండు స్థానాల్లో కాస్త ఆదరణ లభించడంతో ఎల్డీఎఫ్, యూడీఎఫ్‌కు గట్టి పోటీ ఇవ్వాలని భావిస్తోంది. కాగా, కేరళ నుంచి లోక్‌సభలో 20 స్థానాలకు ఎల్డీఎఫ్ ప్రాతినిధ్యం వహించే పరిస్థితులు కనిపిస్తున్నాయి. వామపక్ష కూటమికి ప్రజాదరణ ఉండటాన్ని సర్వేలు సూచిస్తున్నాయి. కేరళలో ఈనెల 26న పోలింగ్ జరగబోతోంది. ఈసారి తమ స్థానాలన్నింటిని తిరిగి దక్కించుకోవాలని ఎల్డీఎఫ్ నడుం బిగించింది. హేమాహేమీలను రంగంలోకి దించింది.**

ఈసారి పతిష్ఠాత్మకంగా భావించే స్థానాల్లో వడకర ఉంది. 2019లో సీపీఎం అభ్యర్థి పి.జయరాజన్‌పై 80వేల ఓట్ల తేడాతో కాంగ్రెస్ అభ్యర్థి కె.మురళీధరన్ విజయం సాధించారు. బీజేపీ అభ్యర్థికి 80,128 ఓట్లు వచ్చాయి. 2019 తర్వాత నియోజకవర్గ రాజకీయాలు మారాయి. ఈ స్థానాన్ని కాంగ్రెస్ నుంచి కైవసం చేసుకునేందుకు సీపీఎం సంకల్పించింది. రాష్ట్ర ఆరోగ్యశాఖ మాజీ మంత్రి కేకే శైలజను పోటీలో నిలబెట్టింది. పలక్కాడ్ నుంచి ఈస్థానానికి బదిలీ అయిన కాంగ్రెస్ అభ్యర్థి షఫీ పార్తంబిల్ గట్టి పోటీ ఇస్తారని మొదట్లో భావించారు కానీ రాష్ట్ర ఆరోగ్య మంత్రిగా సత్తా చాటిన కేకే శైలజ బరిలో నిలవడంతో ఆయన ప్రభ మరుగునపడింది. కేకే శైలజకు కోవిడ్ కాలంలో అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. ఆమెకున్న ప్రజాదరణ దృష్ట్యా కాంగ్రెస్ అనుచిత ప్రచారానికి తెరతీయగా... ఎన్నికల సంఘానికి శైలజ ఫిర్యాదు చేశారు. విపక్ష ఎమ్మెల్యేలు ఉమా థామస్ (కాంగ్రెస్), కేకే రీమా (రివల్యూషనరీ మార్క్సిస్ట్ పార్టీ (ఆర్‌ఎంపీ)) కూడా సైబర్ దాడిని ఆక్షేపించారు. శైలజకు గెలుపు అవకాశాలు మెండుగా ఉండటంతో ఇటు కాంగ్రెస్ అటు బీజేపీ వెన్నులో వణుకు మొదలైంది. శైలజ ఎంత మెజారిటీలో గెలుస్తారన్నది ప్రస్తుతం ఆసక్తికరంగా మారింది. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో అత్యధిక మెజారిటీ సాధించిన ఆమె మళ్లీ అఖండ మెజారిటీ సాధిస్తారని రాజకీయ పరిశీలకులు అన్నారు.

ఇక అలాతూర్ స్థానం విషయానికి వస్తే ఇది వామపక్ష కంచుకోట. 2019 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి రమ్య హరిదాస్ చేతిలో సీపీఎం అభ్యర్థి పీకే బీజు ఓటమి పాలయ్యారు. 1,58వేల ఓట్లతో రమ్య గెలిచారు. ఆ ఎన్నికల్లో యూడీఎఫ్ ఘన విజయానికి శబరిమల వివాదంతో పాటు రాహుల్ ప్రధాని అవుతారన్న ప్రచారమే కారణం. ఈసారి అలాతూర్ నుంచి కె.రాధాకృష్ణన్‌ను సీపీఎం నిలబెట్టింది. రాధాకృష్ణన్ కళంకం లేని నాయకుడు. ఉత్తమ మంత్రుల్లో ఒకరు. ప్రచారంలోనూ దూసుకెళుతున్నారు. 2019లో భారీ మెజారిటీ సాధించిన రమ్య నియోజకవర్గ ప్రజలను తన పనితో మెప్పించలేకపోయారు. ఈ నియోజకవర్గం సమస్యల సుడిగుండంలో చిక్కుకొని ఉన్నది. ఎంపీగా రమ్య వైఫల్యాలను ఓటర్లు ఎత్తిచూపుతున్నారు. ఆమెకు ఓటేసే పరిస్థితి ఏమాత్రం లేదు. దీనికి తోడు పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ)తో పాటు అనేక అంశాల్లో ఎల్డీఎఫ్ కచ్చితమైన వైఖరితో ఉండటం కూడా రాష్ట్ర రాజకీయ ముఖచిత్రాన్ని మార్చివేసింది. రాష్ట్రంలో సీఏఏ అమలు కాబోదన్న విజయన్ ప్రభుత్వ హామీ మైనారిటీలు ముఖ్యంగా ముస్లింలకు ఎంతో భరోసానిచ్చింది.

పాలక్కాడ్ కూడా లెఫ్ట్ కంచుకోట కాగా 2019లో ఇది కాంగ్రెస్ వశమైంది. పలక్కాడ్ నుంచి ఎ.విజయరాఘవన్‌ను పోటీ చేస్తున్నారు. ఈయనకు పాలక్కాడ్‌లో అమితాదరణ ఉన్నది. 1989 ఎన్నికల్లో ఆయన ఈ స్థానానికి ప్రాతినిధ్యం వహించారు. గత మూడుసార్లు కాంగ్రెస్ తరఫున ఎన్నికైన ఆ పార్టీ సీనియర్ నేత వీఎస్ విజయరాఘవన్‌ను ఓడించారు. గతసారి సీపీఎం అభ్యర్థి ఎంబీ రాజేశ్ (రాష్ట్ర మంత్రి) 11వేల ఓట్లతో ఓడిపోయారు. ఈయనకు 3.876 లక్షల ఓట్లు వచ్చాయి. విజేతగా నిలిచిన వీకే శ్రీకందన్‌కు 3.99 లక్షల ఓట్లు పోలయ్యాయి. అయితే ఈసారి సీపీఎం గెలుపు అవకాశాలు పెరిగాయి. పాలక్కాడ్‌లో బీజేపీకి కాస్త గుర్తింపు ఉంది. 2019లో మెట్రోమన్ ఇ.శ్రీధరన్ బీజేపీ తరపున పోటీ చేశారు. ఈసారి బీజేపీ సీనియర్ నేత సి.కృష్ణకుమార్ పోటీలో ఉన్నారు. 2019లో కృష్ణకుమార్ 2.185 లక్షల ఓట్లు పొందారు. 1989లో 3.7శాతంగా ఉన్న ఓట్లవాటా 2019లో 21.44శాతానికి పెరిగింది. ఈసారి ఎల్డీఎఫ్, యూడీఎఫ్‌కు గట్టి పోటీ ఇవ్వగలమన్న దీమాలో బీజేపీ ఉంది. అయితే బీజేపీకి గెలుపు అవకాశాలు లేవు. ఇందుకు ప్రధానంగా రెండు కారణాలు ఉన్నాయి. మైనారిటీల వ్యతిరేక భావజాలం, దురుసు ప్రవర్తన... మణిపూర్‌లో క్రైస్తవులపై దురాగతాలు, హత్యాకాండ వారి కోపాన్ని మరింత పెంచింది. బీజేపీ ఎన్ని ప్రయత్నాలు చేసినప్పటికీ ఆ పార్టీకి ఓటు వేసేందుకు క్రైస్తవులు కనీసం ఆలోచించే పరిస్థితి లేదు. ఏదిఏమైనా ఈసారి పాలక్కాడ్ నుంచి కామ్రేడ్ విజయరాఘవన్ గెలుపు తథ్యమంటున్నారు.

అలప్పుజా నియోజకవర్గం కూడా ఎల్డీఎఫ్, యూడీఎఫ్‌కు ప్రాధాన్యతగల ప్రాంతం. గత ఎన్నికల్లో ఈ స్థానం నుంచి గెలిచిన ఏకైక సీపీఎం ఎంపీగా ఏఎం ఆరిఫ్ నిలిచారు. ఈ స్థానం నుంచి ఆరిఫ్ మరోమారు పోటీ చేస్తున్నారు. ఆయనకు ప్రత్యర్థిగా కాంగ్రెస్ నేత కేసీ వేణుగోపాల్ ఉన్నారు. రాహుల్ గాంధీకి సన్నిహితుడు, 2009, 2014లో నుంచి గెలిచిన ఆయనకు అలప్పుజా కొత్తేమీ కాదు. రాజస్థాన్ నుంచి నిష్క్రమించడం ఈయనకు మైనస్ పాయింట్‌గా మారింది. కేసీ వేణుగోపాల్ ప్రస్తుతం రాజస్థాన్ రాజ్యసభ ఎంపీగా ఉన్నారు. గతేడాది డిసెంబరులో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ స్థానాన్ని బీజేపీ దక్కించుకుంది. అలప్పుజా నుంచి వేణుగోపాల్ గెలిస్తే మాత్రం ఎగువసభ పదవిని వదులు కోవాల్సి ఉంటుంది. తద్వారా బీజేపీకి ప్రయోజనం కలుగుతుంది. ఇదే అంశాన్ని ప్రజల్లోకి తీసుకెళుతూ ఎల్డీఎఫ్ ప్రచారం చేస్తోంది. పార్లమెంటులో గళాన్ని వినిపించగలిగిన సత్తా తనకున్నదని, యూడీఎఫ్‌కు చెందిన 19 మంది ఎంపీలు బీజేపీకి వ్యతిరేకంగా నోరు మెదపలేదని... చాలా సందర్భాల్లో మౌనంగా ఉండిపోయారంటూ తన ప్రచారాన్ని ఆరిఫ్ సాగిస్తున్నారు. తనకు మరో అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. దీంతో అలప్పుజాలో హోరాహోరీ పోరు సాగబోతోంది.

ఇదిలావుంటే ఎన్నికైన ఎంపీలు తర్వాత బీజేపీలోకి వెళ్లరన్న నమ్మకం కేరళ ప్రజల్లో సన్నగిల్లడంతో యూడీఎఫ్ విశ్వసనీయతను కోల్పోయింది. వామపక్ష ఎంపీలు మాత్రమే కేరళ సమస్యలపై పార్లమెంటులో గళం వినిపిస్తారని కేరళ ప్రజలు నమ్ముతున్నారు. ఎల్డీఎఫ్ హామీలతో వారికి అభయం లభించింది. దీంతో రాష్ట్రంలో ఎల్డీఎఫ్‌కు విజయావకాశాలు పెరిగాయి. అందుకోసమే తమకు అనుకూల పవనాలు బలంగా వీస్తున్నాయని సీఎం విజయన్ దీమాగా చెప్పగలుగుతున్నారు.

# వయనాడ్‌లో సిద్ధాంతాల పోరు

## బీజేపీ లేని స్థానంలో రాహుల్ పోటీకి అర్థం లేదు : అనీరాజా

మండుటెండలను సైతం లెక్క చేయకుండా కేరళ, వయనాడ్‌లో సీపీఐ తరఫు ఎల్డీఎఫ్ అభ్యర్థి అనీరాజా ప్రచారాన్ని సాగిస్తున్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీతో పోటీలో నిలిచిన ఆమె తమ మధ్య జరిగేది సిద్ధాంతాల పోరాటమని చెప్పారు. మిత్రపక్షంపై పోటీ చేయాలన్నది కాంగ్రెస్ తీసుకున్న నిర్ణయమని తమ పార్టీ ఇండియా కూటమిలో ఉండటాన్ని ఉద్దేశించి అనీరాజా అన్నారు. బీజేపీ లేని స్థానంలో రాహుల్ పోటీ చేస్తుండటానికి అర్థం లేదని ఓ వార్తాసంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారు. వయనాడ్ ప్రజల నాడి తనకు తెలుసని చెప్పారు. వయనాడ్ ప్రజలకు తనపై నమ్మకం ఉందన్నారు. ఎన్నికల తర్వాత కూడా ఇక్కడే ఉంటారా అని ప్రజలు అడుగుతుండటాన్ని బట్టి వారు ఏం కోరుకుంటున్నారో అర్థమవుతోందని' అని అన్నారు. ప్రజాజీవితంలోకి అడుగు పెట్టినప్పుడు కన్నూర్, మలప్పురం, వయనాడ్, చుట్టుపక్కల ప్రాంతాల్లోనే ఎక్కువగా గడిపానని, స్థానికులకు సుపరిచితురాలినని అనీరాజా ఓ ప్రశ్నకు బదులిచ్చారు. రైతులకు పెద్ద సమస్యగా మారిన మనిషికి, జంతువులకు మధ్య ఘర్షణను ప్రత్యక్షంగా అనుభవించిన కుటుంబం నుంచి వచ్చిన తనకు నియోజకవర్గ సమస్యలు బాగా తెలుసన్నారు. వయనాడ్ నియోజకవర్గం ఏర్పాటైనప్పటి నుంచి జరిగిన మూడు ఎన్నికల్లోనూ కాంగ్రెస్ నేతృత్వ యూడీఎఫ్ గెలిచిందని గుర్తుచేశారు. కేంద్రంలో లేక రాష్ట్రంలో పార్టీ అధికారంలో లేకపోతే ఎంపీకి కొన్ని పరిమితులు ఉంటాయన్న రాహుల్ వ్యాఖ్యలను అనీరాజా కొట్టిపారేశారు. ఈ నియోజకవర్గం సమస్యలను ఎంపీ ఎన్నిసార్లు పార్లమెంటులో ప్రస్తావించారని ఆమె ప్రశ్నించారు. 'నీలంబూర్- నాన్‌జంగుడ్ రైల్వే లైన్ వంటి ప్రాజెక్టులు రాష్ట్రస్థాయిలో చేపట్టగలిగినవి కావు. మనిషికి-జంతువులకు మధ్య ఘర్షణలు కూడా అంతే. దీర్ఘకాలిక పరిష్కారాల కోసం చట్టాలు సవరణలు పార్లమెంటులోనే జరగాలి. అధికారంలో లేదనే సాకుతో సమస్యలు పరిష్కరించలేమనడం రాజకీయ దివాళాకోరుతనాన్ని సూచిస్తుంది' అని వ్యాఖ్యానించారు. వయనాడ్ నుంచి రాహుల్ పోటీ చేయాలన్నది కాంగ్రెస్ తీసుకున్న నిర్ణయమని, దీనికి వివరణ ఇవ్వడం కూడా ఆ పార్టీ పనేనన్నారు. తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాల్లో కాంగ్రెస్‌తో వామపక్షాలకు పొత్తు ఉన్నదని, సీపీఐ కూడా మిత్రపక్షమేనని అనీరాజా గుర్తుచేశారు. వయనాడ్ నుంచి పోటీ చేయడం ద్వారా రాహుల్ ఏం సందేశం ఇవ్వాలనుకుంటున్నారని ప్రశ్నించారు. జాతీయ స్థాయిలో లెఫ్ట్‌కు ఓట్లు తక్కువ కాబట్టి మిత్రపక్షాల ఎంపిక కష్టమవుతోందా అన్న ప్రశ్నకు 'అలాంటిదేమీ లేద'ని అన్నారు. ప్రచారంలో తమ పార్టీ జెండాలను కాంగ్రెస్ వినియోగించలేదని, లెఫ్ట్‌కు దాని సిద్ధాంతాలే బలమని అనీరాజా తెలిపారు.

# పెరిగిన మహిళా అభ్యర్థులు

## రెండవ దశలో 8.6శాతం మంది పోటీ

**సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా రెండవ దశకు రంగం సిద్ధమైంది. ఈనెల 26న 13 రాష్ట్రాలోని 89 స్థానాలకు పోలింగ్ జరగబోతోంది. ఈసారి పోటీ చేయబోయే మహిళా అభ్యర్థుల సంఖ్యలో స్వల్ప పెరుగుదల ఉన్నది. మొదటి దశలో 8.2శాతం మంది పోటీ చేయగా రెండవ దశలో 8.6శాతం మంది మహిళలు ఎన్నికల బరిలో నిలిచ్చారు. తొలిదశలో మొత్తం 21 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 102 నియోజకవర్గాల నుంచి 1,625 మంది పోటీ చేయగా వీరిలో మహిళా అభ్యర్థులు 134 మంది కాగా రెండవ దశలో 1,198 మంది అభ్యర్థులు ఉండగా వీరిలో 8.6 శాతంగా మహిళలు ఉన్నారు.**

### కేరళలో అధికం

కేరళ నుంచే ఎక్కువ మంది మహిళలు పోటీ చేస్తున్నారు. అక్కడి 20కుగాను 14 స్థానాల నుంచి 25 మంది బరిలో నిలిచారు. అలాగే, మహారాష్ట్రలో ఎనిమిది, కర్నాటకలోని 14కుగాను 11 స్థానాల్లోనూ 21 మంది చొప్పున మహిళలు పోటీ చేస్తున్నారు. ఉత్తరప్రదేశ్‌లోని ఎనిమిదికిగాను ఆరు స్థానాల నుంచి 10 మంది, రాజస్థాన్‌లోని 13కుగాను ఆరు స్థానాల నుంచి ఏడుగురు, మధ్యప్రదేశ్‌లోని ఆరు నియోజకవర్గాల నుంచి ఐదుగురు తమ అదృష్టాన్నీ పరీక్షించుకోనున్నారు. బెంగాల్‌లో మూడు స్థానాలు, బీహార్‌లో ఐదు, చత్తీస్‌గఢ్‌లోని మూడు నియోజకవర్గాల్లో ముగ్గురు చొప్పున మహిళలు పోటీ చేస్తున్నారు. అసోం, త్రిపురలో ఇద్దరు చొప్పున, జమ్మూకశ్మీర్‌లోని జమ్మూ పార్లమెంటు స్థానం నుంచి ఒకరు పోటీ చేస్తున్నారు. పార్టీల వారీగా చేస్తే... బీజేపీ నుంచి పది మంది, కాంగ్రెస్ నుంచి ఐదుగురు, బీఎస్పీ నుంచి ఆరుగురు, సీపీఐ, సీపీఎం, ఎస్పీ, శివసేన, ఆర్జేడీ నుంచి ఇద్దరు చొప్పున, ఎల్‌జేపీ నుంచి ఒకరు పోటీ చేస్తున్నారు. అదే నియోజకవర్గాల వారీగా చూసినట్లయితే కర్నాటకలోని బెంగళూరు నార్త్, మహారాష్ట్రలోని అమరావతి (ఎస్సీ) నుంచి ఆరుగురు పోటీ చేస్తున్నారు. కేరళలోని వడకర, మహారాష్ట్రలోని నాందేడ్ నుంచి చెరో నలుగురు; బెంగళూరు సౌత్, కాసర్‌గాడ్, బాగ్‌పట్, మధుర నుంచి ముగ్గురు చొప్పున మహిళలు తమ అదృష్టాన్నీ పరీక్షించుకోనున్నారు.

# బీజేపీకి ఓటు వేయొద్దు

## గుజరాత్‌లో రాజ్‌పుత్‌ల పిలుపు

### కమల దళానికి వ్యతిరేకంగా నిరసన దీక్షలు

భారతీయ జనతా పార్టీ (బీజేపీ)కి కంచుకోటగా భావించే గుజరాత్ రాష్ట్రంలో వ్యతిరేక పవనాలు వీస్తున్నాయి. అక్కడి క్షత్రియ వర్గం కాషాయ పార్టీపై కోపంగా ఉన్నది. తాజా ఎన్నికల్లో కాషాయ పార్టీకి వ్యతిరేకంగా ఓటు వేసేందుకు సిద్ధమవుతోంది. పటన్, బనస్‌కాంతా, భరూచ్, సబర్‌కాంతా, సురేంద్రనగర్, రాజ్‌కోట్, భావ్‌నగర్, జామ్‌నగర్‌లో రాజ్‌పుత్ ఓటర్లు ఎక్కువగా ఉన్నారు. గ్రామీణ స్థాయిలోనూ రాజ్‌పుత్‌లను బీజేపీకి వ్యతిరేకంగా ఓటు వేసేలా ప్రణాళికాబద్ధంగా చర్యలను తీసుకుంటున్నట్లు క్షత్రియ వర్గ నాయకులు వెల్లడించారు. బీజేపీకి సవాల్ విసిరేందుకు వ్యూహాలు సిద్ధం చేసినట్లు క్షత్రియ నేత పీటీ జడేజా అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోనూ రాజ్‌పుట్‌లను చైతన్యపరిచే ప్రణాళికతో యువతను క్రియాశీలం చేశామన్నారు. అన్ని చోట్ల బీజేపీకి ఓటు వేయొద్దని పిలుపునిచ్చినట్లు తెలిపారు. ఎన్నికల ర్యాలీలు, ఆందోళనలప్పుడు అభ్యర్థులకు నల్ల జెండాలు చూపరాదన్న నిబంధన క్రమంలో కాషాయ జెండాలతో తమ యువత, మహిళలు నిరసన తెలుపుతున్నట్లు రాజ్‌పుత్‌సమన్వయ కమిటీ అధికార ప్రతినిధి కరణ్‌సిన్హ చావ్డా అన్నారు. మే 7న గుజరాత్‌లో పోలింగ్ జరగబోతోంది. ఆ రోజు వరకు రిలే నిరాహార దీక్షలను రాజ్‌పుత్‌మహిళలు కొనసాగిస్తారు. క్షత్రియ వర్గం తమ వ్యతిరేకతను వ్యక్తం చేస్తూ ధర్మ-రథ యాత్రలను నిర్వహిస్తున్నదని నాయకులు తెలిపారు. తమ వర్గాన్ని కించపర్చిన రాజ్‌కోట్ అభ్యర్థి పరుషోత్తం రూపాలాను తొలగించాలని, ఆయన అభ్యర్థిత్వాన్ని రద్దు చేయాలంటూ క్షత్రియులు పట్టుపట్టారు. ఆనంద్, వడోదరలోనూ సమావేశాలు నిర్వహిస్తూ తమ ఓటు బలాన్ని అంచనా వేసుకుంటున్నారు. బీజేపీకి వ్యతిరేకించేలా ప్రచారం చేస్తున్నారు. క్షత్రియ వర్గీయులు ఎక్కువగా ఉండే నర్మదా, ఛోటా ఉదేపూర్, భరూచ్‌లోని గ్రామాల్లో బీజేపీ నేతలకు ప్రవేశాన్ని నిరాకరిస్తూ బ్యానర్లను ఏర్పాటు చేశారు. తమ డిమాండ్ పరిష్కారం కానిపక్షంలో గాంధీనగర్‌లోని బీజేపీ కేంద్ర కార్యాలయం ఎదుట 'జౌహర్' (స్వీయదహనం) చేసుకుంటామని క్షత్రియ మహిళలు ఇంతకుముందే హెచ్చరించారు. మరోవైపు రాజ్‌పుత్‌ల నిరసనలను బేఖాతరు చేస్తూ రూపాలా తన నామినేషన్ వేశారు. ప్రచారాన్ని సాగిస్తున్నారు. బీజేపీ అధిష్ఠానం కూడా నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తుంది. అయితే ఇది అగ్నిలో ఆజ్యం పోసే పనేనని రాజకీయ పరిశీలకులు అంటున్నారు. కాగా, గుజరాత్‌లోని 26 లోక్‌సభ స్థానాలకు మే 7న ఎన్నికలు జరగనున్నాయి.

జూన్ 4న ఓట్లు లెక్కిస్తారు. రాష్ట్రంలో బీజేపీకి ఆధిపత్యం ఉన్నది. 2014, 2019 ఎన్నికల్లో అన్ని స్థానాల్లో ఆ పార్టీ గెలిచింది. ప్రస్తుతం క్షత్రియులు తిరుగుబాటు బావుటా ఎగుర వేయడంతో బీజేపీకి సవాల్ తప్పదన్న అభిప్రాయం రాజకీయ విశ్లేషకుల్లో ఉంది. ఒక వేళ రూపాలా తన నామినేషన్‌ను ఉపసంహరించుకుంటే శక్తిమంతమైన పాటిదార్ వర్గం కన్నెర్ర చేస్తుంది. సౌరాష్ట్రలో ఈ వర్గానికి మంచి పట్టు ఉన్నది. రూపాలా రాజ్‌కోట్ నుంచి పోటీ చేస్తున్న విషయం తెలిసిందే.

# సమరాంగణం 2024



# విశాఖ ఉత్తరంలో రాజుల పోరు

## గెలుపు కోసం కేకే రాజు, విష్ణుకుమార్ కసరత్తు

విశాఖ ఉత్తర శాసనసభా నియోజకవర్గంలో రాజకీయ పోరు ఇద్దరు రాజుల మధ్య రసవత్తరంగా మారింది. ఈ నియోజక వర్గంలో ఏ ఒక్కరూ రెండోసారి ఎమ్మెల్యేగా గెలుపొందిన చరిత్ర లేదు. ఉత్తర నియోజకవర్గం ఏర్పడిన తొలిసారి 2009లో కాంగ్రెస్ పార్టీ నుంచి తైనాల విజయ్ కుమార్ ఎమ్మెల్యేగా గెలుపొందారు. తర్వాత 2014లో బీజేపీ అభ్యర్థి విష్ణుకుమార్ రాజు ఎన్నికయ్యారు. 2019లో అనూహ్యంగా టీడీపీ అభ్యర్థి గంటా శ్రీనివాసరావు విజయం సాధించారు. 2024లో ఈ నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా మళ్లీ పోటీ చేయడానికి గంటా ఆసక్తి చూపకపోవడంతో ఎన్డీయే కూటమి తరపున బీజేపీకి కేటాయించారు. ఆ పార్టీ అభ్యర్థిగా పి విష్ణుకుమార్ రాజు మళ్లీ పోటీకి సిద్ధమయ్యారు. వైసీపీ అభ్యర్థిగా కేకే రాజు పోటీ చేస్తున్నారు. ఈ నియోజకవర్గంలో టీడీపీకి సరైన అభ్యర్థి లేకపోవడం కూడా వైసీపీకి మేలు చేకూరుతుందని కేకే రాజు వర్గీయులు భావిస్తున్నారు. విష్ణుకుమార్ రాజుకి జనసేన, టీడీపీ కార్యకర్తలు, నేతలు పూర్తిగా సహకరిస్తారా లేదా అన్నది ప్రశ్నగానే మిగిలిపోతుంది. పాలక వైసీపీ అభ్యర్థి కేకే రాజు తీవ్రంగానే శ్రమిస్తున్నారు. జై భారత్ పార్టీ నుంచి ఆ పార్టీ అధినేత ( సీబీఐ మాజీ జజేడీ ) వీవీ లక్ష్మీనారాయణ కూడా ఈ నియోజకవర్గం నుంచి పోటీచేస్తున్నారు. 2019లో ఆయన విశాఖ పార్లమెంట్ జనసేన అభ్యర్థిగా పోటీ చేసి పరాజయం పొందారు.

### దక్షిణంలో కోల్డ్ వార్

విశాఖ దక్షిణ శాసనసభా నియోజకవర్గం (ఓల్డ్ సిటీ)లో కోల్డ్ వార్ చోటు చేసుకుంటుంది. ఈ నియోజకవర్గ టీడీపీకి కంచుకోటగా ఉన్నప్పటికీ ప్రస్తుత ఎన్నికల్లో ఆ పార్టీ అభ్యర్థి పోటీ చేయడంలేదు. ఎన్డీఏ కూటమి పొత్తులో భాగంగా జనసేనకు ఈ నియోజకవర్గాన్ని కేటాయించారు. దానితో జనసేన తరపున వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్ అనూహ్యంగా టిక్కెట్ దక్కించుకొని పోటీ చేస్తున్నారు. వైసీపీ ఎమ్మెల్సీగా ఉన్న వంశీకృష్ణ శ్రీనివాస్ రెండు నెలల క్రితం అధికార వైసీపీని వదిలి జనసేనలో చేరారు. వంశీకృష్ణ గతంలో విశాఖ తూర్పు నియోజకవర్గంలో ప్రజారాజ్యం నుంచి ఒకసారి , వైసీపీ నుంచి ఒకసారి పోటీ చేసి ఓడిపోయారు. ఈసారి జనసేనలో చేరి నియోజకవర్గాన్ని కూడా మారిన వంశీకృష్ణ గెలుపు అంత సులువు కాదని కూటమి నేతలే చెపుతున్నారు. వైసీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న సిట్టింగ్ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ 2014, 2019లో టీడీపీ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. రెండేళ్ల క్రితం టీడీపీని వదిలి వైసీపీలో చేరిన వాసుపల్లి ఈసారి వైసీపీ నుంచి పోటీలోకి దిగారు.

ఈ నియోజకవర్గంలో వాసుపల్లి వైసీపీలో చేరినప్పటి నుంచి టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జిని నియమించారు. ఎన్నికల్లో టీడీపీ తరపున దక్షిణ నియోజకవర్గం నుంచి పోటీ చేయాలని బాబ్జి తీవ్రంగానే ప్రయత్నం చేసినప్పటికీ కూటమి సీట్ల సర్దుబాటులో భాగంగా వంశీకృష్ణ ఇలా వచ్చి అలా టికెట్ కొట్టేశారని గండి బాబ్జి తీవ్ర మనస్థాపానికి గురయ్యారు. టీడీపీ అధినేత చంద్రబాబు సర్ది చెప్పి ఆయనకు విశాఖ టీడీపీ అధ్యక్ష పదవి కట్టబెట్టారు. ఈ నియోజకవర్గంలో మత్స్యకారులు, ముస్లింలు, యాదవ సామాజిక వర్గాలకు చెందిన ఓటర్లు అధికంగా ఉన్నారు. వైసీపీలో దక్షిణం టిక్కెట్ ఆశించిన సీతం రాజు సుధాకర్ ఆ పార్టీకి రాజీనామా చేసి టీడీపీలో చేరారు.

### గాజువాక వైసీపీలో వర్గపోరు

గాజువాకలో టీడీపీ కూటమి తరపున గతంలో గాజువాక ఎమ్మెల్యేగా పనిచేసిన పల్లా శ్రీనివాసరావుకే మళ్లీ టికెట్ దక్కడంతో ఈ సారి కూడా పోటీలో ఉన్నారు. ఇక రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ మంత్రి గుడివాడ అమర్నాథ్ అనకాపల్లి నియోజకవర్గం నుంచి గాజువాకకు వచ్చి వైసీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. సిట్టింగ్ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డిని కాదని అమర్నాథ్ కు వైసీపీ టికెట్ కేటాయించింది. వైసీపీ లో తీవ్ర వర్గ పోరు కొనసాగుతోంది. ఈ నియోజకవర్గంలో ఇండియా కూటమి బలపరిచిన సీపీఎం అభ్యర్థిగా మరడాన జగ్గు నాయుడు పోటీ చేస్తున్నారు. ఈ నియోజకవర్గంలో సీపీఐ, సీపీఎంకు రెండు వార్డుల్లో కార్పొరేటర్లు ఉన్నారు. ఈ నియోజకవర్గంలో స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ అంశం తీవ్ర ప్రభావాన్ని చూపుతుంది. ప్రభుత్వ రంగ పరిశ్రమలు అత్యధికంగా ఉన్న ప్రాంతంగా ఈ నియోజకవర్గం ఉండడంతో ఉద్యోగులు, కార్మికులు, ప్రజా వ్యతిరేక విధానాల అవలంబిస్తున్న వైసీపీకి, పరిశ్రమలను ప్రైవేటీకరిస్తున్న బీజేపీ కూటమికి వ్యతిరేకంగా ఉన్నారు.

(విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం)

### తూర్పులో హోరాహోరి

విశాఖ తూర్పు శాసనసభా నియోజకవర్గంలో అభ్యర్థుల మధ్య పోటీ నువ్వా నేనా అన్న రీతిలో ఉత్కంఠ రేపుతుంది. టీడీపీ కూటమి నుంచి నాలుగోసారి పోటీలో ఉన్న సిట్టింగ్ ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబుకు పోటీగా వైసీపీ నుంచి ప్రముఖ రియల్ ఎస్టేట్ వ్యాపారి, బిల్డర్, ప్రస్తుత విశాఖ పార్లమెంట్ సభ్యుడిగా ఉన్న ఎంవీవీ సత్యనారాయణ నిలిచారు. విశాఖలో టీడీపీకి బలమైన నాయకుడిగా ఉన్న వెలగపూడిని ఓడించడం కోసమే వైసీపీ ఏరి కోరి ఎంపీగా ఉన్న సత్యనారాయణను తూర్పులో పోటీకి నిలిపింది. వీరిద్దరూ ఒకే సామాజిక వర్గానికి చెందినవారు కావడంతో విశాఖ తూర్పులో పోరు ఉత్కంఠగా మారింది. విశాఖ తూర్పు నియోజకవర్గంలో ఓటర్లను తీవ్రంగానే వైసీపీ ప్రలోభాలకు గురిచేస్తోందని ఇప్పటికే అనేక ఫిర్యాదులు ఎన్నికల అధికారులకు చేశారు. వైసీపీ నుంచి తూర్పులో టికెట్లు ఆశించిన వంశీకృష్ణ శ్రీనివాస్ జనసేనలో చేరి దక్షిణంలో పోటీ చేస్తున్నారు. వీఎంఆర్డీఏ మాజీ చైర్మన్ అక్రమాని విజయనిర్మల కూడా తూర్పులో వైసీపీ టికెట్ ఆశించారు. విశాఖ నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి కూడా టికెట్ ఆశించినప్పటికీ వీరెవరికి దక్కకపోవడంతో మేయర్ మినహా అక్రమానికి కూడా పార్టీ మారే ఆలోచనలో ఉన్నట్లు ప్రచారం సాగుతోంది.

### పెందుర్తిలో పోటాపోటీ

పెందుర్తి శాసనసభా నియోజకవర్గం ఉమ్మడి విశాఖలో పూర్తిగా ఉన్నప్పటికీ జిల్లాల విభజన నేపథ్యంలో కొంత భాగమే విశాఖలో ఉండగా, అధిక భాగం అనకాపల్లి జిల్లాలోని ఉంది. ఈ నియోజకవర్గంలో టీడీపీ నుంచి మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి టికెట్ ఆశించినప్పటికీ ఆయనకు దక్కకపోవడంతో కూటమి పొత్తులో భాగంగా జనసేన నుంచి మాజీ ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబుకు దక్కింది. రమేష్ బాబు గతంలో 2009 లో ప్రజారాజ్యం తరపున ఈ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఆయన కూడా వైసీపీలో విశాఖ జిల్లా అధ్యక్షులుగా పనిచేశారు. నాలుగు నెలల క్రితం జనసేనలో చేరిన పంచకర్ల పెందుర్తి టికెట్‌ను అనూహ్యంగా కొట్టేశారు. దీంతో తీవ్ర మనస్థాపానికి గురైన బండారు అలక బునారు. ఇటీవల టీడీపీ అధినేత చంద్రబాబు బండారును బు జ్జగించారు. ఆయనకు మాడుగల టికెట్‌ను కేటాయించారు. వైసీపీ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే అన్నపురెడ్డి అదీప్ రాజు కే టికెట్ దక్కడంతో ఆయన మరోసారి గెలుపు కోసం తీవ్రంగానే పోటీ పడుతున్నారు.

### వలస పక్షులు!

వలసవాదులొచ్చారు
వరాలు వొలికిస్తారు
కండువాలు మార్చేశారు
పోటీకి సై అంటున్నారు
హద్దులేమిటో తెలియకున్నా
హామీల జల్లు కురిపిస్తారు
అదిగో సింగపూరంటారు
వైకుంఠం చూపిస్తారు
విడిది పక్షులై వస్తారు
భాగ్యనగరిలో ఉంటారు
అధికారగూటికి చేరతారు
పాపపరిహారం పొందుతారు
గెలుపోటములు గేలిచేసినా
నల్ల కోట్లు కుమ్మరిస్తారు
అబద్ధాల అత్తరు రాస్తారు
ఓడిస్తే దుమ్మెత్తిపోస్తారు
పేపరు రాతలు జాన్దేవంటూ
పదవే మాకు ముద్దంటారు
పోటీబాబుల పోరున్నా
విజయం వన్‌సైడంటారు
ఓటర్లను ఏమారుస్తారు
శత్రువుపై గురిపెడతారు
అధికారం అడ్డుపెడతారు
ప్రతిపక్షాలను లొంగదీస్తారు
తాయిలాల ఆశ చూపుతారు
ఛీకొడితే జైల్లోకి నెడతారు
సినీ డైలాగులు సంధిస్తారు
ఆత్మానందం అనుభవిస్తారు
మంచికి మసిపూస్తారు
సత్యానికి సంకెళ్లేస్తారు
జెండా నీడన జైకొడతారు
పదవివ్వకుంటే జారుకుంటారు
కంకికొడవలికి ఆశీసులు
గెలుపుతీరాన కమ్యూనిస్టులు!

గోల్కొండ బాబూరావు

# రచ్చ గెలిచి ఇంట గెలవని నేత 'నీలం'



మాజీ రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డి జీవిత చరిత్ర చూస్తే రచ్చ గెలిచి ఇంట గెలవని నాయకుడిగా చెప్పుకోవచ్చు. రాష్ట్రపతిగా, కేంద్ర మంత్రిగా, లోక్‌సభ స్పీకర్‌గా, రాష్ట్ర మంత్రిగా అనేక హోదాల్లో పనిచేసిన ఆయన జిల్లాలో మాత్రం ఆశించిన మేరకు రాజకీయాల్లో రాణించలేకపోయారు. స్థానిక ప్రజా మద్దతు ఆయనకు అంతగా లభించలేదు. అనంతపురం జిల్లా గార్లదిన్నె మండలం ఇల్లూరు ఆయన స్వగ్రామం. విద్యార్థి దశ నుంచే రాజకీయ జీవితాన్ని ప్రారంభించారు. స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్నారు. 1946 ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో ఎమ్మెల్యేగా చేశారు. ఆ తర్వాత జరిగిన ఎన్నికల్లో అనంతపురం జిల్లా నుంచి మూడు సార్లు పోటీ చేశారు. అందులో రెండుసార్లు ఓడిపోయారు. ఒక్కసారి మాత్రమే విజయం సాధించారు. అది కూడా అనంతపురం నుంచి కాకుండా హిందూపురం పార్లమెంటు నుంచి ఎన్నికయ్యారు. 1952లో అనంతపురం అసెంబ్లీకి పోటీ చేసి కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) అభ్యర్థి తరిమెల నాగిరెడ్డి చేతిలో ఓడిపోయారు. 1967లో హిందూపురం పార్లమెంటు నియోజకవర్గం నుంచి పోటీ చేసి విజయం సాధించారు. అప్పుడు ఆయన లోక్‌సభ స్పీకరయ్యారు. 1971లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో అనంతపురం పార్లమెంటు నుంచి పోటీచేసి ఓడిపోయారు. 1977లో జనతాపార్టీ తరుపున నంద్యాల పార్లమెంటు నియోజకవర్గం నుంచి పోటీ చేసి గెలుపొందారు. మరోసారి లోక్‌సభ స్పీకరుగా ఎన్నికయ్యారు. అప్పటి నుంచి వరుసగా వచ్చిన మూడు దఫాల ఎన్నికల్లో ఆయన జిల్లాలో పోటీనే చేయలేదు. 1956లో సంజీవరెడ్డి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి తొలి ముఖ్యమంత్రి అయినప్పుడు కూడా జిల్లా నుంచి ఎంపిక కాలేదు. కర్నూలు జిల్లా డోన్ నుంచి ఒకసారి, చిత్తూరు జిల్లా శ్రీకాళహస్తి నుంచి ఒకసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. రెండుసార్లు కేంద్ర మంత్రిగా చేశారు. లాల్ బహదూర్ శాస్త్రి మంత్రి వర్గంలో ఉక్కు, గనుల శాఖ మంత్రిగా, ఇందిరాగాంధీ ప్రధానిగా ఉన్నప్పుడు రవాణా పౌరవిమానయానం, పర్యాటక శాఖ మంత్రిగా పనిచేశారు. 1969లో రాష్ట్రపతి పదవికి కాంగ్రెస్ పార్టీ తరుపున బరిలో దిగినప్పటికీ అప్పటి ప్రధాన మంత్రి ఇందిరాగాంధీ ఆత్మప్రభోద పిలుపు మేరకు స్వతంత్ర అభ్యర్థి వీవీ గిరి చేతిలో ఓడిపోయారు. దీంతో ఏడేళ్లపాటు రాజకీయాలకు దూరంగా ఉన్నారు. తిరిగి 1977లో రాష్ట్రపతికి పోటీ చేసి గెలుపొందారు. సంజీవరెడ్డి బహిరంగ సభలకు ప్రజలు తండోపతండాలుగా వచ్చేవారు. ఎన్నికల్లో మాత్రం ఆయన ప్రత్యర్థి వైపే మొగ్గుచూపేవారు. బహిరంగ సభలకు వచ్చిన వారందరూ ఓటేసినా గెలుపొందేవాడిని' అని ఆయన అనేక సందర్భాల్లో వ్యాఖ్యానించడం గమనార్హం.

విశాఖ పశ్చిమం

## అత్తిలి విమల




విశాఖ పశ్చిమ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి సీపీఐ అభ్యర్థిగా పోటీ చేస్తున్న అత్తిలి విమల ఆంధ్ర ప్రదేశ్ మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలిగా, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యురాలిగా, విశాఖ జిల్లా కార్యవర్గ సభ్యురాలుగా పనిచేస్తున్నారు. అత్తిలి విమల చదువుకునే రోజుల్లోనే సుమారు మూడు దశాబ్దాల క్రితం ఆంధ్ర ప్రదేశ్ ప్రజానాట్యమండలి ద్వారా భారత కమ్యూనిస్టు పార్టీ సభ్యత్వం పొందారు. చదువుకునే రోజుల్లో కబడ్డీ, కోకో, రన్నింగ్ తదితర క్రీడల్లో జాతీయస్థాయిలో ప్రతిభ కనబరిచారు. పార్టీ కార్యక్రమాల్లో భాగస్వామ్యం అవుతూ ప్రత్యేకంగా మహిళలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం కృషి చేశారు. ఈ క్రమంలో ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ఉమ్మడి విశాఖ జిల్లా కార్యదర్శిగా సుదీర్ఘకాలం సేవలందించారు. మహిళా సమాఖ్య విస్తరణకు కృషి చేసి మహిళలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యల పరిష్కారానికి అనేక పోరాటాలు నిర్వహించారు. మహిళా సమాఖ్య బాధ్యతలతో పాటు సీపీఐ నాయకురాలిగా పేద, బడుగు, బలహీనవర్గాలు, కార్మిక సంక్షేమం కోసం కృషి చేస్తున్నారు. మద్య నిషేధం కోరుతూ చేపట్టిన వివిధ ఆందోళనల్లో పోలీసుల నుంచి నిర్బంధాన్ని ఎదుర్కొన్నారు. కేసుల కారణంగా జైలు జీవితం గడిపారు. అక్రమంగా బనాయించిన వివిధ కేసుల్లో ఇప్పటికీ కోర్టుల చుట్టూ తిరుగుతున్నారు. మహిళల సమస్యలపై ఆమె చేస్తున్న పోరాటాలు రాష్ట్ర వ్యాప్తంగా గుర్తింపు పొందాయి. మహిళల సాధికారత కోసం అనునిత్యం కృషి చేస్తున్నారు. మహిళలపై జరుగుతున్న లైంగిక హింసకు వ్యతిరేకంగా, అత్యాచారాలకు వ్యతిరేకంగా అలుపెరగని పోరాటం చేస్తున్నారు. అనేక సందర్భాల్లో బాధితులకు భరోసాగా నిలిచారు. తమ పరిధిలో వారికి చేయగలిగిన న్యాయం అందించారు. మహిళల ఆత్మగౌరవం కోసం చేసిన అనేక ఉద్యమాల్లో పోలీసుల లాఠీ దెబ్బలకు ఎదురొడ్డి నిలిచారు. గంగవరం పోర్టు ఉద్యమం, విశాఖ స్టీల్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమాల్లో ముందున్నారు. విశాఖ రైల్వే జోన్ సాధన ఉద్యమంలోనూ తన వంతు పాత్ర పోషించారు. విశాఖ జిల్లాలో ఇల్లు లేని నిరుపేదల కోసం సీపీఐ నిర్వహించిన భూ పోరాటాల్లో కీలక పాత్ర పోషించారు. పెందుర్తి, మధురవాడ, నర్సీపట్నం తదితర ప్రాంతాల్లో వేలాదిమందికి సొంత ఇంటి స్థలాలను భూ పోరాటాల ద్వారా సాధించిపెట్టారు. ప్రధానంగా విశాఖ నగరంలోని మురికివాడల్లో నివసిస్తున్న పేద ప్రజల సమస్యల పరిష్కారం కోసం రేయింబవళ్లు కృషి చేస్తున్నారు. కరోనా సమయంలో నగరంలోని ఆరిలోవ, భగత్ సింగ్ నగర్, ఏ ఎస్ ఆర్ కాలనీ, లక్ష్మీ నగర్, సాయి నగర్, గణేష్ నగర్ తదితర ప్రాంతాల్లోని నిరుపేదలకు సీపీఐ తరపున నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. వివిధ ప్రాంతాల అభివృద్ధి కోసం అనేక ఆందోళన కార్యక్రమాలు నిర్వహించి ప్రభుత్వాల మెడలు వంచి పరిష్కారాన్ని సాధించారు. ఎవరికి ఏ సమస్య వచ్చినా తానున్నానంటూ అండగా నిలుస్తున్నారు.